# మార్గదర్శి

''పంతులూ! వెయ్యి కాదిక లక్ష చెప్పు నువ్వు; కాని నౌకరీకోసం సిఫార్సన్నమాట మాత్రం నాదగ్గిరయెత్తకు. సబ్ జడ్జీగారు మావియ్యంకులే కనక, నామాట కొట్టెయ్యరంటే వొప్పుకుంటాను. అయినా నేను సిఫార్సు చెయ్యను"

"దాపరికం యెందుకూ? నీవిషయమయ్యే కాదు, మా వియ్యంకుడుగారికే కాదు. ఇప్పుడేకాదు — ఎప్పుడూ, ఎవరికోసమూ, యెవరికీ సిఫార్సు చెయ్యను"

"చెయ్యకూడదని నేను నిరుకుచేసుకున్నాను"

"ఒట్టే పెట్టేసుకున్నాను"

"వారం దినాలనుంచి యిందుకోసం నన్నెందరో మొగమాట పెడుతున్నారు. మావూరివాడే వొక బి. ఏ వచ్చి నిన్ననల్లా నన్ను విసిగించేశాడు.

నాశపథం ధర్మబద్ధం కాదుట. ఈసంగతి నాచేత వొప్పిస్తానంటూ నాతో వాగ్వాదానికే సిద్ధపడ్డా డొక కోనసీమయువకుడు; కాని నే నెవరికీ లొంగలేదు"

"వాళ్ళ కష్టసుఖాలు కూడా నేను వినిపించుకోలేదు"

"ఖండితంగా పొమ్మనేశాను వాళ్ళని"

"నిజమే-కాని నీకోరిక తిరస్కరించిన్నీ నిన్నలా పొమ్మనలేకుండా వున్నాను నేను. నిన్ను చూసిన వేళావిశేషం యెలాంటిదో గాని, నీమీద నాకు దృఢ మైన స్నిగ్ధానుభూతి యేర్పడుతోంది. "ఈపిల్లవాణ్ణి దాస్యకూపంలో పడిపోనివ్వకు" అని యెవరో నన్నుద్బోధిస్తున్న ట్టుంది గట్టిగా"

"కనక, నిన్ను పొమ్మనను, నువ్వు వెళ్ళనే వద్దు. వెడితే, యిందుకోసం నువ్వు మరివొకళ్ళ నాశ్రయిస్తావు. ఈపట్టుపట్టు, చివరికి, ఎలిమెంటరీ స్కూలు మేష్టరీ అయినా సంపాదిస్తేగాని నువ్వాగేటట్టు లేదు"

"కూచో. ఈపూట మనం ఏకబంతిని భోంచేదాం ఉండు"

"నీకళ్ళల్లో చక్కని వెలుగు కనపడుతోంది. నీ మొగాన అనన్య సామాన్యమైన వర్చస్సు లాస్యంచేస్తోంది. ఇకముందు నువ్వు సాటివాళ్ళందరి లోనూ చుక్కల్లో చంద్రుడులా వుంటావనిపిస్తోంది నాకు. అంచేత నిన్ను విడిచిపెట్టలేకుండా వున్నాను నేను"

"నువ్వు నౌకరీ చెయ్యడం సుతరామూ నాకిష్టంలేదు. అంత కర్మమేం నీకూ? కాకపోయినా, నీకిప్పుడు వచ్చిన గండకత్తెర యేమిటి? కాలవ కింద రెండున్నర యెకరాల భూమి వుందంటున్నావు నీకు. ఏపాతదో కొంపకూడా వుందంటున్నావు. ఇక నీకు వచ్చిన లోటేమిటోయ్? సంకురాత్రి వచ్చిందంటే చచ్చు సంభావన, పాతికబస్తాల ధాన్యం తెచ్చి రైతులు నీవాకట్లో గుమ్మ రిస్తారు. పొదుపుగా వాడుకో గలిగితే-వేషాలకి పోకుండా వుంటే-గుడ్డిగవ్వ సంపాదించకపోయినా నాలుగ్గోడల మధ్యా పడివుండి నువ్వూ మీఅమ్మా గుట్టుగా కాలం గడుపుకోవచ్చు. పెళ్ళాంగా రింకా రెండేళ్ళదాకా రారని నువ్వే చెబుతున్నావాయె. అయినప్పుడు, ఇలాంటి స్థితిలో దిగాలుపడిపోయి కాళ్ళు విరగదొక్కుకుంటానంటా వేమిటోయ్?"

"ఇరవై యేళ్ళవాడవు నువ్వు, పూటకి గతిలేనివాడిలాగ, నిక్షేపం వంటి ప్రారంభజీవితం వొకళ్ళకి తాకట్టుపెట్టి కలుషితం చేసుకుంటా నంటా వేమిటోయ్?"

"ఎవడు చెప్పాడంట నీ కీ సలహా?"

"నాకు తెలుసు, నువ్విదేమీ ఆలోచించుకో లేదు. మొన్నటి దాకా ప్రపంచం అంటే యేమిటో యెరక్కుండా తిరిగావు. నిన్న తండ్రి లేనివాడ వయిపోయావు. ఇవాళ, సబ్ కోర్టులో కాశీ వచ్చిందని విన్నావు, సరి యెగబడ్డావు"

"ఇంతే కాదూ?"

"సరే, నీ ప్రయోజనం నువ్వు చూసుకున్నావు, మరి నా ప్రతిజ్ఞ?"

## 2

"స్కూలు ఫైనలు పరీక్షలో నెగ్గావు. నవయౌవనంలో ప్రవేశించావు. మనసులో వున్నది చక్కగా విప్పి చెప్పగల వాగ్ధార కనపడుతోంది నీదగ్గిర. దీనివల్ల తరతరాలుగా సంచితమైన బ్రాహ్మణప్రతిభ నీదగ్గర యెంతమాత్రమూ తక్కువగా లేదని స్పష్టపడుతోంది. ఇక వున్నదల్లా వొక్కటే లోటు"

"అది ఆత్మగౌరవం లేకపోవడం"

"దాని క్కారణం ఆత్మవిశ్వాసం కలక్కపోవడం"

"ఆత్మజ్ఞానం అంటే యేమిటో యెరక్కనే పోవడం"

"పోనీ, నువ్వీస్థితికి వచ్చావు గదా నీవూహలూ, నీవుద్దేశాలూ, నీకోరికలూ, నీసంకల్పాలూ, నీప్రయత్నాలూ, నీదీక్షలూ దీనికెంతవరకూ కారణాలో యెప్పుడైనా చర్చించుకున్నావా నువ్వు?"

"నేను" "నాది" అనే భావాలు ఆదినుంచీ వుంటాయి మనిషికి. అయితే నీ "అహం" కారానికిగల సత్తా యేపాటిదో, నీ "మమ" కారానికిగల దార్ఢ్యం యెంతటిదో యెప్పుడయినా చర్చించుకున్నావా నువ్వు?"

"ఐహిక జీవితం జయావహంగా గడుపుకోవా లంటే ఆత్మజ్ఞానం యెంత అగత్యమైనదో, అంతమంది గురువులయినారు కదా, వొక్క రయినా చెప్పారా నీకు?"

"మీనాయన అయినా చెప్పగలిగాడా?"

"ఊహూ"

"నువ్వే కాదు, నీవంటి వేలాదీ లక్షలాదీ యువకులు ఇలాగ తప్పు దారిలో పడిపోడానికి, అదిగో, అక్కడ పుట్టింది హేతువు"

"విజాతీయ విజ్ఞానబోధవల్ల రుచి మారిపోయిందే అనుకో. దానివల్ల స్వజాతీయవిజ్ఞానం లోపభూయిష్టంగా కనపడుతోందే అనుకో. పోనీ ఆవిజాతీయతలో వుండుకున్న విశిష్టతయేమయినా బోధపడిందా మనవాళ్ళకి? బుద్ధికి

ఆ సంస్కారం అంటిందా? విజాతీయుల ఆ సత్తా యేమాత్రమయినా సంక్రమించిందా?"

"దృక్పథం అయినా సరిగా మారిందా?"

"అసలు వుద్దేశం యేమయినా, యేవిషయం తెలుసుకోవాలన్నా అడ్డు లేకుండా సమస్త పరిభాషలతోటీ ఇంగ్లీషుభాష క్షుణ్ణంగా నేర్పిందే ప్రభుత్వం? ఏ విషయమై కావాలన్నా అపారమైన వాఙ్మయం వుందే ఆభాషలో? సర్వతో ముఖమైన ఆజాతి క్రమవికాసం యెలా సాధ్యపడిందో వివరించే చరిత్ర గ్రంథాలు వేలూ లక్షలూ వున్నాయే ఆభాషలో? మన యింగ్లీషు విద్యావంతు లెంతమంది కళ్ళతో అయినా అవి చూస్తున్నారు? మన యింగ్లీషు విద్యావంతు లెంతమందికి మన దౌర్భాగ్యదశ అవగాహన అయింది? మన యింగ్లీషు విద్యా వంతు లెంతమంది అందు కావేదన పొందుతున్నారు?"

"కనుకనే మనవాళ్ళకి దాస్యప్రీతి. ఏ. బీ. సీ. డీలు వచ్చాయంటే చాలు నౌకరీ మీదికి పోతుంది చూపు"

"నౌకరీకోసమే అసలు ఏ. బీ. సీ. డీలు ఆరంభించడం"

"వర్ణధర్మం యేమిటీ?" అన్న ఆలోచనలేదు. "కుటుంబ సంప్రదాయం యెలాంటిదీ?" అన్న విచారణ లేదు. చదివిన శాస్త్రాలవల్ల కలిగే ప్రయోజనా లేమిటో అది గుర్తులేదు. రుచి అసలే లేదు"

"కళాశాల విడిచింది మొదలు — ఇక వొక్కటే ధోరణి, నౌకరీ, నౌకరీ నౌకరీ అని"

"ఈవింత గమనించావా? మున్సబు కరణాల కొడుకులకూ నౌకరియే కావాలి. తహస్సీలుదారు కొడుక్కీ, కలెక్టరు కొడుక్కీ, గవర్నరు కొడుక్కీ నౌకరీయే కావాలి. అగ్రహారీకుని కొడుక్కీ, ముఖాసాదారు కొడుక్కీ నౌకరీయే కావాలి. జమీందారు బిడ్డదాకా యెందుకూ, ఆజమీందారుకే నౌకరీ కావాలి. అవధానులు కొడుక్కీ, శాస్త్రి కొడుక్కీ నౌకరీయే కావాలి. వర్తకుని కొడుక్కీ, పెద్దకాపు కొడుక్కీ నౌకరీయే కావాలి. చాకలి, మంగలి, తలారి—వీళ్ళ కొడుకులకూ నౌకరీయే కావాలి. వంటబ్రాహ్మడికొడుక్కీ, పురోహితుడికొడుక్కీ నౌకరీయే కావాలి. పది యిళ్ళల్లో భోజనానంతరం స్థలశుద్ధి చేస్తూ పొట్టపోసు కునే వితంతువుకొడుక్కీ నౌకరీయే కావాలి"

"చదువుకోవడమే తటస్థపడితే ముష్టివాడి కొడుక్కీ నౌకరీయే కావాలి, మరోటి పనికిరాదు"

"ఇన్ని తరహాలవాళ్ళూ ముసురుకోవడంవల్ల చివరికి ఈ నౌకరీకి "ఉద్యోగం" అని ముద్దుపేరు"

"గవర్నరు భార్యా తన భర్త ఉద్యోగస్తుడనే చెప్పుకుంటుంది. వెట్టివాని పెళ్ళాము తన పెనిమిటి ఉద్యోగస్థు డనే చెప్పుకుంటుంది"

"ఈవ్యామోహం యెంతవరకూ వెళ్ళిందో తెలుసా? తల్లి, తనకొడుక్కి నౌకరీయే కావాలని కోరుకుంటూ వుంటుంది. అత్తగారు తన అల్లుడు నౌకరీ చేస్తూవుంటేనే అతనితో సంబరపడుతూ మాట్లాడుతుంది. కన్య, తనని పెళ్ళాడే వాడు నౌకరీ చేస్తూ వుంటేనే మురిసిపోతూ పీటలమీద కూకుంటుంది. పిల్లలు, తమ తండ్రి నౌకరీచేస్తూ వుంటేనే "ఫలానా ఆయన బిడ్డలం" అని వెన్ను విరుచుకు తిరుగుతారు"

"కారణం?"

"ఒకటి- రాజ్యాంగం ప్రజలచేతుల్లో లేకపోడం. అంచేత, గొప్ప పండితుడూ, మహాకవీ, అఖండశాస్త్రవేత్తా, పెద్దకాపూ, కోట్లకు పడగలెత్తిన వణిక్చిఖామణీ, సాటిలేని పారిశ్రామికుడూ, చివరికి, పత్రికా సంపాదకుడూ కూడా దలాయతుకైనా యెదురుచెప్పడానికి వల్లకాదు, దాసోహమ్మనవలసిందే. అక్రమమైన యీ అధికారదర్పం చూసే ప్రతీ ఏ. బీ. సీ. డీ. కూడా నౌకరీకే యెగబాకడం"

"రెండు—ఫలితం విషయమై తనకేమీ బాధ్యత లేకపోవడం. సాధ్యమైనంతవరకూ వొళ్ళు దాచుకోడానికి వీలుండడం, "యజమాని యేమంటే యేమిపోయింది. నెల తిరిగాటప్పటికి జీతం డబ్బులు చేతిలో పడతాయిగదా" అనే సిగ్గుమాలినతనం ముదిరిపోవడం."

"వృత్తులు నీచాతినీచాలు" అన్న భావం అస్థిని పట్టిపోడంవల్ల వచ్చిన పుట్టిమునక యిది"

"స్వరాజ్యం నా జన్మహక్కు" అని ఘోషించే జాతిఉండవలసిన యోగ్యత యిదేనా! ఆధ్యాత్మికదృష్టే జీవంగా గల జాతి కనపరచవలసిన విశిష్టత యిదేనా?"

## 3

"నువ్వాశించే నౌకరీకి దొరికే జీతం నెలకిరవై రూపాయిాలు. దానిపేరు మాత్రం గుమాస్తాగిరీ; కాని బంట్రోతుల క్కూడా యింతకంటే యెక్కువే జీతం. అయినా, నువ్వందుకే సిద్ధపడుతున్నావు"

"అంటే యేమన్నమాటా? నువ్వు చెమటవోడ్చి పనిచెయ్యదలుచుకున్నా వన్నమాటే కాదూ? నీ ఆభిజాత్యం యేమయిపోయినాసరే అని సర్వానికీ తెగించావన్నమాటేకదూ? అయితే అవలంబించబోయేది యెలాగా వర్ణాశ్రమాచారం

కానప్పుడు, మరో నాలుగు డబ్బులు యెక్కువ వచ్చేదే యెందుకు చేసుకో గూడదూ?"

"ఉహు, పనికిరాదు, ఉద్యోగమే కావాలి. నువ్వు పెద్ద కలెక్టరువో, జిల్లాజడ్జివో, కనీసం తహస్సీలుదారువో, కాదంటే పెద్ద ప్లీడరువో అయిపోతా వనుకున్నారు మీవాళ్ళు. కాని నువ్వు బి.ఏ. వయినా కాలేకపోయావు గుర్తించు కున్నావా? అలా కాలేకపోయినందుకు నీ చూపేమయినా మారిందా? జడ్జిపని యెలాంటి వుద్యోగమో సబ్ జడ్జికోర్టులో నకళ్ళగుమస్తాపనీ అలాంటి వుద్యోగమే మనవాళ్ళ దృష్టిలో. కనకనే చివరికదయినా కొట్టేద్దామని నువ్విలా అవస్థ పడడం. అయితే, నువ్విప్పుడాశిస్తూ వుండిన నౌకరీకోసం బి.ఏలు కూడా పడిగాపులు పడివున్నారు, తెలుసా?"

"గత్వా గత్వా నీకిది లభిస్తుందే అనుకో; కాని విధంచెడ్డా ఫలం తక్కదే? కాని కూడుతిన్నా కడుపునిండదే? ఒళ్ళు వంచి పనిచేసే కూలీలు కూడా యింతకంటే యెక్కువే సంపాదించుకుంటున్నారే? నువ్వు చదివిన చదువుకి, బతికి వున్నంతకాలమూ నౌకరీ చేసినా జీతం యాభై రూపాయలు మించదే? ఏదయినా వృత్తిఅయినా, చిన్న వ్యాపారం అయినా పెట్టుకుంటే, మొదట మొదట బాగుండకపోయినా, పోను పోను ఐశ్వర్యవంతుడవు కావచ్చు నేమో యోచించుకున్నావా?"

"బాడిత చేతబుచ్చుకొని దుంగలూ దూలాలూ చెక్కుతాడు వడ్రంగి. సమ్మెట యెత్తి యినుము సాగకొడతాడు కమ్మరి. మట్టి పిసికి కుండలు చేస్తాడు కుమ్మరి. నూలు వొడికి గుడ్డలు నేస్తాడు దేవాంగి. కలం పుచ్చుకుని మెదలు పడిపోయేటట్టు లెక్కలు రాస్తాడు గుమాస్తా"

"గ్రహించుకుంటే అంతాశ్రమే. రకంలో తప్ప రాశిలో భేదంలేదు, కాని తక్కిన వారు స్వతంత్రులు. గుమస్తా మాత్రం—"

"నౌకరు"

"బానిస"

"ఈభేదజ్ఞానం యేమయినా నీతల కెక్కుతోందా!"

"పూటకి టికాణాలేనివాడూ, ఆకస్మికంగా సంసారంమీద పడ్డవాడూ యిది బోధపరుచుకో లేకపోవచ్చు. బోధపరుచుకోకలిగినా యే అవకాశాలూ లేక నౌకరీకే సిద్ధపడవచ్చును"

"కాని, నన్నడిగితే, అవకాశం వుండిన్నీ బోధపరచుకోలేనివాళ్ళే మనలో యెక్కువ. మొన్ననే వొక బి.ఏ. ఈ విషయమై నాతో వాదానికి దిగాడు.

అత నన్నదేమిటో తెలుసా? బి.ఏ. కావడానికి అతనికి చాలా పెట్టుబడి అయిం దిట. బి.ఏ. కావడంతో తానొక గొప్ప అంతస్థుకి వచ్చినట్టేట. కనక, ఆ బి.ఏ. పట్టమే మళ్ళీ డబ్బుగా మారాలిట. ఉద్యోగంచేస్తేనే అది సాధ్యంట. ఏదయినా వృత్తి అవలంబించినా, వ్యాపారం ప్రారంభించినా దానికి మళ్ళీ పెట్టుబడి కావాలిట. తరుగులేని వొక సాధనం చేతికి చిక్కాక అది కాదని, మళ్ళీ యింకొక సాధనం సంపాదించుకోడానికి డబ్బు ఖర్చుపెట్టడం దండుగా, వొట్టి అవివేకమూట"

"బోధపడిందా?"

"ఈరకం విద్యావంతులతో నిండి వుండిన మనదేశంలో వృత్తులూ, పరిశ్రమలూ పెంపొందడం సాధ్యమేనా? జీతం అంటే చదువుకోసం పెట్టిన పెట్టుబడి నూరూ వెయ్యారెట్లు అయి మళ్ళీ చేతికి వచ్చేది అనుకునేవాళ్ళు జాతికీ దేశానికీ కూడా సర్వనాశనం సంఘటించే వుద్యోగం దొరికినా విడిచి పెట్టరన్న మాటే కదూ?"

"తిన్నా గడిచిపోతుంది తినకపోయినా గడిచిపోతుంది దినం. తిన్నవాడు దొరికే తినడంలేదు, తిననివాడు దొరక్కే మానడం లేదు. గ్రహించుకోగలిగితే దొరకడానికీ తినడానికీ అసలు సంబంధమేలేదు. తినడానిక్కావలసిన శక్తి వేరూ, దొరకడానిక్కావలసిన శక్తి వేరూను. ఈ రెండు శక్తులూ వుండినా పని చెయ్యాలంటే అందుకు మరోశక్తి కావాలి. కృత్యవిభాగం అనుసరించి ఇన్ని రూపాలుగా కనపడ్డా, అసలు, శక్తివొకటే"

"అయితే, శక్తిలేని మనిషిని చూపించగలవా నువ్వు? ఉన్నశక్తి వినియోగపరుచుకోలేనివాళ్ళని మాత్రం నేనెంతమంది నయినా చూపించగలను మన ఆంధ్రుల్లో.

"ఇంతకీ-దరిద్రం అంటే డబ్బు లేకపోవడంకాదు, బుద్ధిలేకపోవడం. అడుక్కుతింటూ చెట్టుకింద కాలం గడిపేవాళ్ళని దరిద్రులంటుంది మన సంఘం. ఇది అర్థంలేనిమాట. వాళ్ళకి కావలసినంతశక్తి వుంది; కాని దానికి వినియోగంలేదు, అంతే"

"అలా లేకపోవడానికి సన్నికృష్టకారణం, వాళ్ళకి సిగ్గూ భిడియమూ లేకపోవడం, విప్రకృష్టకారణం, మన ఆధ్యాత్మిక దృష్టి. ద్రవ్యం ఉత్పత్తి చేసే శక్తిని, వాళ్ళు అడుక్కోడానికి-అంటే, శ్రమజీవుల పరిమిత సంపాదనలో కొంతభాగం దౌర్జన్యంగా దోచుకోడానికి వినియోగిస్తున్నారు. అయితే, మన సంఘానికి, ఈ తప్పు దిద్దుకునే శక్తే కాదు గుర్తించుకునే శక్తికూడా లేదు. పైపెచ్చు, అడుక్కుతినే చిత్తవృత్తిని ప్రోద్బలపరిచే శక్తే వుంది."

"చెప్పవచ్చిం దేమిటంటే? పనిచెయ్యడానికి ఆక్షేపణా బద్ధకమూ లేనప్పుడు, భుక్తికి లోటులేని నువ్వు, ఇతర్లకు సేవచెయ్యడం యెందుకు చెప్పు. నీవంటి ప్రతిభాశాలి, ఆశక్తి నితర్లకు ధారపొయ్యడానికి బదులు తనకే యెందుకుపయోగ పరచుకోరాదూ?"

"ఇదీ నేనడిగే ప్రశ్న"

"పద్దెనిమిదో యేట యీ ప్రశ్నే నన్నెదురుకుంది. అప్పటి స్థితి తలుచుకుంటే యిప్పటికీ శరీరం గజగజ లాడిపోతుంది నాకు. ఈశ్వరానుగ్రహం వుంది కనక నేనెలాంటి దుర్దశ దాటుకువచ్చానో నువ్వెరగవు. నామేడా నాఅంగడీ చూస్తే అసలు నీకి సందేహమే కలగదు. నరకయాతనల్లో కూడా అంత తీవ్రమైనది వుండదు. శివశివా! లోకంలో యెంతమంది దాని ఆక్రమణలో పడిపోతున్నారో! ఎదిరించి నిలవరించుకోగల శక్తివుండిన్నీ బుద్ధి లేక, దానికింద పడి యెందరు నలిగి పిప్పి పిప్పి అయిపోతున్నారో?"

## 4

"సెంటుభూమి లేదు. చేతిలో రాగిదమ్మిడీ అయినా లేదు. సంపాదన లేదు. ఇంకా ఆచూపే కలగలేదు. అప్పడే పదిహేడో యేడు వెళ్ళింది. ఇష్టం వచ్చినప్పుడు బడికివెళ్ళడమూ, తరుచు ఆటలాడుకోడమూ తప్ప వేరేధ్యానమే లేదు. అలాంటి సమయాన, హఠాత్తుగా జ్వరం వచ్చి, అది సన్నిపాతించి, పద్దినాల్లో మానాయన యెగిరిపోయాడు."

"ఆపద్దినాలూ యెలా గడిచాయో, యెవరు గడిపారో నే నెరగను. ఉండుండి ఒక్కొక్క కుటుంబంగా వచ్చిన చుట్టాలందరూ వొక్కక్షణంలో యెవళ్ళ యింటికి వాళ్ళు వెళ్ళిపోయారు. ఇక వికృత రూపంతో మా అమ్మా, స్తబ్ధుణ్ణయిపోయి నేనూ మిగిలాం"

"అయితే, మాఅమ్మ యెలాంటిదో యెరుగుదువా? మీ అందరి అమ్మల వంటిదీనా మాఅమ్మ? అబ్బే, మాఅమ్మ సాక్షాత్తూ ఆపార్వతీదేవి కాదుటోయ్?"

"మానాయన చనిపోయినందుకు నేను విచారించకపోలేదు; కాని తరవాత్తరవాత అది మరుపు వచ్చింది. మాఅమ్మ పోయినప్పుడు మాత్రం పెద్ద సంసారి నయివుండినా నాకు దుఃఖం దుర్భరం అయిపోయింది. ఆవిడ పోవడం యీఅరవై యేళ్ళ వయస్సులో కూడా నాకెంతో లోటుగానే వుంది. ఆవిడ జ్ఞాపకం వస్తే వొకందు కానందమూ ఒకందుకు దుఃఖమూ వూపేస్తాయి నన్ను"

"ఒకనాడు, చద్దన్నం తిని నేను వాకట్లో కూచున్నాను. వెనకటి ఉత్సాహం అంతా ఏమయిపోయిందో వుసూరుమంటూ వుండిపోయాను. భవిష్యత్తును గురించి ఇంకా ఆలోచన యేమీ పుట్ట లేదు. ఏమిటో మందుతిన్న ట్టయిపోయి కూచుండిపోయాను."

"అలాంటప్పుడు మా అమ్మ వచ్చి, పక్కనికూచుని, కొంతసేపు ఏమ టేమిటో బుజ్జగిస్తూ మాట్టాడింది. తరవాత, మెల్లిగా కంఠం సవరించుకుని, నెమ్మదిగా మాటతెచ్చుకుని "పదికుంచాల బియ్యమూ, రసవర్గమూ, పది రూపాయల రొక్కమూ వున్నాయి. నెల దినాలు గడిచిపోయాయి. మరి తరవాత కాలం యెలా గడుస్తుందీ? ఏ మాలోచించావు తండ్రీ?" అనడిగింది లాలనగా. అలా అడగవలసివచ్చినందు కామె ప్రాణం యెంతకొట్టుకుందో, ఏదో బాధా, విచారమూ, జాలీ, ప్రేమా, వాత్సల్యమూ చిందులాడుతూ వుండినాయి"

"ఎంత భేదమో గుర్తించావా? మా నాయన వుండినంత కాలమూ అన్నం కలిపి ముద్ద నా నోటి కందించిన మా అమ్మ, ఆయన పోయి, ఆపద్దినాలూ గడిచాటప్పటికి మాతృవాత్సల్యంలో నాకు కొత్తరుచి చూపించింది. అందే యేమిటో తెలిసిందా? అంతవరకూ నాకడుపు తానే నింపడానికి పాటుపడిన మాఅమ్మ అదిమొదలు నాకడుపు నేనే నింపుకోగలిగేటట్టు నన్ను దిద్దడానికి పూనుకుంది"

"నా కప్పు డొక సంగతి జ్ఞాపకం వచ్చింది. మా స్వగ్రామంలో మా యింటి పక్కని వొక బ్రాహ్మణ కుటుంబం వుండేది. మా అంతనిరాధారులు కారు వారు; కాని వున్నది చాలదు. చన్నీళ్ళకి వేన్నీళ్ళు సాయం అన్నట్టు, ఎంతో కొంత సంపాదించుకోవాలి. అలాంటి సంసారంలో కలరా వచ్చి యజమాని హఠాత్తుగా కాలంచేశాడు."

"ఆయన కిద్దరు కొడుకులు. ఒకడు మైనారిటీ వెళ్ళినవాడూ, వొకడు వెళ్ళవలసినవాడూ, తల్లీ — ముగ్గురు మిగిలారు. ఒకనాడు, యాభై యేళ్ళు నిండిన తల్లి, రుసరుసలాడుతూ వచ్చి "ఆ మహారాజు బతికివుండినంతకాలమూ కమ్మగా తిన్నారు. ఇక మీ గడ్డి మీరు తినండి" అని రుంజుకుంటూ చక్కా పోయింది. అప్పట్లో నాకది సరిగా అర్థం కాలేదు. అయినా, యెలాగో అని పించింది. మాఅమ్మ మాత్రం ముక్కున వేలుపెట్టుకుంది. "కనిపెంచిన బిడ్డలనే అలా అనడం?" అంటూ చాల నొచ్చుకుం దామె.

"మరి మానాయన పోయినప్పుడు మాఅమ్మ యేమందో యెరుగుదువా?

సంసారభారం వహించవలసిన బాధ్యత నామీద యెంత చక్కగా మోపిందో అర్థం చేసుకున్నావా? ఆవయస్సులో, సంసారసంబంధమైన పనియేమి చెప్పినా యెగిసిపడతారు కుర్రాళ్ళు. మాతృత్వం అంటే, బుజ్జగించి వాళ్ళ నందుకు సిద్ధపడేటట్టు మెల్లిగా ప్రోత్సహించడంగాని ఆజ్ఞలు వెయ్యడంకాదు. లోకంలో, యిది చాలా కొద్దిమంది తల్లులకే తెలిసివుంటుంది. వారిలో మాఅమ్మ నాయకమణి. అప్పడామె అన్నమాటలు నా కిప్పటికీ జ్ఞాపకం. "తండ్రీ, బెంబేలుపడిపోకు" అందావిడ ముందు. తరవాత "నారుపోసినవాడు నీరు పొయ్యకమానడు. నువ్వు ఏ తపోభంగం వల్లనో నాకడుపున పుట్టావు. నీ నొసట కష్టం రాసి వుంది. అయినా, మనస్సు పాడుచేసుకోకు ధైర్యంగా వుండు. నిదానించు. అంతే" అంటూ వీపు నిమిరింది"

"నా మనస్సు మంత్రించిన ట్టయింది. అయితే, నేను నిదానించి చేసే దేమి వుంది, నిదానించక చెయ్యనిదేమివుంది? విచారం అంటే యేమిటో యెరగని వయస్సున, రెక్కాడకపోతే డొక్కమాడే సంసారం హఠాత్తుగా మీద పడడం - ఆస్థితి ఊహించుకోగలవా నువ్వు? అయితే, యెలాంటి దైనా అది మోసేవాడూ మనిషే, దిగ్భ్రాంతుడై దానికిందపడి అణగారిపోయేవాడూ మనిషే. ఇంతకీ;— "మనం పెట్టిపుట్టామా లేదా?" అని కాదు "మనకి మగతనం వుందాలేదా?" అని చూసుకోవాలి"

"బండరాయి చూస్తే "దీన్ని కదపగలమా?" అనిపిస్తుంది; కాని, బుద్ధి వుంటే దాన్ని కొండమీదికే యెక్కించవచ్చు, సునాయాసంగా. సాగదీసి దాన్నొక్క తన్ను తన్నితే మన కాలు పిప్పిపిప్పి అయిపోతుంది. అలాకాక, వోపిక పట్టి దాని మీదుగా నడవడం ప్రారంభిస్తే తుక్కుతుక్కు అయిపోవలసిన యీ కాలి రాపిడికే అది అరిగి పచ్చడిబద్ద అయిపోతుంది"

"వాస్తవంగా, సంసారం సంగతి కూడా అంతే. రెండు కళ్ళతోనూ చూస్తామా అది స్వాధీనంలో వుంటుంది. కళ్ళు మూసుకుంటామా, వూబిలో వూరదొక్కేస్తుంది. నేను బడాయి చెప్పకోడం కాదు, ఆ నిరాధార స్థితిలో కూడా నే నిలాగ ధైర్యమే తెచ్చుకున్నాను; గాని అధైర్య పడలేదు. "నిలవ చేస్తామా లేదా" అంటే అది వేరే సంగతి. ముందు కాలం కడిపేసుకోగల సత్తావుంటే తరవాత అంతా సలక్షణంగానే జరిగిపోతుంది"

"దినాలు గడపడాని కనేక మార్గాలున్నాయి. లోకంలో, మనుష్యుల కంటే సంసారం నిర్వహించుకునే వుపాయాలే యెక్కువగా వున్నాయి. ఎవడి కయినా అందుకు దారి దొరకలేదంటే వాడి తలలో మెదడు లేదన్నమాట. వాడిపుట్టుకే మనిషిపుట్టుక కాదన్నమాట"

## 5

"అలా అని మా అమ్మ వంటింటోకి వెళ్ళిపోయింది. నేను వెళ్ళి, వీధి అరుగుమీద కూచుని ఆలోచన ప్రారంభించాను. పది నిమిషాలు గడిచాటప్పటికి రకరకాల నౌకరీలను తరిమికొట్టి లక్షలాది వృత్తులు వచ్చి నా యెదుట నుంచున్నట్టు కనపడ్డాయి. వాటిలో, నాకెన్నో అందుబాట్లో వున్నట్టున్నా కనిపించాయి; కాని నేనంతలో నిర్ధారణ చేసుకోలేకపోయాను. చిన్నతనం. పైగా, అప్పటికి నా విద్యాపరిమితి థర్డుఫారం. చదువు కలిగించే సంస్కారం అంటడానికి అవకాశం లేని సందర్భం అది. మా నాయన మొదటే శ్రద్ధచేసి వుంటే నేనప్పటికి మెట్రిక్కయినా అయిపోయి వుందును. నాకు పధ్నాలుగో యేడు వచ్చేదాకా మా నాయన మహేంద్రవాడ విడిచిపెట్టలేదు. అప్పుడయినా మా అమ్మ బలవంతాన కదిలాడు. "అబ్బాయి బాగుపడేమార్గం చూడరూ?" అంటూ మా అమ్మ యెన్నోమాట్లు పోరింది. కానయితే, అక్కడా యిక్కడా కూడా తంబురా పుచ్చుకుని మా నాయన భిక్షాటనం చెయ్యడమే; కాని మహేంద్రవాడ విడిచిపెడితే నాకంతకంటే మంచి మార్గం దొరుకుతుం దని మా అమ్మ ఆశ. దొరికేటట్టు చెయ్యాలని పట్టుదలాను"

"పల్లెటూళ్ళవాళ్ళకి పట్నం అంటే భయం. పట్నాలవాళ్ళకి పల్లెఅంటే అసహ్యం. చిన్నప్పణ్ణుంచీ చూస్తాను జనుల్లో యీభావాలు మారలేదు. నామట్టుకి నాకు మాత్రం, అభయానికీ, కారణం కనబడదు, యీ అసహ్యానికీ హేతువు కనబడదు. ఇవి రెండూ కూడా కేవలమూ భ్రాంతిమూలకాలు. ప్రపంచమే ద్వంద్వభూయిష్ఠం. సుఖం వున్నచోట కష్టమూ, కష్టంలో సుఖమూ ఉంటూనే వుంటాయి. ఇక పట్నాలను ద్వేషించడానికీ పల్లెలను ఏవగించుకోడానికీ అవకాశం యెక్కడ?"

"దీనికి సాయం "పల్లెలకు మళ్ళండి" అని యిప్పుడొక ప్రచారం. పెద్ద లనిపించుకునే వాళ్ళే యిది సాగిస్తూ వుండడం ఆశ్చర్యకరం. నావంటి వాడు పల్లెటూళ్ళో వుండి యేమిటీ చెయ్యడం? భూవసతి మాత్రమే వుండిన వాళ్ళు పట్నాలలో వుండి యేమిటీ చెయ్యడం?"

"నన్నడిగితే పల్లెటూళ్ళలో వుండవలసినవాళ్ళు వేరూ పట్నాలలో వుండవలసినవాళ్ళు వేరూను. ప్రాకృతస్థితిదాటిన జాతికి పట్నాలూ వుండాలి, నగరాలు కూడా వుండాలి. చరిత్ర అర్థంచేసుకోగలవాళ్ళకి పల్లెలకు ఎప్పుడు సౌష్ఠవస్థితి యేర్పడ్డదో అప్పుడే పట్నాలూ, వాటిపునాదిమీద నగరాలూ వెలిసినట్టు బోధపడుతుంది."

"పాశ్చాత్యనాగరికత వచ్చి మన పట్నాలూ నగరాలూ పెంపేసిం దనడమూ, పల్లెలను నాశం చేసిం దనడమూ శుద్ధ అవివేకం. మనకి మహోన్నతమైన పూర్వచరిత్రా అనన్య సామాన్యమైన సభ్యతా చాలా కాలం వుండినవని తెలియనివాళ్ళు చెయ్యవలసిన వాదం అది. వేదాలకాలంనుంచీ మన దేశంలో పట్నాలేకాదు, నగరాలూ వుండినాయి. అప్పుడు కూడా మన పట్నాలకూ నగరాలకూ వుండిన ఆకర్షణా గౌవరమూ పల్లెలకు లేశమూ లేదు. అలా అని అప్పుడెవరూ పల్లెలను నిరసించనూలేదు, నగరాలను దుమ్మెత్తి పొయ్యనూలేదు. ఎవళ్ళకెక్కడ సుఖంగా వుంటే వాళ్ళక్కడ వుండి సుఖాన బతికారు"

"మనం మహోన్నతనాగరికత అనుభవించిన దినాల్లో పాశ్చాత్యులు, ఇప్పుడు మనంవుండిన స్థితికంటే అధ్వాన్న స్థితిలో వుండినారు; కాని చూస్తూ వుండగా వారు పైకి వచ్చేశారు, మనం అడుక్కి పడిపోయాం, ఎవ రేమన్నా యివాళ పాశ్చాత్యనాగరికతే నాగరికత. అప్పటి మన ఉన్నతిని తలచుకుని మురిసిపోయే మనం, ఇప్పటి, వారి, ఉన్నతిని గర్హించడం అవివేకం.

"ఉందో లేదో నిర్ధారణలేని ఆలోకం కోసమా మనం యీలోకంలో పుట్టాం? ఈలోకంలో వుండిన సర్వసమృద్ధీ మనుష్యులకు వినాశం తెచ్చిపెట్ట డానికేనా?"

"ఆధ్యాత్మికదృష్టి యెప్పుడేర్పడ్డదో అప్పుడే మనకి పతనం ప్రారంభం అయింది. జగత్తు అంతా మిథ్య అనుకుని నిర్లిప్తత పట్టుకు పాకులాడేవాళ్ళకి బానిసతనం కాకపోతే మరేం సిద్ధిస్తుందీ?"

"ఉన్నతజీవితానికి కావలసిన సాధనసంపత్తి కల్పించుకోడానికి బద్ధ కించి, ప్రతీవిషయంలోనూ, ఎక్కడికక్కడికే ఉన్న దానితో తృప్తిపడే చిత్తవృత్తి మాత్రమే పల్లెలకు ఆధిక్యం ఆరోపిస్తుంది"

"కాకపోయినా:- పల్లెలకు, మనవాళ్ళు ఆదర్శకత్వం అంటూ యేదో వూహించుకుంటున్నారు చూడూ, వారి వూహలు దాని పై మెట్టుకి వెళ్ళలేవు గాని, అదిగో, ఆ ఆదర్శకత్వమే ఆ పల్లెలు పట్నాలయిపోడానికి బీజం అయి వూరుకుంటుంది. ప్రతిభావ్యుత్పత్తులు పూర్తిగా వినియోగించుకున్నా మంటే మన ఆశలిక హద్దుల్లో వుండవు"

"మన సనాతనవాఙ్మయం పరిశీలించు. మన జాతికి, ఇప్పుడు పాశ్చాత్య జాతులకు కంటే యెక్కువ భౌతికదృష్టి వుండింది; కాని, కాలక్రమాన, అన్య జాతుల భౌతిక సాధన యెదట మన భౌతికసాధన లిగా డయిపోయింది. దాంతో మనకి స్వరాజ్యంపోయి పరప్రభుత్వం యేర్పడిపోయింది"

"మనకి దాస్యం బలపడినకొద్దీ ఆధ్యాత్మికచింత పెరిగిపోయింది. దాంతో జనులకు అజ్ఞానం అలుముకుంది. వ్యక్తిత్వం నశించిపోయింది. చివరికి, అంతర్వేది అవతల వూళ్ళు లేవన్న స్థితి వచ్చేసింది. ఇది జాతికి అస్థిగతం అయిపోయింది. దీని దుష్ఫలితమే తృప్తి. మనవాళ్ళకి అర్థంకాదు గాని మన దాస్యం స్థిరపడిపోడానికి ఈతృప్తే కారణం"

"చెప్పవచ్చిందేమిటంటే? ఈ తృప్తిని పురస్కరించుకుని మాయింటో చాలాకాలం పెద్దయుద్ధం జరిగింది. "వెర్రిదానా, యీపల్లెటూళ్ళో అన్నం దొరక్క మనం మాడిపోతున్నాముటే?" అని మా నాయన. "అయ్యో, పట్నాలలో మాత్రం యెవరయినా అన్నం లేక మాడిపోతున్నారుటండీ?" అని మాఅమ్మ. "ఈదేవాడికి తెలుస్తాయి సంసారసాగరంలో వుండేతిప్పలు" అని మా నాయన. "అక్కడికి నేనే యీదడం లేనట్టు" అని మాఅమ్మ"

"దీని కెన్నో చిలవలూ పలవలూను. ఎప్పటికప్పుడే కొత్త సంగతులూ కొత్త యెత్తులూను. అయితే, చాలాకాలం మా నాయన తృప్తి గెలిచింది; కాని ఉండుండి, చివరికి మాఅమ్మ సుఖతృష్ణే నెగ్గింది"

"మా అమ్మే నెగ్గేసింది. వాదంలోనే కాదు, ఫలితంలో కూడా మాఅమ్మే గెలిచింది. నిజంగా, మా అమ్మే నన్ను బాగుచేసింది. ఆవిడ వేసిన పునాది మీదనే నేను విజయసౌధం నిర్మించగలిగాను. ఆవిడ శుభచింతనమూ తోడ్పాటూ మాత్రమే నా పరిశ్రమకు సాఫల్యం కలిగించాయి. నేనీ సంపత్తి సంపాదించానంటే యిందులో నాప్రజ్ఞచాలా తక్కువ. దీని కంతకి కీలకం మాఅమ్మ నిర్వహణం వొక్కటే. అసలు, ఆవిడ కడుపున పుట్టడమే మహాభాగ్యం. "నాయనా, ఊరికే కూచున్నావా?" అంటూ మాఅమ్మ ఇప్పటికీ నన్నుద్బోధిస్తున్నట్టే వుంటుంది. ఇలా అనిపించాటప్పటికి-చూడూ చూడూ యీమాట చెబుతూ వుంటేనే నావొళ్ళు ఎలా గరిపొడిచేసిందోను?"

"సత్యం గుర్తించగలిగితే బిడ్డల పెంపకంలో వున్న బాధ్యత అంతా తల్లిదే. ఆ విషయమై తండ్రికంత మమతా వుండదు, శ్రద్ధా వుండదు, వీలూ వుండదు. అంచేత తండ్రి కంటె తల్లి దగ్గిర బిడ్డలకు చనువెక్కువ. ఆచనువుతోనే, తల్లి, బిడ్డలను తన ఆదుపాజ్ఞల్లో వుంచుకోగలుగుతుంది. ఆచనువే బిడ్డల మీద మత్తుమందులా పనిచేస్తుంది. అలాంటి చనువు చూపించగల తల్లే బిడ్డల జీవిత విజయానికి మార్గాలు పరిష్కృతాలు చేసిపెట్టగలుగుతుంది. అలాంటి తల్లుల కడుపున పుట్టినవాళ్ళే లోకంలో గొప్ప పనులు చేసిన వారందరున్నూ, బాగా పరకాయించి చూసుకో"

# 6

"అలా కూచోడం కూచోడం, సుమారు నేనొక్క గంట కూచున్నాను. ఆగంటా వొక్క దీక్షతోనే ఆలోచన చేశాను. అప్పటికి, హఠాత్తుగా, నాతలలో యేదో మెరుపు మెరిసినట్టయింది. నిదానించగా, వెనకటిదే ఒకానొక సంగతి జ్ఞాపకం వచ్చింది"

"చెబితే "వోస్! ఇదేనా?" అంటావు నువ్వు; కాని మహా మంచి సంగతి అది. అదే నన్నీ స్థితికి తెచ్చింది. ఇంతేకాదు, నా జీవితాకాశాన అది యెప్పుడూ ధ్రువతారలాగ మిలమిల్లాడుతూనే వుంటుంది"

"నిరుపేదల యింటో పుట్టి అష్టైశ్వర్యవంతు లైన వాళ్ళ జీవితాలూ, అపూర్వాలైన గొప్పపనులు చేసినవారి మనుగడా, అజ్ఞానాంధకారంలో నుంచి విజ్ఞానప్రభల్లోకి వెళ్ళిపోయిన వారి చరిత్రా పరిశీలిస్తే అలాంటి కీలకాలే కనపడతాయి; అయితే వాటిశక్తి కార్యకారణాలకు అతీతం అయివుంటుంది. హేతువాద బద్ధమైన జనసామాన్యం విప్పి చెప్పినా వాటివిశిష్టత గుర్తించుకోలేదు; కాని సాధారణంగా అవే గొప్పవారి జీవితక్రమం సరిదిద్దినవి అయి వుంటాయి"

"నా తలలో మెరిసిన మెరుపు సరిగా అలాంటిదే. కనకనే భిక్షాటనం చేసుకునే బ్రాహ్మడి కడుపున పుట్టిన నేను ఇవాళ ఏడెనిమిది లక్షల కధికారినయి వుండడం"

"మహేంద్రవాడలో, మాయింటి యెదుట వొక బీద కోమటి వుండేవాడు. ఒకగదీ, వొక వసారా, వీధిలోకి మూరెడు వెడల్పు అరుగూ – ఇంతె అతని యిల్లు. అదయినా తాటాకుల యిల్లు. గదిలోనే పగలు అంగడీ, రాత్రిళ్ళు పడకాను. అంగడి అంటే యేమిటో అనుకోకు, ఉప్పూ, మిర్చీ, చింతపండూ-ఇలాంటి నిత్యావశ్యకాలు మాత్రమే. అవయినా వొక్కమాటుగా వీసెడేసి కావాలంటే యివ్వలేడు. వాటికి పెట్టుబడి చూస్తామా పాతిక రూపాయీలు; కాని వడిదుడుకు ల్లేకుండా గడిచిపోయేది అతని సంసారం. పెట్టుబడి తరిగిపోకుండా వుండడమే కాదు, నెలనెలా యేమాత్రమో పెరిగేది కూడా"

"చిల్లర శివాలక్ష్మి అన్నమాట యెప్పు డయినా విన్నావా? చిల్లర అంగడి దగ్గిర కాస్సేపు చూసినవాళ్ళకే అది అర్థం అవుతుంది. "పాతిక రూపాయలతో వర్తకంయేమి?" టనిపిస్తుంది మన బ్రాహ్మలకి; కాని కోమటి బిడ్డలసంగతి వేరు. "ఇరవై రూపాయల పెట్టుబడి కంటే పాతిక రూపాయీల పెట్టుబడి యెక్కువకాదా?" అనడుగుతాడు కోమటిబిడ్డ. నిజానికి "పెట్టుబడి

యేమాత్రం?" అని కాదు కోమటిబిడ్డ నడగవలసింది "చెలామణీ యేపాటి?" అని"

"ఆకోమటికి నాయీడువాడే — నాలాగే వొక్కడే కొడుకు. ఆకొడుక్కీ నాకూ జత. వెడితే యిద్దరమే వెళ్ళేవాళ్ళం యెక్కడికయినా, లేకపోతే మేమిద్దరమే ఆడుకునే వాళ్ళం. ఆటలంటే యేమిటేమిటో కాదు, కుండబంతి తప్ప మేము మరోటి యెరగం. ఆడగా ఆడగా, దాని ముందు మాకు చదువెందుకు అనిపించేది. దానిరుచి విడిచిపెట్టలేక, చివరికి పదకొండేళ్ళ వయస్సున మే మిద్దరమూ బడి మానేశాం. కూడ బలుక్కుని"

"తరవాత మేము చేసే పని — ఆడినంతసేపూ కుండబంతి ఆడడం. అది వీలుకాకపోతే వూరంతా తిరగడం. తరచు మేము, పొలాలు కూడా తిరిగేవాళ్ళం. ఏపొలం ఎవరిదో మాకు బాగా తెలుసు. కరణానికి, ఏపొలం పరిమితి యెంతో, నంబ రెంతో అదీ తెలుసు, అంతేభేదం"

"అయితే, యెక్కడ తిరిగినా తిరిగినంత సేపూ నేను దర్జాగా తిరిగేవాణ్ణి. అతను మాత్రం, పొలాలలో తిరిగాటప్పుడు "తీస్తే యెవరూ యేమీ అనని వస్తువు దొరుకుతుందా?" అంటూ పరకాయిస్తూనే తిరిగేవాడు. అందుకు తగ్గట్టు, ఏదో వొక వస్తువు చేతపుచ్చుకోకుండా అతనెప్పుడూ యింటికి వచ్చియెరగడు. మర్రిచెట్టయినా, యిప్ప చెట్టయినా, మోదుగు రుప్ప అయినా కనబడితే పెన్నిధి దొరికినట్టు పొంగిపోయేవా డతను. ఆకులు కోసి అతనింటికి తీసుకువస్తే, అవి యెండబెట్టి వాళ్ళ అమ్మ విస్తరాకులు కుట్టేది. అంగడిలో పెట్టి వాళ్ళ నాన్న అవి అమ్మేవాడు. అతను చెట్టెక్కి ఆకులుకోసి కింద పడేస్తే ఏరి బొత్తులు పెట్టి యిస్తూ వుండే నేనే కొన్నాను, కానీకి మూడు విస్తరాకు లొకనాడు వాళ్ళ దగ్గిర"

"ఇంత స్వేచ్ఛగా తిరుగుతూ వుండిన్నీ, అతను, వర్తకంలో తండ్రికి ఆసరా అవుతూ వుండేవాడు. ఉప్పు, చింతపండు - ఇలాంటివి కావలసివస్తే, అతను, రాయవరంవెళ్ళి తెచ్చి అంగడి నింపేవాడు. తండ్రి భోజనం చేసేటప్పుడు అంగడిలో కూచుని అమ్మకమున్నూ సాగించేవాడు"

"ఇదంతా చూస్తూ వుంటే నాకు గమ్మత్తుగా కనపడేది; కాని ఆదినాల్లో నేను పూతిక ముల్లంత పనిఅయినా ముట్టుకుని యెరగను. ఇంటో వుండినంత సేపూ కథలు చెప్పమని మా అమ్మని విసిగించేవాణ్ణి. వీధికి వెడితే దర్జాగా తిరిగేవాణ్ణి. నాతో సరిగా ఆటలాడుతూ కూడా ఆ కోమటిబిడ్డ మధ్యమధ్య సంసారంకోసం పాకులాడ్డం చూస్తే, — మాఅమ్మ చెప్పిన కథలున్నూ జ్ఞాపకం

వస్తే "యిలా బడుద్ధాయిగా తిరగడం యేమిటీ?" అనిపిస్తూనూ వుండేది; కాని మానలేకపోయేవాణ్ణి. పని అనేటప్పటికి ఆమడదూరాన వుండిపోయేవాణ్ణి"

"మా మహేంద్రవాడ చూశావా యెన్నడయినా? నూరిళ్ళ వెలనాటి అగ్రహారం అది. మావూళ్ళో వుండిన బ్రాహ్మలలో చాలామంది సంపన్నులు. చాలామంది లోటు లేనివాళ్ళున్నూ. ఊరంతకీ మే మొక్కళ్ళమే బీదవాళ్ళం. అయితే, తంబురా పుచ్చుకుని తిరిగినా మానాయన దురన్న దుర్ధానా లెరగడు. అంచేత, మేమంటే బ్రాహ్మలందరూ చాలా గౌరవంగానే చూసేవారు. అయినా, వాళ్ళయెదుట లిగాడుగా వుండడం యిష్టంలేక నేను బ్రాహ్మణకుర్రాళ్ళకి దూరంగా వుండేవాణ్ణి. ఆవూరంతకీ కోమటి సుబ్బయ్య వొక్కడే నాకు జత. పాపం, అతనుకూడా నావొక్కనితోనే వుండేవాడు. మొత్తానికి షష్టిఘడియలూ మేము కలిసే వుండేవాళ్ళం. కోమటి బిడ్డతో యిలాంటి సంతత సాహచర్యం వల్ల ఇదమిత్థం అని యేర్పరచుకోలేకపోయినా, ఆ చిన్నతనంలో కూడా లక్ష్మీకటాక్షానికి పాత్రం కావడానికి కోమటిజాతిలో యేదో విశిష్టత వుందని నాకు స్ఫురిస్తూనే వుండేది"

## 7

"ఫాల్గున పున్నమికి మా మహేంద్రవాడ గ్రామంలో అమ్మవారి తీర్థం. ఇవాళ అది చూస్తే నవ్వు వస్తుంది; కాని ఆ చిన్నతనంలో "బాబోయ్, ఎన్ని అంగళ్ళో?" అనిపించేది. కొనేదీ తినేదీ తక్కువయినా, ఆ అంగళ్ళమధ్య తిరగడం అంటే నా కెంతో సరదాగా వుండేది"

"ఆసంవత్సరం తీర్థానికి మా అమ్మ రెండణా లిచ్చింది నాకు. రెండు దినాలు పోరుపెట్టగా — చివరికి, ఏడవడానికి సిద్ధపడగా సుబ్బయ్యకి వొక్క అణా యిచ్చాడు వాళ్ళ నాన్న. "ఓస్! ఇంతేనా?" అని యీసడించాను నేను. కులంలోనే కాక డబ్బులో కూడా అతనికంటే గొప్పవా ణ్ణని మహాగర్వ పడ్డాను నేను. ఆ రెండణాలతోనూ నాలుగైదు రకాల పిండివంటలు కొనుక్కుని కమ్మగా తినవచ్చునని కూడా నే నూరిపోయాను. అయితే నే నంత యీసడించినా సుబ్బయ్య తన అణా చూసుకునే మురిసిపోయాడు. లేశమూ విచారించ లేదు"

"అప్పుడు "మరి రా తీర్థంలోకి వెడదాం" అంటూ నేను ముందు అడుగు వేశాను; కాని అతడు కదల్లేదు. "ఏమిటా తొందర?" అని కూడా విసుక్కున్నాడు. నిజానికి, అప్పటి కింకా జామున్నర పొద్దుంది. ఎండ చాలా తీక్ష్ణంగానే వుంది. అయితే, ఆరెండణాలూ యెప్పుడు ఖర్చుచేద్దామా అన్న ఉబలాటంలో

ఆయెండ నాకంత అడ్డంకిగా కనపడలేదు. మనస్సు ఉరకలూ పరుగులూ పెట్టేస్తూ ఉండింది"

"ఒక్క క్షణం ఆగి నేను మళ్ళీ తొందరపెట్టాను. చెయ్యి పట్టుకుని లాగాను కూడా. అయినా, అతను బయలుదేరలేదు. పైపెచ్చు "అంగళ్ళు రాందే వెళ్ళి యేమి చేస్తావయ్యా?" అని డెకాయించాడు. దానిమీద నేను మాట్లాడలేకపోయాను. ఇంకా వొక్క గంటకికాని తీర్థం పూనుకోదు నిజమే; కాని చెప్పవద్దూ? అప్పుడు నాకు అంగళ్ళ వాళ్ళమీద మహాచెడ్డ కోపం వచ్చేసింది. ఆ కోమటిబిడ్డ వాళ్ళ పక్షంగా మాట్టాడుతున్నట్టు కనపడి అతనిమీద మండుకుపోయింది. వాళ్ళందరూ వో-ట్టి సోమరిపోతుల్లా కనపడ్డారు నాకు. అయినా, వుండలేకపోయాను. "ఈవూరికేవుండడం అక్కడే అయితేయే?"మనిపించింది, "నువ్వురాకపోతే, నేనువెళ్ళలేననుకున్నావా?" అనిన్నీ అందా మనిపించింది. "అంతసేపు తంటాలుపడితేగాని చేతికిరాని అణాకాసు, చూసిచూసి, దీపాలు పెట్టేదాకా ఖర్చుపెట్టలేడు కాబోలురా దేవుడా?" అంటూ ఆశ్చర్యపడిపోయి కూచుండిపోయాను"

"దానా దీనా కావలసిన కాలహరణం అయిపోయింది. "మరి రావయ్యా" అంటూ అప్పుడరుగు దిగాడతను; కాని అతను ముందుండడమూ, అతను తీసుకువెడితే వెడుతున్నట్టునే నతని వెనకాల ఉండడమూ నాకిష్టంలేకపోయింది. ఒక్క దూకుదూకి వెంటనే నేనతనిముందుకి వెళ్ళి నుంచున్నాను. నాకంటే తక్కువడబ్బున్నవాడు నాకంటేముందునడవడమా మరి? కాని అతను, అమ్మవారి గుడికేసి కాక రాములవారి గుడికేసి బయలుదేరాడు. "అలా యెక్కడికి?" కన్నాను నేను, చకితుణ్ణయి నిలిచిపోయి. "ఇక్కడికే" అన్నాడతను అడుగువేస్తూనే. "ఎందుకోయ్?" అనడుగుతూ రెండురుకులురికి నేనతని ముందు పడ్డాను మళ్ళీ. ఇలాగ ప్రశ్నోత్తరాలు జరుగుతూనే వున్నాయి. మేమిద్దరమూ మలుపు తిరిగాం. వెంటనే తమలపాకుల రాగమ్మ యింటోదూరాడతను"

"అక్కడ, అతను, అర్ధణా యిచ్చి తమలపాకులు పుచ్చుకున్నాడు. "తాంబూలం వేసుకుంటూ తిరుగుతాడు కామోసు సుబ్బయ్య" అనుకున్నాను నేను. ఇంతలో వెనక్కి వచ్చి, మిగిలిన అర్ధణా తల్లిచేతిలో వుంచి, దానికి పోకచూరూ, లవంగాలూ, యాలక్కాయలూ, కవిరీ పుచ్చుకున్నాడు పెరట్లోకి వెళ్ళి సున్నం తెచ్చాడు. తాపీగా కూచుని పన్నెండు కిళ్లీలు కట్టాడు. నేను తెల్లపోయాను. ఆదిలో అతను తమలపాకుల కొంటున్నప్పుడేమాట రాకుండాపోయింది. కిళ్లీలు పళ్ళెంలో వుంచుకుని "మరి పదవయ్యా" అంటూ రెక్క పట్టుకు లాగాటప్పటికి నాకు చైతన్యమే లోపించి పోయినట్టయింధి"

"కాళ్ళు సాగాయేగాని అప్పుడూ నాకు మాట రాలేదు. మనస్సులో మాత్రం వూహలమీద వూహలు పరుగులెత్తాయి. "ఎంత గొప్పయెత్తు వేశాడురా కోమటిబిడ్డ!" అని ముందునే నాశ్చర్యపడిపోయాను. కాని, వెంటనే "వెర్రిపుల్లాయ కాకపోతే వీడిదగ్గిర కిల్లీ లెవడు కొంటాడూ?" అనిపించింది. ఉన్న అణా తగల వేసుకున్నాడు కనక. ఏమయినా కొనుక్కోడానికి, వీడు మన రెండణాలలోనూ అధమం అర్థణా అయినా బదులడుగుతాడు, తప్పదు" అని తోచింది నాకు. దాంతో నాగుండెలు కొట్టుకున్నాయి. కాళ్ళు వొణికాయి. శరీరం అంతా చీమలూ జెర్రులూ పాకుతున్నట్టయింది. వల్లమాలిన కోపమున్నూ వచ్చేసింది. "బలవంతం చేస్తాడేమో?" అని భయం కూడా పుట్టుకువచ్చింది. "ఎందుకయినా మంచి"దని వెంటనే జేబులో వున్న బేడకాసు తీసి గుప్పెట్లో పెట్టుకున్నాను. ఓరచూపులు చూసుకుంటూ ఎడంగా జరిగి, అలాంటప్పుడు అతనికి యెదట వుండడం మరీ అపాయకరం అని ఆ పక్కవాటున కూడా ఒక అడుగు అతనికి వెనక వెనకనే వుంటూ వచ్చాను."

# 8

"అప్పటికప్పుడే తీర్థం బాగా పూనుకుని వుంది. గుట్టగుట్టలుగా అప్పడాలు వేయించిపోసి, సుబ్బయ్య తండ్రి కుడిచేతా యెడమచేతా కూడా అమ్మేస్తున్నాడు. తెల్లని వలబనియన్లమీద నల్లని వుల్లిపొర చొక్కాలు తొడుక్కుని పెద్ద పెద్ద అప్పడాలు కరకరలాడిస్తూ రైతుబిడ్డలు విలాసవిహారాలు చేస్తున్నారు"

"వెళ్ళి వెళ్ళడంతోటే "కిల్లీలు కిల్లీ" లంటూ ఆ రైతుబిడ్డల మధ్య వురికాడు సుబ్బయ్య. అది చూశాటప్పటికి నాకు పకోడీల అంగడికేసి అడుగు పడలేదు; కాని ఉత్తరక్షణంలో, ఘల్లుఘల్లున సుబ్బయ్యపళ్ళెంలో పన్నెండు విడికాసులుపడ్డాయి"

"నాకళ్ళే నేను నమ్మలేకపోయాను. ఒక్కక్షణం నాకు ప్రపంచం తెలియలేదు. గుప్పిట్లో వుండిన బేడకాసు గడ్డిపరకగా తోచగా అప్రయత్నంగా జేబులో పడేశాను. ఈ చేతినుంచి ఆచేతికీ, ఆచేతినుంచి మళ్ళీ యీచేతికీ మార డంలో, నాలుగల్లా పన్నెండుకాసులు అయిపోడం గారడీగా కనపడింది నాకు. "ఇందులో వున్న కిటుకేమిటీ?" అని ఆలోచన రేగింది; కాని తూర్పూ పడమరా యేమీ బోధపడలేదు. పదకొండేళ్ళవాణ్ణి నేనప్పటికి నామాటకేం, యిరవైయేళ్ళ వాడవు నీకయినా బోధపడిందా అది?"

"మన బ్రాహ్మలకీ కావాలి డబ్బు. అయితే, మనవాళ్ళకది వచ్చేమార్గం ఋణాలు, లేకపోతే నౌకరీ. కాకపోతే సంభావనలు. అదయినా చేతకాకపోతే

రాగిచెంబు ఎర్రగా తోముకుని బయలుదేరడం. అందుకూ పనికిరాని వాళ్ళు, మీసాలు మెల్లిపెట్టుకుంటూ వాళ్ళనీ వీళ్ళనీ కోర్టులవెంట తిప్పడం. ఇంతేకాదూ! కాని ఆ పూటకి గతిలేకపోయినా కోమటిబిడ్డ ముష్టికి బయలుదేరడం నువ్వెక్కడయినా చూశావా? వందచుట్టలూ డజనగ్గిపెట్టెలూ పుచ్చుకు బయలుదేరినా, నిమిష నిమిషానికీ రకం మార్చుకుంటూ తిరగాడంటే దర్జాగా దినం గడచిపోతుందతనికి, ఆరహస్యం గుర్తించగలవా నువ్వు? ఆ పురుషకారం బోధపరుచుకోగలవా నువ్వు?"

"ఏతావతా!- అది చూశాటప్పటికి మొదట్లో నాకాశ్చర్యం కలిగినమాట వాస్తవమే! కాని అంతలో, నా బ్రాహ్మణీకం మళ్ళీ పురెక్కింది. కష్టపడితేగాని అతనికి ఆ పెరిగిన డబ్బులు రాలేదనీ, నాకు దర్జాగా మొదటే వచ్చాయనీ మళ్ళీ మరొక రకమైన గర్వరేఖ మెరిసింది నా తలలో. అంచేత, నాగొప్పతనం భంగపడలేదని నేను బాగా మురిసిపోయాను. దాంతో, పిండివంటలు కొనుక్కుని తినెయ్యాలన్న ఆత్రం యెక్కువయిపోయింది. వెంటనే "యిక రా" అన్నాను. కాని సుబ్బయ్య రాలేదు. నాకేసే చూడలేదతను. ధర్మమేలే. నా వుబలాటమేగాని, లాభం మరిగినకోమటిబిడ్డ బ్రాహ్మణకుర్రాడితో తిరుగుతాడూ చేతులు ముడుచుకునీ?"

"అటుచూసి ఇటుచూసి" అంత తొందరగా వుంటేనువ్వు కొనుక్కోవెళ్ళి" అంటూ నన్ను తిరస్కరించి మళ్ళీ వూళ్ళోకి మళ్ళాడతను. కొయ్యయిపోయాను నేను. కాకపోతే, తరతరాలుగా-యుగయుగాలుగా సంచితమై వుండిన గొప్ప సంప్రదాయం అతనిది, అప్పుడు నేనేమిఅర్థం చేసుకోగలనూ? కాగా, కొంతసేపటికి ప్రకృతిలోపడి, అతని కళ్ళు చూడలేవా అనీ, అతని ముక్కు వాసన గ్రహించలేదా అనీ, అతని జిహ్వ రుచికట్టలేదా అనీ, ఆజన్మకి అనుభవించే యోగ్యత లేదా అనీ సందేహించాను నేను. ఎటుచూసినా, ఎన్నోకొన్ని డబ్బులు పట్టుకుని తీర్థంలోకి వచ్చిన ఆయీడు కుర్రాడు, ఏదో వొకటి కొనుక్కుని తినకుండా వూళ్ళోకి మళ్ళడం నాకు కనబడలేదు మరి"

"ఏమిటీ చెయ్యడం? అతన్నివిడిచిపెట్టేసి అంగళ్ళలో ప్రవేశించడమా, బుర్రవంచుకుని అతని వెనకనే తిరగడమా? నాకిది గడ్డుసమస్య అయిపోయింది. అటు చూడగా అతను చరచరా ముందుకి వెళ్ళిపోతున్నాడు. ఇటు చూడగా, అప్పుడే తయారవుతున్న వేడివేడి పకోడీలు "బ్రహ్మశ్రీవి, వేదమూర్తివి, నీకు కోమటి బిడ్డతో సావాసం యేమిటి, ఈపాటికిలా దయచెయ్యవోయి శాస్త్రుల్లూ" అంటూ ముక్కు తాళ్ళుపోసి నన్ను లాగేస్తున్నాయి. నే నీ

గుంజాటనలో వుండగా అతనింకా దూరం వెళ్ళిపోయాడు. అప్పటిదాకా వొక్క-క్షణం అయినా నన్ను విడిచివుండలేని సుబ్బయ్య, వెనక్కి తిరిగి చూడ నయినా చూడకుండా రంయి మని వెళ్ళిపోతూ వుండడం నాకు మర్మాఘాతం అయిపోయింది."

నా కిది గొప్ప పరాభవంగా తోచింది, నిజమే; కాని "వెనక్కి వెళ్ళి అత నేమి చేస్తాడూ?" అని నాకు జిజ్ఞాస పట్టుకుంది. కళ్ళుమూసుకుని తీక్షణంగా ఆలోచించాను; కాని గుర్తించుకోలేక పోయాను. వెంటనే నాలు గడుగులు వేసి ఆదుర్దా అణుచుకోలేక నాలుగంగలున్నూ వేసి అతణ్ణి కలుసుకున్నాను."

"ఇద్దరమూ మాట్టాడకుండానే నడిచాం. అందరూ తీర్థంలోకి వస్తూ మాకెదురుపడేవారే గాని, మే మిద్దరమూ తప్ప; అప్పటికింకా వూళ్ళో కెవళ్ళూ మళ్ళడంలేదు. ఏమిటేమిటో అడుగుదా మనుకుంటూనే అడుగు వేశాను; కాని నాకు మాటే రాలేదు"

"ఇంతలో శివాలయం దాటాం. ఇంటికి వెళ్ళి అతను జరిగిందంతా తల్లికి చెబుతా డనుకున్నాను నేను. తండ్రి తీర్థంలో వున్నాడు కనక, అంగడీలో కూచునిఅమ్మకం సాగిస్తాడు కామోసు ననిన్నీఅనుకున్నాను. అయితే "అప్పుడు మనం యేమిటి చెయ్యడం?" అని నాకాలోచన పట్టుకుంది; కాని దారీ తెన్నూ తోచలేదు. నే నిలా సతమత మయిపోతూ కొంచెం వెనక పడేటప్పటి కతను తన ఇల్లు దాటేశాడు. మళ్ళీ రాగమ్మ యింటికి వెడతాడు అని అప్పటికి తోచింది నాకు"

"సరిగా అంతే జరిగింది. అతను రాగమ్మ యింటోనే ప్రవేశించాడు. మళ్ళీ తమలపాకులు కొన్నాడు. తల్లిదగ్గిర పోకచూరూ అవీ పుచ్చుకున్నాడు. ఈసారి ఆసరుకు ఇరవై నాలుగు కిల్లీలు కట్టాడు. అవీ తీర్థంలో పావుగంటలోనే యెగిరిపోయాయి."

మళ్ళీ అటూయిటూ చూసి యేమిటో అంచనావేసుకున్నాడు. మళ్ళీ కిల్లలుకట్టాడు. మళ్ళీ అమ్మేశాడు"

"అయితే, రెండోమాటు అతను కిల్లీలు కట్టాటప్పుడే నేను చిరుతిండి మాట మరిచిపోయాను. మొగం వేల వేసుకుని మాటామంతీ లేకుండా అతని వెంట తిరిగాను. మూడోమాటు అతను కిల్లీలు కట్టాటప్పుడు "మనం కూడా యీపని చేద్దామా" అనిపించింది నాకు; కాని అభిజాత్యం పొడుచుకు వచ్చింది. "ఛీ, నువ్వు బ్రాహ్మణ పుట్టుక పుట్టలేదూ?" అని లోపలనుంచి నన్నెవరో గద్దుము తున్నట్టూనూ అనిపించింది. దాంతో దగ్గిర వుండిన భేదకాసు

చూసుకుని సిగ్గే పడ్డాను; కాని కులం తలుచుకుని చివరికి, గర్వమే తెచ్చుకున్నాను"

"జరిగిం దేమిటంటే? తల తిరిగిపోయీ, మనస్సు చెదిరిపోయీ, బుద్ధి మళ్ళిపోయీ, అరెండణాలూ మాత్రం నేను ఖర్చు పెట్టలేదు. పైగా, ఆ అంగళ్ళవాళ్ళు నన్ను నిలువునా దోపిడీ చెయ్యడానికి వచ్చిన పచ్చిపాళ్ళులాగ కనపడ్డారు. నిజానికి, చైతన్యం లేకే ఖర్చుపెట్టలేకపోయినా, డబ్బు చేత బుచ్చుకుని ఖర్చుపెట్టెయ్యడానికే బయలుదేరిన బ్రాహ్మణ కుర్రవాడికి, అన్ని పకోడీల అంగళ్ళ మధ్యా అంత విముఖత కలగడం మాత్రం అప్పటికీ యిప్పటికీ మిక్కిలీ ఆశ్చర్యకరంగానే వుందినాకు"

## 9

"సూర్యాస్తమయం అయింది. తీర్థంలోకి వచ్చే వాళ్ళకంటే ఊళ్ళోకి వెళ్ళేవాళ్ళెక్కువయినారు. తీర్థంలోనే కరకరలాడించే కుర్రకారెప్పుడో వెళ్ళిపోయింది. అదంతా పరకాయించి "యిక లాభంలే" దన్నాడు కోమటిబిడ్డ. అప్పటికి పళ్ళెంలో వొక్క కిల్లీ మిగిలి వుంది. అది కూడా అమ్మేద్దామని మరో అరగంటసేపు తిరిగా డతను. వెనకటికంటే గట్టిగా అరిచాడు కూడా; కాని అలాగే వుండిపోయిం దది"

"చిత్రం యేమిటంటే? పళ్ళెంలో, ఘల్లుఘల్లున డబ్బులు పడుతున్నప్పెడెంత శ్రద్ధగానూ, ఎంత ఉల్లాసంగానూ, ఎంత ఆబగానూ తిరిగాడో, తిరిగి చూసినవాడు లేకపోయినా ఆ అరగంటా కూడా అలాగే తిరిగా డతను. నేను మాత్రం మహా విసిగిపోయాను. ఏదీ వ్యావృత్తిలేని వాళ్ళకి క్షణంలోనో క్షణంలోనో విసుగు కాకపోతే మరేమి పుడుతుంది?" "అంత లాభం కొట్టావు కదా, ఆవొక్క కిల్లీకోసమూ అంత బెంగ యేమిటి పోదాంరా" అందామనుకున్నాను; కాని యేదో గొప్ప అపరాధం చేసినట్టు మాట్టాడలేకపోయాను"

"జనం మరీ పల్చబడిపోయింది. చీకటి కూడా బాగా ముదిరింది. ఆకిల్లీ యిక అమ్మకం కాదని తేలిపోయింది, అప్పుడు మళ్ళాడత నింటికి, మళ్ళుతూ మళ్ళుతూ "మరి నే నింటికి పోతున్నాను. నువ్వేమయినా కొనుక్కుంటే కొనుక్కో, నా కేమీ అక్కరలేదు. అంత వుండలేకపోతే, యింటికి వెళ్ళాక నాలుగు బటాణీగింజలు నోట్లో వేసుకుంటే పోతుంది" అన్నాడతను"

"దీంతో నాకు ఛెళ్ళు మని కొరడా కొస తగిలినట్టయింది. చాలా బాధపడ్డాను. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఉండుండి అతి కష్టంమీద మాట్ల

తెచ్చుకుని "నేను కూడా యేమీ కొనుక్కోను. పద యింటికి పోదాం" అని మాత్రం అని అతనితో బయలుదేరాను"

"లాభం కొట్టిన ఉల్లాసం అతనిదీ, దెబ్బ తిన్న ఉద్వేగం నాదీని. దీంతో యిద్దరమూ వడిగానే నడిచాం. అయితే "వొక్క కిల్లీ మిగిలి పోయిందయ్యా! ఒక్క కానీనష్టం" అంటూ దారిపొడుగునా వొకటేగోల అతను. నేను మాత్రం కిమ్మన్నాన్తి"

"ఇంతకీ, అమ్మకం యేమాత్రం?" అని నే నెన్నో మాట్లు అడగా లనుకున్నాను; కాని పెదవులు కదల్చలేకపోయాను. క్షణక్షణానికీ నా నోరు మరీ బిగుసుకుపోయింది"

"ఇంతలో, మేము శివాలయం దగ్గరికి వచ్చాం. పెద్ద దీపం పెట్టుకుని, కుట్టుపనివాడు, గుడిసావడి అరుగు మీద కూచుని రైకమీద రైక కుట్టేస్తున్నాడు, మాలపేరంటాళ్ళని జువ్విచెట్టుకింద నుంచోబెట్టి. "చెరువులో, మాకు స్నానాలు చేసేవేళ యిది, మీ రిక్కడ తిష్ఠ వేస్తే యెలాగర్రా?" అంటూ బ్రాహ్మణ వితంతువులు మాలెతలను నిష్ఠురా లాడుతున్నారు. సిగరెట్టు మీద సిగరెట్టు వూదేస్తూ, రైతుబిడ్డ వొకాతను, కుట్టుపనివానితో సరాగాలు కలుపుతున్నాడు. పెద్దచెరువు గట్టుమీది చెరుకుగానుగు దగ్గిరనుంచి చెరుకుపానకం మొదటిపొంగు తాలూకు చెడుకంపు దూసుకువస్తోంది"

"అది భరించలేక "అబ్బా" అని ముక్కుమూసుకుని నేను పక్కకి వోసరిల్లాను. "సింగినాదంకాదూ? అంతమందికి లేనిబాధ నీకు వచ్చిందా?" అంటూ నన్నీసడించి, సుబ్బయ్య రథంవైపు అరుగుచివర కూచున్నాడు"

"అందుకే నేను తెల్లపోతూ వుండగా, అక్కడకూచుని అతను అమ్మకం లెక్కచూసుకోసాగాడు. అది చూశాటప్పటికి నాకూ పానకం కంపు మరుపు వచ్చింది. ఆత్రమున్నూ అతనికంటే నా కెక్కువయిపోయింది. ఒక్కదూకు దూకి చూస్తునుగదా, కుట్టుపనివాడి దీపంకాంతిలో, పావులాకాసులు రెండూ, బేడకాసులు నాలుగూ, అణాకాసు లయిదూ, విడికాసులు పందొమ్మిదీ మిలమిల్లాడిపోతున్నాయి సుబ్బయ్య పళ్లెంలో"

## 10

"ఇదంతా నాకప్పుడు జ్ఞాపకం వచ్చింది. అప్పుడు నాకళ్ళ యెదుట జరుగుతున్నట్టున్నూ తోచింది. దాంతో, నాకళ్ళకేదో కొత్తవెలుగు వచ్చిన ట్టయింది. అయిదు నిమిషాలకు పూర్వం మాడిపోయి మోడు లాగ కనిపించిన

ప్రపంచం వెంటనే, చిగుళ్ళతోనూ, జొంపాలతోనూ, పువ్వులతోనూ, పిందెలతోనూ, కాయలతోనూ, పళ్ళతోనూ, చిలకలతోనూ, గోరింకలతోనూ నిండి వుండిన మామిడిగున్న లాగ యెంతో మోహనంగా కనబడింది"

"ఇప్పటికిన్నీ నేనెప్పుడయినా మందకొడిగా వుండడం తటస్థపడితే యిదిగో యిది జ్ఞాపకం వచ్చి, వొక్కొక్క మెరుపు దెబ్బకొడుతూనే వుంటుంది"

"ప్రతీ మనిషికీ ఏదో వొక దృక్పథం యేర్పడి స్థిరపడే ఆవయస్సున, వొక కోమటిబిడ్డతో సంతత సాహచర్యం యేర్పడి వుండడం నిజంగా నా అదృష్టమే. అలా కాక నే నప్పుడు బ్రాహ్మణ పిల్లకాయలతోనే జత కట్టుకుని వుంటే నాకీ అనుభవమూ కలక్క పోవును. తరవాత, యీ స్మృతీ రాక పోవును, నేనిప్పడి స్థితిలోనూ వుండకపోదును"

"ఇదిలా వుండనియ్యి. ఆఫాల్గున పున్నమికి వెనకటి దీపావళినాడు ఒక గమ్మత్తు జరిగింది"

"బాణాసంచా కొనుక్కోడాని కొక రూపాయి కావా"లని నేను. "ఒక్క అణాకంటే యెక్కువ యివ్వ"నని మా నాయన. మా అమ్మ కలగజేసుకుని అణా అల్లా పావులాకాడికి పెంచింది; కాని అందుకు మా నాయనా నేనూకూడా వొప్పుకోలేదు. "పూర్తిగా రూపాయి అయితేనే" అంటూ మూతిముడుచుక్కూచున్నాను నేను. దీనిమీద కళ్లెర్రజేసి, రెండురుములురిమి తంబురా పుచ్చుకుని మానాయన చక్కాపోయాడు"

"వెంటనే మాఅమ్మ, సుబ్బయ్య తల్లి నడిగి వొకరూపాయితెచ్చి నాచేతిలో పెట్టి "నాన్నా ఏమికొనుక్కుంటావో నాకు చెప్పవూ?" అంటూ వొళ్లో కూచో బెట్టుకుని బుజ్జగించింది. ఆలోచించుకుంటూ, కాదుకాదని సవరణలు చేసుకుంటూ నేను వివరాలు చెప్పాను. దానిమీద మెల్లిగా అందుకుని "టపాకాయలు ఫిరంగుల్లాగ పేల్తాయి; కాని చెవులు గళ్ళడి పోతాయి బాబూ! పువ్వొత్తులు మాత్రం యెంతో బాగుంటాయి. మతాబా లంతకంటేనూ మరీ మరీ బాగుంటాయి, కదూ?" అనడిగింది, మా అమ్మ. ఆవిడ సంబరపడుతోం దనుకుని నే "నవు" నన్నాను పొంగిపోతూ"

"అప్పుడు ధోరణి మార్చి "రూపాయి అంతకంటే బాగుంటుంది, అవునా నాన్నా?" అనడిగింది మా అమ్మ. "ఏమి బాగుంటుం దేమిటి కసింత వెండి ముక్కగా? గుండ్రంగా మాత్రం వుంటుంది, అంతేనా!" అని మందలించాను నేను. "అలాకాదు నాన్నా! నీచేతిలో వున్నరూపాయి యెంత తళతళ మెరిసి

పోతోందో చూసుకో. మోగిస్తే అది ఖంగు మంటుంది పరీక్ష చేసుకో. అది చేతిలో వుండడంవల్ల నువ్వెంత దిలాసాగా వున్నావో బాగా పరకాయించుకో. కనక, రూపాయికూడా చాలా చక్కనిదేనోయ్. కాకపోతే, అది పుచ్చుకుని వర్తకులు అంతచక్కని బాణాసంచా యెందుకిస్తారూ మరీ?" అని యెదురడిగింది మా అమ్మ, చిరునవ్వు నవ్వుతూ. "అవునా" అనిపించింది నాకు"

"మళ్ళీ అందుకుంది మా అమ్మ. "పువ్వొత్తులు వెలిగిస్తే పూలవాన దిమ్మరించేస్తుంది, మతాబాలు వెలిగిస్తే వీధంతా పట్ట పగ లయి పోతుంది; కాని చేతులు మసి కూడా అయిపోతాయి, అది పూర్తి అయి పోయాక, కళ్ళు చీకట్లు కమ్ముతాయి. యాక్కురాశీ, వొట్టి చెడుకంపు" అంది చేతులు దులుపు కుంటూనూ, యేవగించు కుంటూనూ. "అవును నిజమే" అనుకున్నాను మనస్సులో నేను. అది గుర్తించి మా అమ్మ "మరి, రూపాయి యెంత చక్కగా వుందో చూడూ. ఇది మండిపోతుందా? బుగ్గి అయిపోతుందా? కంపుకొడు తుందా? చేతులు మసి చేస్తుందా?" అనడిగింది; కొంటి చూపులు చూస్తూ"

"అవు" ననడం నా కిష్టంలేదు; కాని నా తల మాత్రం నన్ను లెక్క చెయ్యకుండా "అవు" నన్నట్టు వూగేసింది. దానిమీద "రూపాయి చేతిలో వుంటే యెంతో దిలాసా. ఎంతో ధైర్యం. ఇది చేతిలోవుంటే బాణసంచా వొక్కటేకాదు, ఏది కావాలన్నా వొస్తుంది. రూపాయి లేకపోతే యేమీ రాదు. ఎవరూ దగ్గిరికి రానివ్వరు. "ఎలాగరా దేవుడా" అని దిగులుపట్టుకుంది. మీ నాయన రూపాయి యివ్వనంటే నువ్వేమి చేశావు మరి? మొగం వేలవేసు కున్నావు. అవునా నాన్నా" అనడిగింది, మా అమ్మ జెల్లిస్తూ"

"నిజమే" అనకుండా వుండలేకపోయాను నేను; కాని నాకు బిక్క మొగం పడింది. అది కనిపెట్టి, మా అమ్మ, నన్ను జాలిగా గుచ్చి కౌగలిం చుకుని "నాన్నోయ్! వెనకటి కొక సంగతి జరిగిందోయ్! అందులో యెంతో చక్కని బాణాసంచా కూడా వుందోయి!" అంటూ వూరించింది. నే నాశపడి చూశాను. "అదివింటే, నువ్వు అలాంటి బాణాసంచా కొనుక్కుంటా" వంది మళ్ళీ. "అయితే, అదేమిటో చెప్పు" మన్నాను నేను. దీనిమీద "ఆపిల్లాడూ చీచీ, బడుద్దాయిగాడు వాడు. వాడిమాట తలపెట్టకూడదు. చెప్పుకుంటే ఆపిల్ల మాట చెప్పుకోవాలి! కంటే అలాంటి పిల్లనే కనాలి. పెంచితే అలాంటి పిల్లనే పెంచాలి. కానయితే పిల్ల వొక్కరూపాయి బాణాసంచా మాత్రమే కొనుక్కుంది. కాని కాపరానికి వెళ్ళాటప్పుడు, వూళ్ళోవాళ్ళు ఆపిల్ల నెంత మెచ్చుకున్నారో?" అంటూ మళ్ళీ న న్నూరించింది మా అమ్మ"

"ఇక నే నాగలేకపోయాను. "ఇదిగో. నాకక్కరలేదు నీరూపాయి నువ్వుపుచ్చుకో. నా కాకథ చెప్పు తొరగా" అంటూ రూపాయి మాఅమ్మ చేతిలో పడేశాను నేను. అది రొంటిని పెట్టుకుని మా అమ్మ కథ అందుకుంది"

## 11

"అనగనగా వొక కోమటి. చాలా డబ్బున్న వాడతను. అతని అంగడి చాలా పెద్దది. అంత పెద్ద అంగడి రాజమహేంద్రవరంలోనూ, కాకినాడ లోనూ కూడా లేదు. అతని కొక్క కొడుకూ వొక్క కూతురూను. ఇలాగే దీపావళి వచ్చింది. ఆవూళ్లో పిల్ల లందరూ తల్లిదండ్రుల నడిగి డబ్బు సంపాదించుకున్నారు. ఆ కోమటి కూడా కొడుక్కీ కూతురికీ తలో రూపాయీ యిచ్చాడు. తన రూపాయికీ రకరకాల బాణసంచా కొని దీపాలు పెట్టీపెట్ట కుండానే కాల్చేశాడు కొడుకు"

"ఛీ, బాగా చీకటి పడకుండానే?" అనడిగాను నేను"

"దుడుకు పిల్లకాయలకు అందమూ చందమూ యేమిటి నాన్నా? రూపాయి కాల్చెయ్యడమే వాళ్ళపని"

"వాడిమాటకేం, ఆపిల్ల యెలాంటివికోందో చెబుదూ"

"ఆపిల్ల కూడా రకరకాలు కొంది"

"నాకు తెలుసు, బాగా చీకటి పడిన తరవాత, వాళ్ళ అమ్మ దీపాలు పెట్టుకోడం కూడా అయిపోయాక కాల్చిందది, అవునా?"

"అబ్బే! ఆపిల్ల కాల్చనే లేదోయ్"

"ఏం, భయమా? అన్నాతమ్ముడా వాడు, ఆబడుద్దాయిచేత కాల్పించిందా?"

"ఛా, ఛా, రూపాయి బుగ్గిచేసినవాడు వాడు, వాణ్ణి నమ్ముతుందా నాయనా' ఆరాజాపిల్ల?"

"మరేం చేసిందమ్మా?"

"వీధిగుమ్మాన తండ్రి అంగడికి సాయం, పెరటి గుమ్మాన ఆపిల్ల అంగడి పెట్టింది"

"అయ్యో, అమ్మేసిందా?"

"మరే నాన్నా"

"సరదా లేదు కామోసు ఆపిల్లకి"

"అదేమిటి నాన్నా, ఆపిల్లకే సరదా లేకపోవడం? అది మంచి ఆలోచన

పరురాలు. అంచేత, దాని సరదా వేరు. కాకపోతే, అన్నలాగే ఆరూపాయి కాల్చేసి, తెల్లమొగం వేసుకుని —"

"అమ్మితే, ఆరూపాయి మళ్ళీ చేతికి వచ్చిందంటావు నువ్వు, అంతేనా?"

"సరే, పెట్టిన రూపాయే వచ్చేటట్టుంటే యిక అమ్మడం యెందుకూ శ్రమపడి? చాలా రూపాయిాలే వచ్చాయి"

"చాలా రావడానికి దానిదగ్గర ఎవరు కొన్నారమ్మా?"

"పెద్ద అంగళ్ళలో కానీవీ, అర్థణావీ అమ్మరుగా? బీదవాళ్ళు అంతకంటే కొనలేరుగా?"

"వాళ్ళ కమ్మిందా?"

"లాభం రావాలి గాని యెవళ్ళ కమ్మితే యేం?"

"అన్నీ అమ్మేసిందా?"

"ఆ"

"ధూ!........పోనీ, అమ్మేసి?"

"మళ్ళీ కొంది?"

"కొని?"

"మళ్ళీ అమ్మింది"

"దీపాలు పెట్టాక కూడా అమ్మిందా?"

"ఊళ్ళోవాళ్ళు బాణసంచా కాల్చడం మానేసేదాకా అమ్మింది. రూపాయి అయిదు రూపాయిాలు చేసుకుని కమ్మగా నిద్రపోయింది"

"బాబోయ్!............అయితే, అమ్మా, కొంచెమయినా మిగుల్చుకో కుండా—కొంచెమయినా కాల్చకుండా అన్నీ అమ్మేసిందా?"

"అది మిగుల్చుకోలేదు, వాటికవే మిగిలాయికొద్దిగా"

"అయిదురూపాయలూ దాచుకుని అవికాల్చుకుందా?"

"లేదు, అవీ దాచుకుంది"

"దాచి?............ఎక్కడో అడివిపిల్లలా వుండే అదీ?"

"అడివిపిల్ల కావడానికి దానికేం కర్మం? అడివి పిల్లాడు ఆబడుద్దాయి గాడే."

"పోనీ, దాచి?"

"కార్తీకం పున్నమికి మళ్ళీ అంగడి పెట్టింది"

"పెట్టి?"

"మళ్ళీ మళ్ళీ కొని, మళ్ళీ మళ్ళీ అమ్మింది"

"అమ్మితే?"

"అయిదల్లా పదిరూపాయీ లయిపోయాయి"

"అవి దాచుకుంది, కదూ?"

ఛా, తెలివితక్కువదా యేమిటి ఆ పిల్ల, ఆ కాస్తడబ్బూ దాచుకోడానికి?"

"నేను మాట్టాడలేకపోయాను. నాస్థితి గుర్తించి మాఅమ్మే మళ్ళీ మొదలు పెట్టింది"

"ఆపదిరూపాయీలకూ ఉప్పు, మిరపకాయలు- ఇలాంటివి కొని పెరటి గుమ్మాన చిల్లర అంగడి పెట్టింది. వర్తకం పెరిగింది. పిల్లా పెద్దదయింది. పెళ్ళి కూడా అయింది. అయినా, వర్తకం చేస్తూనే వుంది. చేసిచేసి, కాపరానికి వెళ్ళాటప్పుడు, స్వార్జితం, వెయ్యిరూపాయీలు పట్టుకువెళ్ళింది, అత్తవారి యింటికి"

"ఒక్క రూపాయికి వెయ్యిరూపాయీలా?"

"వెయ్యేమిటి, కోమట్లకి లక్ష మాత్రం వొక లెక్కా నాయనా? కోట్లకు పడగలెత్తగల జాతి అది. తలుచుకుంటే, వొక్క రూపాయి అయినా పెట్టుబడి లేకుండా పెద్దపెద్ద వర్తకాలు చెయ్యగలరు కోమట్లు, తెలుసా?"

"నేను మాట్టాడలేకపోయాను. అది చూసి మాఅమ్మ మరోకథ అందుకుంది"

"అనగా అనగా వొక కోమటి. ఎంతో భాగ్యవంతుడతను. రాజుగారికి అతనిమీద ఎందుకో కోపం వచ్చింది. కట్టుగుడ్డలతో లేవదీసి, తెల్లవారాటప్పటికి నూరామడలదూరాన వొక పల్లెటూరి చెరువుగట్టున విడచిపెట్టారు రాజభటులు, అతణ్ణీ పెళ్ళాన్నీ"

"పా-పం"

"చేతిలో కానీ లేదు. అమ్ముకుందామంటే భార్యవొంటిమీద నల్లపూస అయినా మిగల్చలేదు రాజు"

"మరి వాళ్ళకి అన్నం యెలాగే అమ్మా?"

"పుట్టింది కోమటి పుట్టుక కదా, వాళ్ళకే అన్నం లేకపోవడం?"

"ఎలా వచ్చిందీ?"

"అతగాడు వర్తకం చేశాడు, సంపాదించాడు"

"అపూటా?"

"అపూట దాకానా? ఆక్షణంలో"

"డబ్బేదీ?"

"అక్కడే వుంది రహస్యం. మనవాడయితే వృత్తికి తారతమ్యాలు

కల్పించుకుని మోడి చస్తాడు. "అయిన యింట పుట్టి తక్కువ పని చెయ్యనా" అన్న ఆభిజాత్య గర్వం యెక్కడ వుంటుందో అక్కడ సర్వనాశమే. డబ్బుంటేనే తక్కినవి యేమయినా నిలుస్తాయి. డబ్బులేనివాడికి బతుకే శూన్యం, గౌరవం యెక్కణ్ణుంచి వస్తుందీ? వాడికిక ఆభిజాత్యం అంటే యేమిటీ? వెనకా ముందూ యేమయితే యేం, అప్పటి స్థితిగతులను బట్టి నడుచుకోడంలోనే వుంది ప్రజ్ఞ. ఆదిలో లక్షాధికారి అతను. మరి, అప్పుడేమి చేశాడో యెరుగుదువా? ఒక్కమాటు అలాగా యిలాగా పారజూశాడు. ఎటుచూసినా ప్రతీ చేలోనూ కొండల్లా వరికుప్పలు కొన్నికుప్పలు రైతులు నూరుస్తున్నారు. ఇంకేం, దారి కనపడిందతనికి"

"ధాన్యం అడిగి తెచ్చుకున్నాడా ఆపూటకి?"

"ఛీ, ఛీ, వొకళ్ళ కిస్తాడుగాని, దేహీ అని కోమటిబిడ్డ వొకళ్ళ నాశ్ర యిస్తాడా, దేవురిస్తాడా? అతను వర్తకం చేశాడని చెప్పాను కాదూ నాన్నా?"

"ఏం వర్తకం అమ్మా?"

"వర్తకమన్న వర్తకమా? గాలి పోగుచేశాడు, దీపాలు పెట్టాటప్పటికి మళ్ళీ వొక యింటివాడయిపోయాడు"

"ఇలా చెప్పి, వొక్కమాటు గంభీరంగా చూసి మాఅమ్మ మళ్ళీ యెత్తు కుంది"

"ఊరివాళ్ళు, పగిలిపోయినకుండలన్నీ ఆ చెరువుగట్టున పారేసుకుంటారు. ఆగుట్టలోనుంచి పెద్దపెంకు వొకటి తీశాడతను. గట్టున పడివుండిన మూడు మట్టిబెడ్డలు తెచ్చి పొయ్యి అమర్చాడు. ఆచెట్టూయీచెట్టూ యెక్కి యెండు చితుకోలు విరిచి గుట్టలు పెట్టాడు. ఒక కుప్పనూర్పుడు దగ్గిరికి వెళ్ళి నిప్పు తీసుకువచ్చాడు. అతని పెళ్ళాం పెంకు కడిగి నిప్పు రాజేసింది. నిశ్చింతగా అతను వూళ్ళోకి బయలుదేరాడు"

"బియ్యంకోసమా?"

"కాదు, వర్తకం చెయ్యడానికి"

"మరి డబ్బేదమ్మా?"

"చెప్పాను కాదూ తండ్రీ? బుద్ధి వుంటే కోమట్లకి డబ్బెందుకూ? అయితే, మనవాళ్ళు వర్తకంచేస్తే వున్నది కూడా వూడ్చిపెట్టుకుపోతుంది. కోమట్లు వర్తకం చేస్తే లేని దిన్నీ పుట్టుకు వస్తుంది."

"ఇలా అని మాఅమ్మ నాకళ్ళల్లోకి చూసింది. నేను అప్రతిభుణ్ణయిపోయి వున్నాను. అది గమనించి మాఅమ్మ మళ్ళీ కథ అందుకుంది"

"తిన్నగా అతను వూళ్ళోకి వెళ్ళాడు. ఊరంతా కాపజనం. అంతా వ్యవసాయదారులు. ధాన్యం గుట్టలూ కొండలూ అయి మూలుగుతూ వుంటుంది వారి దగ్గిర. ఊరంతా-ప్రతివీధీ తిరిగాడతను"

"తిరిగి?"

"పేలాలోయి పేలాలు, వేడివేడి పేలాలు, వింతవింత పేలాలు, కమ్మ కమ్మని పేలాలు, కరకరలాడే పేలాలు" అంటూ తిరిగినచోటల్లా కేకపెట్టా డతను. చుట్టూ మూగి పిల్లలు పేలా లేవి అని అడిగారు. "చెరువుగట్టున వున్నాయి వెళ్ళం"డన్నాడతను. "వడ్లకి సగం, బియ్యానికి సరికి సరి" అని కూడా చెప్పాడతను"

"ఆగు ఆగు, నాకు తెలిసిపోయింది రహస్యం. పిల్లలు తెచ్చిన వడ్లే పేలాలు చేసి యిచ్చింది అతని పెళ్ళాం. బియ్యం అన్నం వండింది"

"అంతేనా మరీ? గంట గంటకీ తిరిగాడతను. వీధి వీధికీ తిరిగాడు. మళ్ళీమళ్ళీ వచ్చి పిల్లలు పేలాలు కొనుక్కున్నారు. చీకటి పడాటప్పటికి కుంచెడు బియ్యం చేరాయి. నాలుగుకుంచాల వడ్లు మిగిలాయి"

## 12

"ఓః! ఏమి కథలోయ్! చూడూ చూడూ నా వొళ్ళెలా గరిపొడిచిందో, చూడూ! ఇలాంటి కథలు వినని బతుకు ఏం బతుకోయ్?"

"ఇవే కాదు, ఇలాంటి కథ లింకా యెన్నో చెప్పింది మా అమ్మ. మీ అమ్మ చెప్పిందా మరి? పోనీ. కథలంటూ చెప్పిందా యెలాంటివైనా? నాకు నమ్మకంలేదు. అదిగో, నిస్సాకారంగా చిరునవ్వు నవ్వుతున్నావు, కథలంటే నీకే రుచి లేనట్టుంది"

"నువ్వేకాదు నాయనా, మనవాళ్ళలో చాలామంది యిప్పుడింతే, మీ రంతా గాలిలో మేడలు కడతారు; గాని యిలాంటి కథలు వింటే భూమిమీదే ఆకాశం అంటే మేడలు కట్టవచ్చునని గ్రహించలేరు. "కథ అంటే యేమిటీ?" అని విచారణే చెయ్యరు. కనీసం హితోపదేశం కథ లయినా చదివి, బోధపరు చుకుని, మననంచేసుకుంటూ వుంటే మన ఆంధ్రజాతి యిప్పు డిలాగే వుండునా?"

"కథలంటే మనుష్యుల నడతలకు ప్రతిబింబాలు కావుటో వెర్రివాడా? అనుభవ పరుడంటే, చాలా కథలు అర్థంచేసుకుని, వాటిభావం జీర్ణింపచేసు కున్నవాడు కాడూ? అయితే, కథ లర్థం చేసుకోవాలంటే కళ్ళయెదట జరిగితే

చూడనైనా చూడాలి, పుస్తకాలు చదివయినా గ్రహించాలి. కళ్ళయెదట జరిగేవి చూదామంటే బుద్ధికి వికాసం కలిగించేవి యెప్పుడోగాని మనకి దొరకవు. పుస్తకాలు చదివితే అన్నీ అలాంటివే ఉంటాయి, కనుక చదువు వచ్చినవాడు చిన్నతనంలోనే యెన్నో కథలు బుద్ధికి పట్టించుకోవచ్చు"

"అనేక కథలు చూడడంవల్లా, చదవడంవల్లా, వినడంవల్లా చిన్నతనంలోనే బుద్ధికి వికాసం అబ్బుతుంది. అదే ప్రౌఢిమ, అంచేతే చదువురాని ముసలివాడికంటే, చదువు వచ్చిన కుర్రవాడు ఎక్కువ జ్ఞానవంతుడు కావడం"

"ఏతావతా :— కథ లంటే పైపైని వున్నా యనుకున్నావేమో? అవి కల్పించడానికి చాలా గొప్ప ప్రతిభ వుండాలి. వాటి విలవ తెలుసుకో డానికెంతో పరిజ్ఞానం వుండాలి. అవి చెప్పడాని కెంతో నేర్పుండాలి. అవి విన డాని కెంతో రుచివుండాలి, అవి బోధపరుచుకోడాని కెంతో బుద్ధిసూక్ష్మత వుండాలి"

"కథలు కళ్ళకి వెలుగిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనస్సుకి ఉత్సాహమూ ఉల్లాసమూ కలిగిస్తాయి. జడునకున్నూ కల్పనాశక్తి ప్రతిపాదిస్తాయి నిజంగా. వొక్కొక్క కథ యెలాంటి ఘట్టంలోనూ కూడా వొక్కొక్కళ్ళని వొడ్డెక్కిస్తుంది"

"కథలు చదవడమూ, అధమం వినడమూ యెప్పుడూ దండుగ అనుకోకేం?"

"ఇంతకీ :— కథలు సంగతి అలావుంచు. మన కళ్ళయెదట తాండవిస్తున్న లోకవృత్తం అయినా గమనిస్తున్నారా మన వాళ్ళు? ఎవళ్ళమాటో యెందుకూ, నువ్వు పరకాయిస్తున్నావా?"

"ఏదౌర్భాగ్యంవల్లనైనా మన బ్రాహ్మడు వంటలవాడు కావడం తటస్థపడితే అతని బతుకంతా ఆ విధంగా కడతేరవలసిందే. ఇక ఆమనిషి పైకి రావడం అంటూ వుండదు. అసలు, వంటబ్రాహ్మడయిన పైకి రావాలన్న చూపేవుండదు. దీనికి సాయం, ఆబతుకు, అనేకచోట్ల మరీ అపస్మారంలోకి దిగిపోవడమూ వుంది. మరి వంట కోమట్ల సంగతి నీకు తెలుసా?"

కోమటిబిడ్డ వంటకు దిగితే కొద్దికాలమే ఆపని చేస్తాడు. యావజ్జీవమూ చేసినా అదొక వ్యాపారంగా చూసుకుంటాడు. మనవాడు? "నువ్వీవృత్తిలో యెందుకు దిగావూ?" అనడితే "దినం గడిచే వుపాయం మరివొకటి కనపడక" అని చెప్పేస్తాడు వంట బ్రాహ్మడు. పోనీ, అప్పటి కలాగ నిలవతొక్కుకుని,

తరవాత, సావకాశంగా మరొక వృత్తి చూసుకుంటాడా? అబ్బే! చెప్పాను కాదూ? మనవాడి కా దూపే వుండదు. మరి వంటకోమట్లు? కోమట్లు వంటలకు దిగడం దినం గడవక కాదు, డబ్బు సంపాదించడానికి. తన దగ్గిర పెట్టుబడి లేదు; కనక, పెట్టుబడి లేని వృత్తుల్లో అదొకటి కనక, అందులో ప్రవేశిస్తాడు; కాని అతని దృష్టి యెప్పుడూ వ్యాపారం మీదే వుంటుంది. ఆవృత్తిలో వచ్చే డబ్బు ముందుముందు వ్యాపారం చెయ్యడానికి జాగ్రత్త చేసుకుంటా డతను. హీనాతి హీనా లయిన విలాసవిహారాలకు తగలబెట్టడు. నిదర్శనం కావా లంటే చూసుకో, చిన్న తనంలో, వంటలు చేసిన కోమటిబిడ్డ లెందరో యివాళ లక్షల మీద వ్యాపారాలు చేస్తూ పెద్ద పెద్ద పౌరులుగా వున్నారు. ఏదీ మనవాళ్ళలో అలాంటి సన్నివేశం చూపించు"

"వృత్తి అన్నా వ్యాపారం అన్నా కోమట్లు గౌరవంగా చూస్తారు. ఆదరంగా మాట్లాడతారు. ఆదిలో, పూరిగుడిసె పంచని కూచుని చప్పుళ్లిపాయలమ్మిన కోమటిబిడ్డ, పెద్ద అయాటప్పటికి, పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తూ ఏడంతస్థుల మేడలో యిష్టోపభోగా లనుభవిస్తూ వుంటాడు. మనవాళ్ళకి ఆవ్యాపారం చెయ్యడానికే మనసొప్పదు; గాని అతని దగ్గిర గూమాస్తాగా చేరి చెమటవోడ్చి పనిచెయ్యడానికీ అతన్ని యాచించి నాలుగుడబ్బులు పట్టుకుపోడానికీ అభ్యంతరం లేదు, చూస్తున్నావా?"

"ఇంతకీ :— ఎవరెవ రెన్నెన్ని ధర్మపన్నాలు చెప్పినా ఐహికాలికి డబ్బే ప్రధానం. ఈలోకంలో పుట్టి, యిది అస్థిరం అనీ, డబ్బు క్షుద్రం అనీ, జీవితం నీటిబుడగ అనీ నిరసించడం తెలివిమాలిన పని. ఈలోకంలోకి వచ్చేదాకా దీనితో లేశమూ సంబంధం లేని జీవికి, యిక్కడ వుండినంతకాలమూ ఇది తప్ప మరొకటి లేదు, ఇక్కడపుట్టి, ఇక్కడి సర్వమూ క్షుద్రం అనుకుంటే గాని ఆలోకం సిద్ధించకపోతే, అస లిక్కడికి రావడం యెందుకూ? అక్కడి సృష్టి అంతా యెందుకోసం? జగత్తంతా మిధ్య అయితే, మరి అలా బోధించేవాడిమాట?"

ఐహిక జీవితం మిక్కిలీ జటిలం. కనకనే, మనిషికి, పశువులకు లేని జ్ఞానరూపమైన విశిష్టత ఐహికజీవితంలో వడిదుడుకు లెక్కువ అయితే, మనిషిబుద్ధి వాటిని అధిగమించగలదే. ఇక్కడి నియమ నిబంధన లన్నీ మనిషిబుద్ధివిభవాలే, దేవుడు సాయించినవి కావు. వాటి పరమ ప్రయోజనం ఇది స్వర్గం కావడమే. ఇది స్వర్గంచేసుకోలేనివాడు, అక్కడ స్వర్గం అంటూ వుండే అది మాత్రం యెలా సాధించుకో గలుగుతాడూ?"

## 13

"చెప్పవచ్చిం దేమిటంటే? వెనక, యెప్పుడో మాఅమ్మ చెప్పివుండిన యీ రెండు కథలూ నాకప్పుడు జ్ఞాపకం వచ్చాయి. దీంతో, సుబ్బయ్య కిల్లీల అమ్మకం అప్పుడు నా కళ్ళ యెదుట జరుగుతున్నట్టు కనపడింది. వెంటనే నా ఆలోచన పూర్తి అయిపోయింది."

"వర్తకం చెయ్యాలని స్థిరపరుచుకున్నాను నేను"

"విన్నావా? నేను వర్తకం చెయ్యా లనుకున్నాను. అయితే, వర్తకానికి సంబంధించిన పరిజ్ఞానం నాకు గ్రాంధికమూ వ్యావహారికమూ కూడా లేశమూ లేదు. అది వుండడానికి తగ్గవయస్సే లేదు. వయస్సంటే, కోమటి బిడ్డలు ఆవయస్సుకే రగడ తేరి వుంటారు, నేను చెప్పింది మన బ్రాహ్మణ కులం సంగతి. దీనికి సాయం, మా యింటావంటా అయినా ఆసంప్రదాయం లేదు. చేతిలోనా రాగిదమ్మిడీ కూడా లేదు. అయినా నాకు జంకూ కొంకూ పుట్టలేదు. ఆసంకల్పమున్నూ వికల్పం కాలేదు. ఎన్ని విధాల, వితర్కించుకున్నా మరో దారే నచ్చలేదు"

"అయితే, లాభం రానీ నష్టంరానీ పెట్టుబడి వుంటే అందరూ వర్తకం చెయ్యవచ్చు. పెట్టుబడివుండి వర్తకంచేత కాకపోయినా, పని చేసినందుకు, వచ్చిన లాభంలో నిర్దిష్టంగా కొంత యివ్వడానికి సిద్ధపడితే అది చేతనైన వాళ్ళూ దొరుకుతారు. వర్తకశాస్త్రంలో యిదొక మంచిసూత్రం. ఇలా చేసీ, చేరీ బాగుపడ్డ వాళ్ళున్నూ చాలామంది వున్నారు; కాని నన్నెవరు చేరదీస్తారూ?"

"పోగా—పెట్టుబడి తక్కువా, బుద్ధియెక్కువాను. వర్తకశాస్త్రంలో ఇదొక సూత్రం; కాని యిది యెంత సుళువుగా కనబడుతుందో అంత కష్టం అయినది. ఏమంటే? వచ్చిన లాభం యెప్పటి కప్పుడే అసల్లోచేరుస్తూ వుండినా వర్తకం యెన్నాళ్ళకో గాని పెరగదు, వచ్చింది, వచ్చిందే తడువుగా తినేస్తే యిక చెప్పడాని కేంవుందీ? కాని యిలాగ వర్తకం చేసిన్నీ లక్షలూ కోట్లూ సంపాదించినవారున్నారు యాభై లక్షలు సంపాదించి వోహో అనిపించుకున్న కొవ్వూరి బసివిరెడ్డికి, ఆదిలో పెట్టుబడి యెంతో యెరుగుదువా నువు?"

"ఇక్కడ, మూడు మైళ్ళ వెడల్పున్న గోదావరి, పుట్టినచోట యెంత సన్నంగా వుందో విన్నావా నువ్వు?"

"నిజానికి, అప్పటి కీ సూత్రా లేవీ నాకు తెలియవే అనుకో; కాని సత్యం అంతేగా? పోతే—యిక "అప్పు చెయ్యగూడదా?" అంటావు నువ్వు. ఎంత లాభం వచ్చినా వడ్డీ మింగేస్తుం దని తెలిసివుండిన్నీ అలాగ వర్తకం చెయ్యడం కూడా

లోకంలో వున్నదే; కాని నాకప్పుడు పది రూపాయిలయినా అప్పు పుట్టే ఆస్కారం లేదు. మా అమ్మ దగ్గిర వుండిన పది రూపాయిలూ పుచ్చుకుందామా అంటే ఆక్షణాన ఆటే కట్టిపోతుంది. లాభం వస్తుందో రాదో, అసలు వర్తకమే నడుస్తుందో నడవదో నిర్ధారణ లేదాయె, నెలదినాలు నిశ్చింతగా గడిపే ఆధారం ముందే పాడుచేసుకోనా?"

"ఇక మరేమిటి చెయ్యడం?"

"వర్తకమే చెయ్యాలి, అది మాత్రం తప్పదు. అప్పే చెయ్యాలి, దొరికినా దొరక్కపోయినా మరోదారి లేదు"

"ఇలాగ, ఈ రెండూ తేలిపోయాయి. ఇక పెట్టుబడి యెంత పెట్టడం అన్న ప్రశ్న చక్కావచ్చింది. పంతులూ! నువ్వు నవ్వు, నన్నెగతాళి చెయ్యి, నాకేమీ బాధలేదు. ఈ ప్రశ్న యెదురుకోడమే తడువుగా "ఒక్కరూపాయి మాత్రమే" అని నేను నిర్ధారణ చేసుకున్నాను. ఆదినాల్లో, ఆమాత్రం అయినా నాకు అప్పు పుట్టడం సందేహమే. అయినా, ప్రయత్నం తప్పదు గదా? నిజానికి, నువ్వు బోధపరుచుకోలేవు గాని, నిర్ధారణగా అగత్యం యేర్పడితే అన్నీ వుపాయాలే. అన్నీ సాధనాలే. అగత్యం ఏర్పడ్డప్పుడు పెద్దపులిని చంపడానికి తుపాకీ అక్కర్లేదు. వెనకటికి మునికూడలి గ్రామ కాపురస్థులు, శ్రీ శ్రీపాద అక్కు సోమయాజులుగారు, అడివి అడ్డుపడి గోకవరం వెడుతూ, హఠాత్తుగా మీది కురికిన పెద్దపులిని చేతిలో వుండిన ములకాటికర్ర తిరగవేసి కొట్టి ఒక్క దెబ్బతో చంపేశారు"

"కాగా, అప్పు చేద్దామనుకునేటప్పటికీ, అది వొక్కరూపాయి అని నిర్ధారణ అయేటప్పటికీ నేనది యెవరి నడిగితే లాభిస్తుందో అది కూడా నిర్ధారణగా స్ఫురించింది"

## 14

"ఆర్యాపురంలో మేముండిన యింటి కెదురుగా ఒకవకీలు చాలా పెద్దచెయ్యే. చులాగ్గా, నెలకి వెయ్యిరూపాయిలు సంపాదించేవాడు; కాని ఖర్చులో మహాజోరు. రాజమహేంద్రవరంలో, ప్రజాహితకార్యాలేవిజరిగినా మొదటి చందా కూడా ఆయనదే. ఈ పట్నాని కంతకీ "బ్రూహాం" బండి ఆయన కొక్కడికే వుండేది, ఆదినాల్లో. ఆయనను చూసే మరో యిద్దరు ముగ్గురున్నూ సంపాదించారది, తరవాత. ఇప్పుడు రోల్సురాయిస్ కారంటే యెంత ఘనతో అదంటే అప్పు డంత ఘనత. దానిమీద ఆయన కోర్టుకి వెడుతూ

వుంటే మహారాజు అన్నట్టుండేవాడు. గృహకృత్యాల్లో గూడా తోచకే పోవాలి గాని ఖర్చు వచ్చిందంటే యిక వెనకా ముందూ లే దాయనకి"

"అంచేత, పదేళ్ళ ప్రాక్టీసయినా మనిషి మిగలడమే. అద్దె కొంపే. వెనకా ముందూ సద్దుబాట్లే"

"రెండో పెళ్ళి పెళ్ళాం యిదంతా పరకాయించింది." "మనల్నే యేలుకునే టట్టుంది యీపిల్ల" అనుకుంటూనే పుస్తె ముడివేశాట్ట ఆయన. పెళ్ళి అయిన సంవత్సరానికే కాపరానికి వచ్చి, వచ్చిన సంవత్సరానికే సంగతంతా గ్రహించేసిం దావిడ. బాగా ఆలోచించింది. తటపటాయించింది. నిర్ధారణ చేసుకుంది. తల వొగ్గింది. సాహసించింది. ఆఫీసు ఖర్చులన్నీ పోను, మిగిలిన దాల్లో సగానికి సగమూ తన చేతిలో పోస్తేగాని అన్నం పెట్టనని భీష్మించు కూర్చుంది, చివరికి"

"ఆయనైనా మాంచి పకడ్బైన మనిషి కాని జజ్జమ్మ కాడు. ఎలాటి కక్షి దారూ కూడా ఆయన యెదట పిల్లి అయివుండేవాడు. అలాంటి ప్రభుశక్తి అంతా చూపిస్తూ ఆయన, మొదట అగ్గయిపోయాడు. తరవాత వురిమాడు. పరవళ్ళున్నూ తొక్కాడు. ఒక్క నెలరోజులు ఆవిడ మొగంకూడా చూడ్డం మానుకున్నాడు; కాని, బుస్సలు కొడుతూ కొడుతూనే రెండో నెల పూర్తికావ చ్చాటప్పటికి రాజీకి పూనుకున్నట్టు నటించి లొంగిపోయి వూరుకున్నాడు"

"నెలకినెల అంతా, వచ్చినసొమ్ము ఆయనదగ్గరే వుంటూవుండేది. ఖర్చులన్నీ రివాజుప్రకారం గుమస్తాలే చేసేవారు; కాని వొకటో తేదీని, ఆఫీసు తెరచిన వెంటనే వున్నదంతా రెండు భాగాలు చేసి, ముందు భార్యాభర్తల కిచ్చేసి తరవాతే పని ప్రారంభించేవాడు పెద్దగుమస్తా"

"ఇందుకు ఫలితంగా ఆయనకూడా ఆదాచెయ్యడం నేర్చుకొన్నాడు. నాకొక్క రూపాయి అప్పు కావలసి వచ్చాటప్పటికి ఉండిన అద్దెకొంప కొనేసి చక్కని మేడ కట్టా డాయన. భర్తపేరనే ఆవిడ యాభై వేలు వడ్డీ మీద తిప్పుతోంది"

"సొదెమ్మక్కయ్యగా రయినా, అంతవకీలుకి తగినట్టు దర్జాగానే వుండే వారు. పురుషులలో ఆయనలాగే, స్త్రీలలో ఆమె నాయకమణిగా వుండేది. ఎలాంటివాళ్ళతోనూ ఎంతో ఆదరంగానూ ప్రీతిగానూ మాట్లాడేవా రామె. బీద రాలని మాఅమ్మ నెప్పుడూ ఆమె, చిన్నచూపు చూడలేదు. "పిన్నిగారూ" అంటూ ఎంతో చనువుగా మాట్లాడుతూ, మా అమ్మ సలహా పుచ్చుకోకుండా ఆమె ఏపనీ చెయ్యలేకపోయేది"

"ఈ ఔదార్యం నమ్ముకుని నేను ఆవి డ్ణాశయించాను. అంటే, వొక్క రూపాయి అప్పడిగాను. "మళ్ళీ వొక్క నెలకిచ్చేస్తా" నని గడువుకూడా చెప్పాను"

"తీరా అడిగేశాను; గాని తరవాత నేను చాలా బిడియపడ్డాను. "లే" దన్నా "యివ్వ" నన్నా బాధలేదు; కాని "యెలాతీరుస్తావూ?" అనడిగితే ఏమిటీ చెప్పడం? అయితే నానీడ చూసుకునే నేను జంకాను కాని ఆవిడ నామాట కొట్టె య్యనూ లేదు, విషమప్రశ్నలు అసలే వెయ్యలేదు. "ఒక్క రూపాయి భాగ్యానికి బదులేమిటి తమ్ముడూ? అందులోనూ నీకా? పట్టుకు వెళ్ళవోయ్" అంటూ వెంటనే రూపాయి యిచ్చారు."

"నేనే వద్దన్నాను; గాని ఆవిడ "ఇంకో రూపాయికూడా యివ్వనా?" అనడిగారు పాపం"

"అబ్బాయీ! నావర్తకానికీ, నామేడలకూ, నాభూములకూ, నావైభవానికి అదిగో ఆవొక్క రూపాయే మూలం. ఇవాళ, ఎనిమిదిలక్షల కధికారి అయి వున్న చేబోలు శంభుశాస్త్రి స్వతంత్ర జీవితం ఆవొక్క రూపాయి తోనూ పరిణతి చెందింది."

## 15

"ఆ వొక్క రూపాయీ పుచ్చుకుని నేను మెల్లిగా బజారుకి బయలు దేరాను. "జాగ్రత్తసుమా నాయనా" అని మంగళాశాసనం చేస్తూ, మాఅమ్మ వీధిగుమ్మం దాకావచ్చి సాగనంపింది. ఇది వింటూంటే నీకు నవ్వు వస్తోంది, నేను గుర్తించకపోలేదు; కాని నువ్వు చేస్తున్న ప్రయత్నం యెలాంటిదో మరిచి పోయావు. తనతాహతు తాను గుర్తించుకునే యోగ్యతేవుంటే, నీకే కాదు, మన ఆంధ్ర జాతికే యిప్పుడిలాంటి గతి పట్టకపోవును."

"కాకపోయినా, ఆవొక్క రూపాయీ పుచ్చుకుని బయలుదేరిన, నేను, అప్పుడు, లక్షరూపాయీలూచేతిలో వుండినంత ధీమాగా వున్నాను. ఇది గుర్తించగలవా?"

"ముందుముందు జాతి నుద్ధరించే మహానుభావుడే పుట్టుకు వస్తాడో, సర్వనాశనం తెచ్చిపెట్టే క్రూరుడే పుట్టుకువస్తాడో తెలియకపోయినా, గర్భవతి అయి వుండిన లేజవరాలిని సభ్యలోకం నెత్తిమీద పెట్టుకుంది. గర్భరక్షణకు అనేక విధులూ సూత్రాలూ యేర్పడి వున్నాయి. బానిసచిత్తవృత్తికి వర్తకంలో వుండిన విశిష్టత బోధపడదు; గాని ఆరూపాయి చేతిలో వుండిన నేనూ అప్పు

డలాగే వున్నాను. ఏమంటే? ఆ వొక్క రూపాయీ నన్నాకాశాని కెత్తెయ్యనూ వచ్చు. తాను నుసి అయిపోయి నాకు నామరూపాలు పుట్టకుండానూ చెయ్య వచ్చు"

"ఏమైనా, నాఆశా, మాఅమ్మఆశా ఆ ఒక్క రూపాయి మీదా సుడి తిరుగుతూ వున్నాయి. కాక:— నాకు వర్తకం నడుస్తుందో నడవదో ఆవొక్క రూపాయీ తేల్చేస్తుంది. ఒక మనిషి జీవితం వెలుగుతోనో చీకటితోనో నింపెయ్యగల రూపాయి అది, నువ్విది అవగాహన చేసుకోగలవా?"

"మనిషికి వన్నె తెచ్చేది ప్రవర్తనేగాని వొడ్డూ పొడుగూ కాదు. అలాగే రూపాయికిన్నీ వన్నె తెచ్చేది విలువేగాని దాని పనివాడితనం కాదు"

"లక్షాధికారి చేతిలోవుంటే రూపాయివొక చిళ్ళపెంకు. నిరుపేద చేతిలో వుంటే అది వొక పెద్దకాసు. ఇది మనిషి తాహతును పట్టియేర్పడ్డ వ్యత్యాసమే గాని రూపాయి విలువలో తేడా లేదు. ఆ రూపాయి చేతికి రావాలంటేమాత్రం లక్షాధికారీ భిక్షాధికారీ చూపించవలసిన పురుషకారం వొకటే, భిన్నంకాదు. కనక, పురుషాకారం బాగా వినియోగించుకోవడంలో వుంది; గాని పెట్టుబడి హెచ్చు తక్కువలలో లేదు విజయం"

"ఆదిలో, నెలకి నాలుగు రూపాయల జీతంమీద విజయనగరం సంస్థానంలో నౌకరుగా ప్రవేశించిన జోగి జగన్నాథరాజు క్రమాంతరాలమీద దివానయి, ఆసంస్థానమే కాదు, చివరికి ఆరాజునే యేలాడు, నీ కిదితెలుసా?

"ఏవంచ :— దమ్మిడీ అయినా అప్పు పుట్ట దనుకున్న నాకు ఆదర పురస్సరంగా ఆరూపాయి అప్పు దొరకడంలోనే వుంది విశేషం. అంటే యేమిటో బోధపడిందా? ఆరూపాయి, ఒకభిక్షకుని మైనరు కొడుక్కికూడా విలవ వుందని నిరూపించిన దీటురాయి. అయితే, దాని విలవ కెప్పుడూ భంగం లేదు. మరి, నా విలవ కూడా భంగపడకుండా వుండేటట్టు చూసుకో గలిగితే?"

"ఏపనికి పూనుకున్నా కర్తఅయినవాడు గుర్తించుకో వలసిన మూల సూత్రం యిది. పనిచేసేవాడికి పరికరాలుకాదు ప్రధానంగా దీక్షా, ఏకాగ్రతాను. పరికరాలు జడాలు. వాటికి స్వతఃప్రవృత్తిలేదు. కర్త, తన సత్తా అంతా వాటియందు నిక్షిప్తం చేస్తేనే అవి ఉద్దిష్ట ప్రయోజనాలు సాధించి పెడతాయి. ఉద్యమాలకు దైవిక రాజకీయాలంటే సోమరితనం యెక్కువ ప్రతిబంధకం. అది అలుముకుందా, యికయెంత సాధనసామగ్రి వుండినా కర్తకి విజయం లేదు"

"అయితే, ఇలాంటి విలవలన్నీ అప్పుడు నాకు తెలియవు, నిజమే. ఉత్సాహమూ ఆశామాత్రం అతిమాత్రంగా వుండినాయి. అభయులుదేరడం,

ఎక్కడో రూపాయిాలు గుట్టలుపడి వుండినట్టూ మొయ్యగలిగినన్నీ అవి తెచ్చు కోడానికి నేను వెడుతున్నట్టూ అనిపించింది. నేను గుమ్మం దిగాటప్పటికి భావాంబర వీథుల్లో ఎక్కడి కెక్కడికో యెగిరిపోసాగింది నా మనస్సు; కాని రెయిలు పట్టాలు దాటాటప్పటికి "ఆగు" అంటూ గుండెలమీద చెయ్యివేసి నన్నెవరో గుంజేసినట్టూ "వెళ్ళి యేమి వర్తకం చేస్తావోయ్?" అని నిలవతీసి అడుగుతున్నట్టూ అయి తక్కున ఆగిపోయాను నేను"

"వాస్తవమే. ఏమి వర్తకమూ చెయ్యడం? "వర్తకం వర్తకం" అన్న "వుబలాటమేగాని ఏమిటా వర్తకం?" అన్న ఆలోచనే కలగలేదు నాకప్పటివరకూ. అంచేత యిది స్ఫురించాటప్పటికి నేను నిర్విణ్ణుణ్ణయిపోయాను. తీరా, సరుకు కొందామని బయలుదేరాటప్పటి కిలాంటి గుంజాటన కలగడం, నాకు, నావర్తకాని కేదో విఘాతం మూడిందన్నంత నిరుత్సాహం కలిగించింది. నిజంగా, అప్పటి నాచిత్తక్షోభ నువ్వు గ్రహించ లేవు. నేను విడమర్చి చెప్పలేను; కాని సరిగా ఆసమయాన "బండి కావాలా?" అంటూ వచ్చి నన్నొక జట్కామనిషి నామొగాన మొగంపెట్టి అడిగాడు. దాంతో, నేను ప్రకృతిలో పడ్డాను. వెంటనే "డబ్బు రావాలి గాని, యేమి వర్తకం అయితే యేమీ" అని? నన్నెవరో సముదాయించినట్టయింది. "నిజమే" అనుకున్నాను నేను. నేను అనుకోకుండానే అడుగు ముందుకి పడింది. నిలిచి పోయి వుండిన నేను బజారు కేసి నడుస్తున్నట్టు నాకు తెలిశాటప్పటికి దామోదర రావు హోటల్ దగ్గిర వున్నాను"

"ఎడతెగని అంగళ్ళ కదే మొదలు. కుడివైపున నడివీధిలోనే పూల అంగళ్ళతోనూ,ఎడమవైపున పుస్తకాలఅంగడితోనూ ప్రారంభమైన ఆబజారులో, వెళ్ళినకొద్దీ ఉప్పూ చింతపండూ అమ్మే చిల్లరఅంగళ్ళు మొదలుకుని బంగా రమూ రత్నాలూ అమ్మేపెద్ద అంగళ్ళదాకా అన్ని రకాలవీ ఉన్నాయి. నిర్ధారణ లేకుండా బయలుదేరిన నా కళ్ళకి అవన్నీ ఉజ్వలంగానే కనపడ్డాయి. కొనుక్కునే వాళ్ళు ప్రతీ అంగడిలోనూ ముసురుకుంటూనే వున్నారు. నాగరిక జీవితానికి, వాటిలో అనవసరమైన అంగడి ఒక్కటీలేదు. ఇంతే కాదు, శ్రద్ధగా చూసుకుంటే లాభం చేకూర్చని దిన్నీ వొక్కటీ లేదు."

## 16

"నాకళ్ళు చెదిరిపోయాయి. నగల అంగళ్ళలో, బీరువాలలో వుండిన వెండి సరుకు చూశాటప్పటికి మనస్సున్ను చెదిరిపోయింది. దీంతో ఆలోచన కస్సింతా యెగిరి పోయింది"

"చూడగా, చూడగా "యిది కాదు మార్గం" అనితోచింది. వెంటనే బయలుదేరి యెవళ్ళతోనూ మాట్లాడకుండా, కోటగుమ్మం దగ్గిరనుంచి పెద్ద మసీదు దాకానూ, మళ్ళీ, పెద్దమసీదు దగ్గిరనుంచి కోటగుమ్మందాకానూ యెడా పెడా చూసుకుంటూ నాలుగైదుమాట్లు తిరిగాను. అలా తిరగడంలో, మొదటి మాటు కూరల అంగళ్ళు కూడా గొప్పగానే కనపడ్డాయి. రెండోమాటు నా చూపూ కిల్లీ అంగళ్ళమీద పడింది. మూడోమాటు కిరాణా అంగళ్ళమీద వాలింది. నాలుగోమాటు స్టేషనరీ అంగళ్ళ మీద ప్రసరించింది. చివరికి, బట్టల అంగళ్ళమీద లగ్నం అయింది"

"నవ్వు వస్తోంది కదూ నీకు? ధర్మమే, ఆ వొక్కరూపాయీ పుచ్చుకుని లక్షల విలవగల వొక అంగడిలో ప్రవేశించినప్పుడు నాకూ వచ్చింది నవ్వు. అయితే, "నీలాగ వొక్క రూపాయికాదు; గాని ఈవర్తకుడున్నూ ఆదిలో వందలు పెట్టాడేగాని లక్షలు పెట్టలేదులే" అని నాకెవరో ధైర్యం చెప్పినట్టయింది. దానిమీద "దేవుడు మేలుచేస్తే యీవొక్క రూపాయితోనే నేనూ యింత అంగడీ చేస్తాను" అనుకున్నాను."

"అనుకుంటూనే సాహసించి వెళ్ళి అంగడిలో చతికిలబడ్డాను, బీరువాల కేసి చూస్తూ"

"నన్ను చూడ్డంతోనే "యేమికావా" లని అడిగాడు వర్తకుడు. ఆ ప్రశ్న వినగానే "బతికాం" అనిపించిదినాకు. "ఏమి తెచ్చావని అడగలేదు, నయమే" అనుకున్నాను"

"అప్పటికొక బ్రాహ్మడు పెద్దబేరం చేస్తున్నాడు. పెళ్ళికి రకరకాల బట్టలు కొనడానికి వచ్చాడాయన. ఆబేరం తెమిలా టప్పటికి నాలుగురకాలూ కళ్ళబడతాయి. ధరలున్నూ, తెలుస్తాయి ఏమికొనడమో సులభంగా తేల్చుకో వచ్చు. ఈ వూహతో నేను "నావిషయమై తొందరలేదు. ఆ బేరం కానివ్వండి" అన్నాను"

'చూస్తూవుండగా, అరగంటలో, యెనిమిదివందల రూపాయీల సరకు కొని పట్టించుకు వెళ్ళిపోయాడా బ్రాహ్మడు. అప్పటికి నాయెన్నిక కూడా స్థిరపడిపోయింది. ఒక పట్టుచీర నూటయెనభై రూపాయీలకు పుచ్చుకున్నా డాయన. సేలం పట్టుచాపు నూటపాతిక రూపాయీలకూ మదుపర్కాలు రెండూ యెనభై రూపాయీలకూ పుచ్చుకున్నాడు. అలాంటి వాటిలో యెంత అయినా లాభం కొట్టవచ్చు; కాని యీ వూహలవల్ల నాకేమి ప్రయోజనమూ?

"పోగా, యిక నాకంటికి తువాళ్ళు ఆనాయి. పావలాకొకటి చొప్పున పుచ్చుకున్నా డాయన. ఈలోపున నేను ధోరణి సరిచేసుకుని "నాకు నాల్గు

తువ్వాళ్ళు కావాలి. నాసొంత వాడకానిక్కాదు, మారుబేరాని కమ్ముకోడానికి. నాకు కాఫీ డబ్బులు మిగిలేట ట్టివ్వండి అన్నాను మెల్లిగా"

"ఎప్పుడయినా బజారుకి వెళ్ళి సాదాకూరలు కొనడం తప్ప. అప్పటి దాకా స్వతంత్రించి నేనేమీ కొని యెరగను. అయినా, ఆవలిస్తే పేగులు లెక్కబెట్టే ఆవర్తకునితో నేనప్పుడంత పొందికగా యెలా మాట్లాడగలిగానో యిప్పటికి నా కాశ్చర్యమే. కాని తరవాత్తరవాత, వర్తకులకు, పెట్టుబడి కంటే ముందుమాట పొందిక చాలా ఆగత్యం అని బాగా తెలిసి వచ్చింది. అందుకు ఫలితంగా ఆవర్తకుడు "మూర్తికొక కానీ తగ్గించుకో" మన్నాడు. "బేడ డబ్బులు లేకపోతే తిరిగినందుకు కూలి అయినా కిడుతుందా?" అని నే నెదురడిగాను. వెంటనే వర్తకుడు "మొత్తంమీద అయిదు కాను" లన్నాడు. నేను బదులుచెప్పక మిడుతూ మిడుడూ చూసి వూరుకున్నాను. అవ్యవధానంగా వర్తకు "డారుకాను" లన్నాడు. దానిమీద, నేను "రెండుకానులు మీకు సిగ రెట్టుకి చాలవు. నాకుమాత్రం అరకప్పు కాఫీ వస్తుంది" అన్నాను. "ఎవరు బాబూ మీరూ?" అనడిగాడాయన. "మేము బ్రాహ్మలం" అన్నాను. "రూపాయి గుడ్డిగవ్వగా భావించే కులంలోపుట్టి మాకోమట్లని మించారే పంతులుగారూ" అంటూనే, ఆయన, రూపాయి పుచ్చుకుని నాలుగుతువాళ్ళూ రెండణాకాసులూ నామీద పడేశాడు"

"పధ్నాలు గణాలతోనే వర్తకం జరిగితే, ఆరెండణాలూ చేర్చడంవల్ల అది మరింత పెరుగుతుందిగా? అంచేత, ఆబేడా ఆయన కిచ్చేసి, వొక చిన అంగావస్త్రంకూడా పుచ్చుకున్నాను నేను"

"సెబాష్! సరుకు కొనడంలోనే రెండణాలు లాభం. అమ్మకంలో మరో రెండణా లయినా మిగలకపోతుందా?"

"ఇదిలా వుండనియ్యి. ధారాళంగా పావులాపలికిన తువ్వాలు. వర్తకుడు నాకు మూడణాల నరకే యిచ్చాడంటే, యెనిమిదివందల సరుకు కొన్న ఆ బ్రాహ్మడి కంటే నా యెక్కు వేమిటి? అదే వర్తక రహస్యం. ఇది కూడా ఇలా వుండనియ్యి. అంతరువులు ప్రతీదాల్లోనూ వుంటాయి. ఈజ్ఞానం వుండి మసులుకుంటే యేమీ బాధ వుండదు. ఇక వున్నదల్లా యేమి టంటే? అప్పటి దాకా నేనొక భిక్షుకుని కొడుకుని; కాని నిమిషంలో వర్తకుణ్ణయిపోయాను. మరి నీసంగతి? ఘనాంతస్వాధ్యాయి కొడుకువి నువ్వు. ఈనాందారువున్నూ; కాని క్షణంలో బానిసవై పోడానికి సిద్ధపడుతున్నావు, అంతరం యే మయినా తెలుస్తోందా?"

"బానిస కంటే ముష్టివాడు కూడా స్వతంత్రుడే, తెలుసా? సభ్యత యెక్కడ? ఈచిత్తవృత్తి యెక్కడ? చేతల్లో అధమవర్ణమా? లెక్కల్లో అగ్ర వర్ణమా?"

"ఐహిక జీవితం తప్పనప్పుడు ఐహిక జీవిత విధానాలకు దూరంగా వుండకుండా వుంటే యెంతబాగుండేదీ? మన మత కర్తలు జన్మకి ప్రాధాన్యం యిచ్చి వుండకపోతే, ఎన్ని పరజాతులతో, సంపర్కం కలిగినా మన జాతీయత యిప్పటిలాగ రసాభాస అయిపోకుండా వుండేది కాదూ?"

పోగా లక్షలాది సరుకుంది కనక, అంగడి పెట్టుక్కూచున్నా డతను, మరి నేనేమిటీ చెయ్యడం? మూటలు బుజానవేసుకుని చాలామంది దేవాంగులు వీధివీధికి యింటింటికీ తిరుగుతూ వుంటారు చూశావా? నాకూ అదే దారి, తప్పేం? ఏం? అలా చూస్తావేం? ఇంటింటికి తిరిగి తువ్వాళ్ళు అమ్ముకోడం నామోషి పనిగా తోస్తోంది నీకు, కాదూ? అయితే చెంబు పుచ్చుకుని ప్రతీ గుమ్మమూ యెక్కడం కంటేనూ చెడ్డదా అది? కొంగు చాపుకొని ప్రతి ఆఫీసుకీ తిరగడం కంటేనూ హీనమా అది?"

## 17

"ఆమూర్తు లయిదూ అయిదు రత్నా లన్నట్టు మురిసిపోతూ, తిన్నగా, యిన్నీస్‌పేటకి బయలుదేరాను నేను. అయితే, నా దగ్గిర వుండినవి రత్నాలే; కాని నే నవి అమ్మగలనా? అమ్మగలిగితే సరి అయిన ధర పలికించగలనా? పలికించ గలిగితే లాభం వస్తుంది, సందేహంలేదు; కాని చిరసంచితమైన కులాచారం అనుసరించి అది మరో విధంగా ఖర్చు పెట్టయ్యకుండా వుండగలనా?"

"ముందుకి అడుగు వేశాటప్పటికి న న్నీ సందేహాలు దిగ్భ్రాంతుణ్ణి చేశాయి"

"అస్థితిలోనే మరోనాలు గడుగులు ముందుకి వేశా టప్పటికి, పెద్ద పెద్ద మూటలతో యిద్దరు ముగ్గురు దేవాంగులు అడ్డుతగిలారు. మంగళవారప్పేట కేసి వెడుతున్నారు వారు. వారెంతో ఉల్లాసంగా వున్నారు. బట్టల వర్తకం ప్రారంభించిన వెంటనే వారు కనపడ్డం నాకు గొప్ప శుభసూచనగా తోచింది"

"మన బ్రాహ్మలకు ఆమూటలు మొయ్యడమే కనపడుతుంది; గాని ఆ స్వతంత్ర జీవనం కనపడదు"

"సత్యం గుర్తించగలిగితే, ఆడా మొగా పిల్లా మేకా వస్తూత్పత్తి చేసి సంఘమర్యాదకు మూలాధారం అవుతున్న జాతి వారిది. ఆహార నిద్రా భయాదులు ప్రాణికోటి కంతకీ సమానమే. ఆ ప్రాణికోటిలో మనుష్యజాతికి గల

విశిష్టతకు మొదటి గుర్తు బట్టకట్టు. నాగరికత ప్రబలిన కొద్దీ ఆబట్టలలో అనేక రకాలూ, అనేక అంతస్థులూ ఏర్పడ్డాయి. దేశాని కంతకీ అలాంటి బట్టలు సమకూరుస్తున్న జాతి వారిది.

"అయితే, గజం యెత్తున వుండిన వారి భుజం మూటలు యెదుట, నా చంకమూట యేపాటిదీ? ఇది తలుచుకుని నేను చాలా సిగ్గుపడిపోయాను; కాని నా కధైర్యం కలగలేదు. ముందు ప్రతిభా, తరవాత నీతి వుంటే చంక మూట భుజం మూట చెయ్యడం దినాల మీది పని. ఏమంటే? వర్తకం మీద, మనిషి, వొక కన్నుంచి మసులుకుంటే అది, మనిషిని రెండుకళ్ళా చల్లని చూపు చూస్తుంది"

"ఈ విషయం మనలో కోమటిబిడ్డకి తెలిసినట్టు మరెవరికీ తెలియదు. అందుక్కారణం? వర్తకంలోనే వుంది డబ్బు. డబ్బువిలువ కోమట్లకి మాత్రమే తెలుసు. డబ్బు పుట్టించడంలో కోమట్లకున్న చాతుర్యం మరెవరికీ లేదు. బ్రాహ్మలకు లేనేలేదు"

"రూపాయి అంటే నూటతొంభై రెండు దమ్మిడీలు" అని బ్రాహ్మడు దానికి హీనత ఆపాదిస్తాడు. కోమటి "పన్నెండు దమ్మిడీలు ఒక అణా" అని దమ్మిడీకి గౌరవం ప్రతిపాదిస్తాడు. కనకనే, కోమటిబిడ్డకి, రూపాయికి, దమ్మిడీతోపాటు, రూపాయికి రూపాయీ-రూపాయికి, పదీ పాతికా రూపాయిలూ లాభాలువచ్చే అవకాశాలు లభిస్తూవుంటాయి"

"కోమటిబిడ్డ డబ్బే యీశ్వరానుగ్రహం అన్నట్టు భావిస్తాడు. టోలీలు కూడా విడిచిపెట్టకుండా సంపాదిస్తాడు. ఇక సమయం వచ్చిందా? సంచులికి సంచులే గుమ్మరించేస్తాడు, మంచినీళ్ళప్రాయంగా వాడేస్తాడు."

"ఇంతెందుకూ? దివాలాతీశాడన్న కోమటిబిడ్డ లక్షాధికారి అయివుంటాడు, తెలుసా?"

"కారణం? జ్యోతిశ్శాస్త్రం అయి, మన బ్రాహ్మలికి దృశ్యాదృశ్యం అయిపోయిన గణితశాస్త్రం. కోమట్ల చేతిలో ఆర్థికశాస్త్రం అయి, శుద్ధదృశ్యం అయిపోయింది"

"ఆర్థికనీతి మన కోమట్ల రక్తంలో పుంజీభవించివుంది. తరతరాలు సాధన చేస్తే గాని మన కది అర్థంకాదు."

"చెప్పవచ్చిందేమిటంటే? మనిషివల్ల వర్తకం పాడవుతుంది; గాని వర్తకంవల్ల మనిషి యెన్నడూ పాడయిపోడు"

"ఈదిలాసాతో నేను ముందుకి బయలుదేరాను. వెళ్ళిన కొద్దీ, యెదురుగా

వస్తున్న వారందరూ బజారులో యేదో సరుకు కొనడానికి బయలుదేరినవారే; కాని నేను బట్టల వర్తకుణ్ణని వారికి తెలియదాయె తెలిస్తే గాని నాదగ్గిర యెంత సరుకుంటే మాత్రం యేమి లాభమూ? దీనివల్ల, నాకు ఆక్షణంలోనే, సరుకు మీద కంటే ప్రకటనమీద యెక్కువ శ్రద్ధ పట్టాలన్న సత్యం అవగాహన అయింది. వర్తక శాస్త్రంలో యిదొక గొప్పసూత్రం. పాశ్చాత్యులు, ఇంకో ఆరుమాసాలకు వస్తువు తయారవుతుందనగా, యివాళే ప్రకటన ప్రారంభిస్తారు. దైవిక రాజకీయాలవల్ల వస్తూత్పత్తి నిలిచిపోవడం తటస్థపడినా, లోకులు, తమ సంస్థ పేరు మరిచిపోకుండా వుండడానికి రకరకాల ప్రకటన సాగిస్తూనే వుంటారు. నిరంతర ప్రకటన వల్ల ఉన్న సామ్రాజ్యాలు కూలిపోతాయి, కొత్తవి పుట్టుకువస్తాయి, నీకేం తెలుసూ? అయితే, మనవర్తకులలో, యీసంగతి యిప్పటికీ బహుకొద్దిమందికే తెలుసు. తెలిసినవారయినా అనుభవం వల్ల గుర్తించినవారే గాని నేర్చుకున్నవారు కారు. మనది వర్తకానికి చదువెందుకన్న ఆధ్యాత్మికదృష్టి కాదుటోయ్ మరీ? దీని కనుగుణంగానే, మన ప్రభుత్వం, నౌకరీకి తయారుచేసే విద్యా సంస్థలే గాని స్వతంత్ర జీవనమప్పేవి ఏర్పరచలేదుగా?"

"ప్రపంచ:— నా చేతిలో వుండినది నువ్వూ యెరుగుదువు, ఒక్కరూపాయి సరుకు. నేను దానివిలవ పెంచాలి. అంతకిముందు అవతలి మనిషికి తువ్వాళ్ళ అగత్యం యేర్పడాలి. నాదగ్గిర వుండినది అమ్మకం కోసమేగాని, నా సొంత వాడకానికి కాదనికూడా ఆమనిషికి తెలియాలి. ఇదంతా యెలా సంభవిస్తుందీ?"

"ఇలా ఆలోచించుకుంటూ నేను నాళంవారిసత్రం దగ్గిరికి వెళ్ళాటప్పటికి నాకొక వ్యాపారిపంతు లెదురైనాడు. నా అదృష్టంవల్ల, ఆయన చూపులు నాదగ్గిరవుండిన తువ్వాళ్ళమీద పడ్డాయి. అదిచూసి నేను ఆయనకు వాటి అగత్యం వచ్చి వుంటుందని వూహించాను. అవి నేనెలా కొన్నానో తెలుసుకోవాలని ఆయన భావిస్తున్నట్టున్నూ నేను గమనించాను. దీంతో ఆయన కళ్ళల్లోకే చూస్తూ నేనాయన కెదురు వెళ్ళాను దగ్గిరికి వెళ్ళాటప్పటికి నే ననుకున్నదే నిజం అయింది. నాపాచిక పారింది."

"చూసిచూసి 'అవేమి'టని అడిగాడాయన. నేను చెప్పాను. చెబుతూనే మడత పైకితీశాను. "ఎలాకొన్నారు?" అని మళ్ళీ అడిగారాయన. దానిమీద నేను బెల్లించిచూస్తూ "మీరుక్షమిస్తే, నేనివి యెలా అమ్ముతానో అది మాత్రం చెప్పగలను" అన్నాను. దీంతో, ఆయన చమత్కృతుడైనాడు. తరవాత, ఆయన మరో మాట వూహించకముందే మడత కూడా నేనాయన చేతి కందించాను"

"ఆయన కళ్ళు మిలమిల్లాడాయి. వెడల్పూ పొడుగూ చూసుకుని ఆయన ధర అడిగాడు. నేను జత మూడు పావులాలు చెప్పాను వెంటనే ఆయన తడుముకోకుండా పదణాల కడిగాడు. దానిమీద నేను "అంతవారగాచెప్పి నేను వర్తకం చెయ్యగలనా? అనడిగాను. "తువ్వాళ్ళ బేరం యిప్పుడు వంటెద్దు బళ్ళవాళ్ళకిన్నీ తెలుసు. మీదగ్గిరా నేను ఎద్దుఏడు మాడలు చెప్పడం?" అనిన్నీ అడిగాను. కావలిస్తే అర్ధణా తగ్గించుకోండి" అనేశాను, చివరికి "పోనీ, నువ్వొక్క కానీ కట్టుకో" అన్నాడాయన"

"అప్పటికి, ఆయన బజారుకి వెళ్ళకుండా యిక్కడే వొక్క తువ్వాలు పుచ్చుకోవాలని నిరుకు చేసుకున్నట్టు నేను గుర్తించాను. "ఎలాగయినా యీ బేరం పోనివ్వగూడ"దని ధృఢ నిశ్చయమున్నూ చేసుకున్నాను. ఈలోపున, ఆయన రెండుమాట్లూ, బేరం చేశాడు. రెండుమాట్లూ, నేనూ బేరం చెప్పాను. ఈ బేరాలతో విసిగిపోయి, చివరికి "మరో కాని కట్టుకో, ఏమంటావ్?" అనేశాడాయన."

"ఆమాట ధోరణిచూస్తే, వ్యవహారం నివ్వరిముల్లుమీద వుండినట్టు తోచింది. తువ్వాలు అయిదణాల కానికి కొనడం ఆయనకు లాభం అయితే, మూడుఅణాలనర పెట్టుబడిమీద, ఏడుకానులు మిగలడం నాకు లాభంకాదూ? అయినా, వెంటనే వొప్పుకోడం వర్తకసరళి కాదని "పదకొండణాల కానీ యిచ్చి రెండుతువ్వాళ్ళుపుచ్చుకోండి బాబూ" అన్నాను నేను. "మీచేతిలో వున్న మడతమీదే" అన్నట్టు చెయ్యూపుతూ. దీంతో, నేను లొంగిపోతున్నట్టాయన గ్రహించేశాడు ఆయన కళ్ళల్లో విజయగర్వం మెరిసింది. మాటల్లో కూడా బింకం యెక్కువయింది. చూపులో విసుగుదల స్ఫుటంగా కనపడింది. "పదకొండణాలమీద వొక్కదమ్మిడీ కూడా యివ్వను. బజారుకి వెళ్ళమంటావా, బేరం కుదురుస్తావా?" అంటూ గద్దించాడాయన. "నేను మీగుమ్మంలోకే వస్తూ వుంటే మీరు బజారుదాకా వెళ్ళడం ధర్మమేనా?" అంటూ నేమడత అందుకుని సగానికి చించి ఆయనకిచ్చేశాను. పదకొండణాలూ నాచేతిలో పడేసి తృప్తిగా వెనక్కి మళ్ళేడాయన, తువ్వాళ్ళు తిప్పితిప్పి చూసుకుంటూ"

"పంతులూ, వర్తకం అంటే యేమిటో బోధపడిందా? సరుకు తయారయే స్థలం వొకటీ, విడుదల అయే స్థలం వొకటీనీ. తయారుచేసేవారొకరూ వినియోగించుకునేవారొకరూను. ఉభయవర్గాలకూ లంకె పెట్టడమే వర్తకం. దీనివల్ల వస్తూత్పత్తి చేసేవాడికీ సౌకర్యమే, వస్తువు అందజేసేవాడికీ లాభమే, వస్తువు వాడుకునేవాడికీ సుఖవే. ఈవిధంగా, చివరకీ ముగ్గురికీ తృప్తే-కనక, వర్తకం చేస్తే యెవడి కొంపా తియ్యకుండానే నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చు"

"ఇది చూశావుగా? బజారు దాకా వెళ్ళనక్కరలేక పోయినందుకాయన సంతోషించాడు. వెంటనే వొకజత ఖర్చుపడ్డందుకూ తన్మూలంగా ఏడణాలకూ పావలా లాభం వచ్చినందుకూ నేనానందించాను. ఇలాగ, ఎవళ్ళ అంతస్థులో వాళ్ళం ఉన్నాం. మరి, నౌకరీ చేస్తే జీతం అయిదువేలయినా ఇచ్చేవాడి దగ్గిర పుచ్చుకునేవాడు లిగాడే. ఇంతేకాదు, జీతం యింకా యెక్కువైనకొద్దీ, ఇద్దరికీ, అంతరం కూడా యింకా యెక్కువ అవుతూనే వుంటుంది"

## 18

"ఇలాగ, నావర్తకం, ఆదిలో నడివీధిలో ప్రారంభంఅయి ఇప్పుడు నడి బజారున స్థిరపడివుంది. అంటే, మొదట, యే అంగడిలో రూపాయికయిదు మూర్తులు కొన్నానో ఆ అంగడి పక్కనే యిప్పుడు నాసొంత అంగడి వుంది. సొంతం అంటే అర్థం అయిందా? అంగడిలో వున్న సరుకూ, అంగడివున్న మేడకూడా నావే. పదిహేను వేలకి అయిల్లుకొనేసి తీర్చి మేడకట్టి కింద అంగడీ, పైనికార్యస్థానమూ నడిపిస్తున్నాను, ఇప్పుడు"

"అయితే, మనం అప్పుడే అంతదూరం వెళ్ళవద్దు, తరవాతి సంగతి విను"

"నాళంవారి సత్రం పక్కగా గోదావరికేసి మళ్ళి, మళ్ళీ వొక మళుపు తిరిగాటప్పటికి, వీధిగుమ్మం దగ్గిరగా హాల్లో నుంచుని వొక బ్రాహ్మడు భార్య మీద మండిపడుతున్నాడు"

"జిడ్డు వోడుకుంటూ నల్లగా వంటబ్రాహ్మడి చేతి గోనెపట్టాలా వుంది కదా, అసహ్యం అనిపించడం లేదుటండీ, మళ్ళీ సబ్బుతో పదిమాట్లు మొగం కడుక్కుంటారూ?" అని ఆవిడ నిలవతీస్తోంది. "నువ్వు చాకలికి వేశావు, తెల్లబడుతుంది, సరే, మరి యిప్పుడు స్నానం మాటః" అని టొకాయిస్తున్నాడాయన. "ఈపూటకి ఏపాత కండువా అయినా వాడుకోరాదూ, పుట్టుభోగిలాగ డాబులుపోతున్నారుగానీ, మహా" అంటూ ఆవిడ యీసడిస్తోంది, మొగం యెదటికి వచ్చి"

"ఆయన ధుసుధుమ లాడడం మానలేదు; గాని అటు చూడలేక మొగం వంచేసుకున్నాడు. నేనదికనిపెట్టి, చంకని వున్న తువాళ్ళ మడత చేతబుచ్చుకుని గుమ్మం యెక్కాను. వెంటనే కందగడ్డలా వున్న మొగం నాకేసి తిప్పి "యేం వచ్చావు?" అనడిగాడాయన. నేను సంగతి చెప్పాను. ఆయన చూపించమన్నాడు"

"దీనిమీద, ఆవిడ కోరచూపులు చూసింది పంతులూ, నేనిప్పటికీ మరిచి పోలేదా వాలకం"

"ఏవీ, చూపించూ" అని ఆయన మళ్ళీ అడిగాడు. అడిగి చూశాడు. చూసి ధర అడిగాడు. అడిగి బేరం చేశాడు. చేస్తూనే తువ్వాలు మొలకు చుట్టుకుని చూసి తృప్తిపడ్డాడు. చివరికి "ఈ దరిద్రం యెప్పుడూ వుండేదే" అంటూ రుంజుకుని అయిదణాల కానీకి తువ్వాలొకటీ, రెండణాల ముక్కానికి అంగొస్త్రమూ పుచ్చుకుని 'కళ్ళు మూసుకుని యిక రెండేళ్ళు గడిపెయ్యవచ్చు' నంటూ తెల్లని కొత్త అర్ధరూపాయి నాచేతిలో పడేశాడు."

"సంపాదనలో లేరు గాని ఖర్చులో మాత్రం జమీందారీఫాయా, నాకేం, అనుభవిస్తారు చివరికి" అంటూ ఆవిడా "బట్టలు ఖర్చు నాకోసం యెక్కువా, నీకోసం యెక్కువా?" అంటూ ఆయనా, వెంటనే డీ అంటే డీ అనుకున్నారు. నేను గుమ్మాలు దిగాటప్పటికి వారికి మాటలు ముదిరాయి. నాకు ఆనందం పెరిగింది. అయిదు మూర్తులకూ నాలుగు ఖర్చుపడి, రూపాయికి రూపాయి మూడణాలు చేతిలో పడ్డాయి కదా, తప్పా, నువ్వేచెప్పు మరి"

"మళ్ళీ బయలుదేరాను. సోమంచివారి మేడదాటి వైగ్రాంరోడ్డున ప్రవేశించాటప్పటికి ఒక బడిపంతు లెదురై అరగంట నిలేశాడు"

"ఒకొక్కమనిషికి వర్తకుడు తనని దగా చేస్తున్నట్టు మహా చెడ్డ అనుమానం. చివరికి మొదటి ధరకే పుచ్చుకున్నా గిల్లి గిల్లి బేరం చేస్తే గాని, చేసి వర్తకుణ్ణి విసిగించి తానుకూడా విసిగిపోతే గాని - తాను దగాపడలే దన్న నమ్మకం కలగదా మనిషికి"

"ఆపంతులు ఆరకం"

"చేతిలో వొక్కటే తువాలుంది. అదివిడుదల అయిపోతే, మళ్ళీ సరుకు కొనవచ్చు నన్నవూహతో వున్నాను నేను. అందుకోసం తొందరపడుతున్నాను కూడా. అంచేత మొదట అయిదణాల న్నర చెప్పి వెంటనే "బరాబరీ అయిదణాలు. కావలిస్తే చూసుకోండి, మరి దమ్మిడీ తగ్గదు" అనేశాను"

"ఏమనుకున్నాడో ఆయన బేడతో ప్రారంభించాడు బేరం ఒక్కొక్కకానే పెంచుకుంటూ వచ్చాడు. పావలాదాకా చురుగ్గానే వచ్చాడు; కాని పావలా మీద మరో కాని పెంచడానికి పావుగంట పట్టింది. మరో అయిదు నిమిషాలకు మరోకాని వేశాడు, అంతే. ఇక యెక్కడు దిగడు. పోసి అంటే బేరం ఎకిచి

పెట్టడు. తరవాత అతను పూర్తిగా పదినిమిషాల పాటు గిలగిల్లాడి పోవడం చూస్తే, కాలహరణం అవుతున్నా నాకు ముచ్చటగానే వుండింది"

"తువ్వాలు నామీద పడేశాడు, అక్కరలే దన్నట్టు. పదడుగులున్నా వేశాడు వెళ్ళిపోతున్నట్టు; కాని వెంటనే అయిదడుగులు వెనక్కి వచ్చాడు. "నీకు కాలంవిలవ తెలియదు తెలుసా?" అన్నాడు నన్ను మందలిస్తున్నట్టు "పోనీ, మరో కానీ–పట్టుకుపో" అన్నాడు, జాలి గుమ్మరిస్తూ. మళ్ళీ పదడుగులు వేశాడు. విసురుగా వెనక్కి తిరిగి "నేనెన్నిమెట్లెక్కానో తెలుసా? నువ్వు ఉన్న మెట్టుదిగవేం? అని గదిమాడు"

"మళ్ళీ పదడుగులు వేశాడు. వేసి వొక్క క్షణం బుర్రవంచుకు నుంచున్నాడు. మాట్టాడకుండా గబగబా నాదగ్గిరికి వచ్చి ఠకీ మని ఆగిపోయాడు. చూసిచూసి "నేను హెడ్మాష్టర్ని తెలుసా, నాకాలం అంతా పాడు చేస్తున్నావు నువ్వు బోధపడుతోందా?" అని విసుక్కున్నాడు. ఉన్నచోటనే అటూయిటూ చూస్తూ గిరిగిరా తిరిగి – 'ఇచ్చెయ్యి. నామాటవిను, చెడిపోకు' అంటూ బుకాయించాడు"

"నన్ను మీరు చెరపకండి" అనిమాత్రం అని నేనూరుకున్నాను. ఆయన వెంటనే రేగాడు. మళ్ళీవొక మాటు అటూఇటూ చూశాడు, బాగా ఆవేశం తెచ్చుకుని బుస్సలుకొట్టాడు. "ఇదిగో, నువ్వు ఆఫీసర్ని విసుగిస్తున్నావు. భద్రం" అన్నాడు "మన వర్తకులకు పట్టూ విడుపూలేదు. అంచేతే మీగతి యిలా వుంది" అన్నాడు. "ఇంతకీ; మాబ్రాహ్మలకుండే త్యాగం మీకెలా వస్తుంది గానీ___" అంటూ మరీ దగ్గిరికి వచ్చాడు. "ఏమంటావ్? వెళిపోనా?" అంటూ సగం తిరిగాడు. నిలిచి ఓరచూపులు చూశాడు. తనకి వేగం పుట్టడానికి క్యాబోలు చేతిలో వున్న కొంకికర్ర గిరగిర తిప్పాడు. గభీ మని మళ్ళీ నాకేసి తిరిగి "నీతో బేరం ఆడ్డం నాదే తప్పు. ఏం ఇస్తావా! యివ్వవా" అంటూ తీవ్రంగా చూశాడు. చూసి చూసి, చివరికి, "ఇదిగో తక్కిన కానీ___ నీలోభిత్వాని కిస్తున్నాను పట్టుకుపో" అంటూ అయి దణా కాసులు నామీద పడేసి, తువ్వాలు ఊళాక్కుని, యెగిసెగిసి పడుతూనూ, తిప్పితిప్పి చూసుకుంటూనూ, మురిసిపోతూనూ వెళ్ళిపోయాడు"

"అంతకంటే నేనే యెక్కువ మురిసిపోయాను. ఇంటి దగ్గిరనుంచి తెచ్చిన రూపాయీ రూపాయిన్నర అయికూచుంది మరి!"

"ఓః! ఏమి వర్తకం జరిగిపోయిందీ? చేసిన పనికి ఫలితం కనపడ్డమూ, తన్మూలంగా బహ్మానందమూ నువ్వెప్పుడయినా అనుభవించావా? నువ్వు నౌకరీలోనే చేరితే నీకి తృప్తి జన్మలోనే కలగదు. చేసినకొద్దీ విసుపూ, పని

నెరవేరితే సొంతానికేమీ ప్రయోజనం లేక తన్మూలంగా అసంతృప్తి - ఇవి తప్ప మరేమీ నీకనుభవానికి రాదు. జీతం లక్షరూపాయీ లైనా, నౌకరీచేసే వాడి బతు కింతే. ఒక్కొక్క చోట, నౌకర్లు, తమ శ్రమవల్ల ఇతర్లకు ఆనందం కలగడంచూసి దుఃఖించడం కూడా తటస్థిస్తూ వుంటుంది"

"నే నప్పుడు బ్రహ్మానందం అనుభవించాను. నాకు చాలా ధైర్యమున్నూ కలిగింది. నే నెప్పుడూ అనుకునైనా వుండని విధంగా నాబుద్ధికి వికాసం ప్రారంభం అయింది. పైగా "అంత సరుకు పెట్టు క్కూచున్నాడు కదా, ఆవర్తకుడు, నాలాగ నూటికి యాభై రూపాయీల లాభం తియ్యగలడాః" అని పించింది. తరవాత్తరవాత ప్రతీబేరంలోనూ నేనూ అంతలాభం తియ్యలేక పోతూవచ్చాను, నిజమే; కాని అప్పుడు మాత్రం ఆనంద పారవశ్యం కలిగింది. పక్కనివున్న యింటిపక్కకివెళ్ళి అసలు కేటాయింపుగా వుంచి లాభం వచ్చిన అర్థరూపాయీ యిరవైమాట్లు లెక్కచూసుకున్నాను. అటూ యిటూ బెదురు చూపులు చూస్తూ, అది, పదిమాట్లు ముద్దుపెట్టుకున్నాను. లెక్కలో పొరపడ్డా నేమో అని రూపాయి చిల్లర వొకచేతిలోనూ, అర్థరూపాయి చిల్లర వొకచేతి లోనూ వుంచుకుని గుప్పెళ్ళతో లెక్కబెట్టి చూచుకున్నాను. అమ్మకాల వివరా లున్నూ జ్ఞాపకం చేసుకుంటూ కూడా లాభం తేల్చుకున్నాను. చూడగాచూడగా ఉత్కటానందం వల్ల నా కళ్ళు చెమ్మగిల్లి చూపు మందగించింది"

అప్పటికి పావు తక్కువ తొమ్మిది మాత్రమే అయింది. ఒక్క రూపాయల్లా రూపాయిన్నర అయింది కనక, ఆరూపాయిన్నరా రెండు రూపాయీ లయినా చేస్తేగాని ఇంటికి వెళ్ళగూడదని నే నప్రయత్నంగా శపథం చేసుకున్నానుః"

"అప్పటికి మాఅమ్మ యెసరయినా పెట్టివుండదు కదా, వెళ్ళిమాత్రం యేమిటీ చెయ్యడంః అంచేత, మళ్ళీ బజారుకి వెళ్ళి ఆరుతువ్వాళ్ళూ అంగాస్త్రం వొకటీ పుచ్చుకున్నాను. అణామిగిలింది. "అదిమాత్రం వూరికేయెందుకు మొయ్యాలీ" అనిపించింది. ఏమంటే, వర్తకుని చేతిలో వుండవలసినది సరుకు కాని డబ్బు కాదు. ఈవూహతో అంగడి దిగి అలాగా యిలాగా చూడగా, వొక చోట చిక్కాలు కనపడ్డాయి. వెళ్ళి బేరం చెయ్యగా, ఆవర్తకుడు అణాకి రెండు చిక్కాలిచ్చాడు"

"మళ్ళీ బయలుదేరాను. కూరల అంగళ్ళ దగ్గిర కనిపెట్టుకుని వున్న ఆడకూలీ లిద్దరు, ముక్కాని చొప్పునయిచ్చి ఆచిక్కాలు పుచ్చుకున్నారు"

"మళ్ళీ చల్లపల్లి వారి వీధికి వెడదా మని వుల్లి తోటవీదికి మళ్ళగా,

పురోహితవృత్తి చేసుకునే బ్రాహ్మడొకడు, అంగోత్రమూ వొక తువ్వాలూ పుచ్చుకున్నాడు. పత్రివారి యిల్లుదాటుతూ వుండగా, ప్లీడరు గుమాస్తా వొకాయన తువ్వాలొకటి పుచ్చుకున్నాడు. సోమంచివారి వీధిలో విద్యార్థివొకటి, చల్లపల్లివారి వీధిలో బుగ్గమీసాల ప్లీడరు రెండూ తువ్వాళ్ళు పుచ్చుకున్నారు. అది దాటి అయిదుగురు సత్రం సమీపాన వెడుతూవుండగా, మిగిలి వుండిన తువ్వాలు ఒక మంగలి పుచ్చేసుకున్నాడు"

"లాభం మాట అలావుండగా, రెండో మాటు తెచ్చిన సరుకుకూడా వేడి పెసరట్లలాగ ఇట్టే అమ్ముడు పోవడం నాకెంతో ఉత్సాహం కలిగించింది. అలా తిరగడం చేతిలో సరుకువుంటే భోజనాల వేళదాకా వొకగంట అయినా తిరగవచ్చు; కాని బజారుకి వెళ్ళాలి, కొనాలి. అప్పటికి పదకొండుంబావ యింది. భోజనం మానుకుని మాఅమ్మ నాకోసం కనిపెట్టుకుని వుండదు; గాని, సరుకు పుచ్చుకునేటప్పటికే వేళ తిరిగిపోతుంది. అలా యెందుకు తోచిందో గాని, ఇల్లు విడిచి బయలు దేరి వచ్చాటప్పుడు, ఆసలూ లాభమూ తప్ప సరుకేమీ యింటికి పట్టుకువెళ్ళగూడ దనుకున్నాను. అంచేత, భోజనంచేసి వచ్చేద్దామని యింటికి బయలు దేరాను; కాని వొకమళుపు తిరిగాటప్పటికి యీసారి వచ్చిన లాభం యెంతో చూసుకోవాలని పించింది. "తొందరేం?" అనుకుంటూనే ముందుకి సాగాను. కాని మోరంపూడి రోడ్డు మొగ చేరుకునే టప్పటికి ఉత్కంఠ యెక్కువయిపోయింది. అడుగు పడిందేకాదు"

"నడిరోడ్డుమీదే జేబులో వుండిన డబ్బు తీశాను. చూడగా రెండు రూపాయిల మూడణాల ముక్కాని వుంది"

"నాళంవారి సత్రం సమీపించేటప్పటికి, ఇద్దరు బ్రాహ్మలు "తొరగా, తొరగా" అంటూ ఆత్రంగా లోపలి కురుకుతున్నారు. సత్రంలో, భోజనాలకు పద్దులురాసే సమయం అది. వాళ్ళని చూశాటప్పటికి అక్కడ భోజనం చేద్దా మనిపించింది. మహానుభావులు, నాళంవారు అనూచానంగా నిరతాన్నదానం చేసే టప్పుడు కాదని యింటికి వెళ్ళి జుర్రుకునే దేమి వుందీ?"

"లోపలికి వెళ్ళాను. అప్పటికి పద్దుల పుస్తకం మూసెయ్యడానికి సిద్ధంగా వున్నాడు గుమాస్తా ఎవరో ముసలి బ్రాహ్మడు తొందర పెట్టగా కంగారుగా వెళ్ళి నాపేరు చెప్పాను. దానిమీద గుమాస్తా కళ్ళెర్రజేసి యింత సే పేం చేస్తున్నా?" వన్నాడు, నేను నసికాను. "మనవాళ్ళ తెలివితేటలిలా వుంటాయి. పద్దు రాయకపోతే మాత్రం నానాగోల చేస్తారు" అని రుంజు కుంటూ పేరడిగాడు. రాసుకున్నాడు. ఆటు చూసి యిటు చూసి యేదో

సవరిస్తున్నట్టు నటించి, జనం యెందరో తెలిపేకాలంలో రెండంకెవేసి గభీమని పుస్తకం మూసేసి పట్టుకునిన్నీ చక్కాపోయాడు"

"నాకు నవ్వూ వచ్చింది, కోపమూ వచ్చింది. చూడగా, భోజనాలకు బ్రాహ్మలు అక్కడ పాతికమంది దాకా వున్నారు. పుస్తకంలో సంఖ్య ఎంత వుందో మరి. ఎప్పుడో వొకప్పుడు వచ్చి పరీక్ష చేసుకుంటే యజమాని కిదొంగతనం దొరుకుతుందా? దినమ్మూ ఎంతసొమ్ము ఇలా హరించబడుతోందో యెవరు చెప్పగలరూ?"

"పోనీ, భోజనాలకు వచ్చే వాళ్ళ సంగతి? తరవాత నాకు తెలిసింది, యీ సత్రాలు ఆగంతులకేగాని వూళ్ళోవుంటున్న వాళ్ళకి కాదని. కాక అప్పటి నాయోగ్యత నీకు తెలుసు. ఇదిలా వుండనిస్తే భోజనాలకు వచ్చివుండిన వారిలో ఇద్దరిని నేనెరుగుదును. ఒకడు మాస్వగ్రామానికి పక్కవూరివాడు. ఆయన వడ్డీవ్యాపారం చేస్తాడు. సంభావనలకు తిరుగుతాడు. దొంగసాక్ష్యాలు చెబుతాడు. కోర్టు సమనుతో వచ్చిన భత్యం పుచ్చుకుని కక్షిదారు దగ్గిర హోటలు ఖర్చులు మళ్ళీ లాగి, వేళ అయేదాకా గోదావరి రేవులు కాసి, చివరికి సత్రాల కెగబడతాడు"

"రెండోవాడు ఆర్యాపురంవాడే. డబ్బుపెట్టి చీట్లాడతాడు. దీపాలు పెడితే బహునిషామీద వుంటాడు. బ్రాహ్మణవీధినే వుండడు. ఆటకి డబ్బు లేకపోతే మాత్రం చెంబు తోముకుని బయలుదేరతాడు"

"అన్నదానం చాలా గొప్పదే, సందేహంలేదు; కాని దానికయినా పాత్రాపాత్ర వివేచన వుండాలి. చిన్నప్పణ్ణుంచీ చూస్తాను, ఈసత్రాలలో అపాత్రులకే యెక్కువవినియోగం, ఇది దానం అనిపించుకుంటుందా? అన్నదాతల కీపాటికి దృక్పథం మారాలి"

## 20

"భోజనా లయ్యేటప్పటికి వొంటిగంట కావచ్చింది. పొద్దుటిపూట అంతా అదేపనిగా తిరిగిన శ్రమకి భుక్తాయాసం తోడుపడింది; కాని నే నదేమీ లెక్క చెయ్యలేదు. చెయ్యికడుక్కోడం తడువుగా మనస్సు బజారుకి వురకలు వేసింది. బేరాలు మించిపోతున్నట్టాందోళనా, లాభం మరెవడో కొట్టుకుపోతున్నట్టు కంగారూ నన్ను ఉద్రిక్తుణ్ణి చేశాయి. మళ్ళీ బజారున పడ్డాను. ఎకాయెకీని అక్కణ్ణుంచి మళ్ళీ యిన్నీస్‌పేటలోనే వురికాను."

"రెండయింది. రెండున్నర అయింది. మూడున్నూ అయింది; కాని బేరం తగలలేదు. చూడమని దేవురించినా సరుకు చూసినవాళ్ళు కనపడలేదు,

విసిగి పోయాను. "ఇక వర్తకం నడవదేమో" అనిపించింది. అయినా వోపిక పట్టి తిరిగిన వీధే తిరిగాను. ఒకటి రెండు మాట్లు "తువ్వాళ్ళు – అంగాస్త్రాలు" అని కేక కూడా పెట్టాను. కాని లాభం లేకపోయింది"

"బాగా నిరుత్సాహపడిపోయాను. దీనివల్ల, అంతవరకూ లేని కాళ్ళతీత కనపడింది. నాలుగిళ్ళ అవతల విశాలమైన అరుగులు కనపడ్డాయి. అక్కడ కాస్సేపు కూచుందా మనుకున్నాను"

"ఇంతలో వొక వితంతువు, భామవేషం తెరవెడలినట్టు వయ్యారంగా వచ్చింది. "తువ్వాళ్ళకేంగాని అంగాస్త్రాలు చూపించు" అంటూ కళ్ళు తిప్పుకుంది. తిరగటి రాయిలాగ అరుగుమీద చతికిలబడి తేన్చింది"

"వెళ్ళి ఉన్నవన్నీ ముందు పడేశాను. ఆవిడ, బట్ట మైలపడిపోతుందన్నట్టు కొంచెం యెడంగా జరిగి కొంతసేపు మడతలన్నీ పరకాయించింది. తరవాత, యేమయితే కానీ అని తెగించినట్టు ముట్టుకుని ప్రతీదీ కిందా మీదా వేస్తూ రెండేసి నిమషాలు తిప్పితిప్పి చూసింది. చివరికి, తువ్వాలు కొనడమా, అంగాస్త్రం కొనడమా అన్న సందేహంలో పడింది"

"అది వోపట్టాన తెమల్చుకోలేకపోయింది. 'అంగాస్త్రం పొడుగ్గానేవుంది. కాని వెడల్పు చాలదు? తువ్వాలు వెడల్పు వుంది; కాని పొడుగుచాలదు' ఇదీ ఆమె బాధ. దీంతో, తువ్వాలు నేతపుచ్చుకోడం, మడత విప్పి తిరగా మరగా వేసి చూసి నామీద పడెయ్యడం. అంగాస్త్రం పుచ్చుకోడం. అదిన్నీ చూసి చూసి విసిరికొట్టడం. "అబ్బే, వద్దోయ్! నిన్నాపు చేశానా పాపం? ఏంచెయ్యనూ? వెళ్ళిపో" అనడం. ఆమాట మీదా నిలవక "నీకేది యివ్వాలని వుంటే అదిచ్చేసి వెళ్ళిపో" అనడం. "నీ మూలాన నాకు మతిపోతోంది, తెలుసా?" అంటూ లేచినట్టే లేచి, మళ్ళీ చతికిలబడడం. వీధేపోయే అమ్మలక్కలను నిలేసి, నాసంగతి విడిచిపెట్టి, ఏమిటేమిటో కబుర్లు విడెయ్యడం"

"చూశాను, చూశాను, విసుగుపట్టలేక "అహా, ఇలాంటి బేరాలు తగిలితే రెండుచేతులా తినాలి బువ్వ" అని రుంజుకున్నాను నేను, సరుకు పోగుచేసు కుంటూ. దీనిమీద ఆవిడ చర్రుమంది. "ఏం అబ్బీ, నేను కొనుక్కోనను కున్నావా, కొనుక్కోలే ననుకున్నావా? లింగూ లింగూ నాలుగు తువ్వాళ్ళూ నాలుగు అంగాస్త్రాలూ వేసుకువచ్చావ్. లక్షలమీద వర్తకం చేసేవాడిలాగ మిడిసి పడుతున్నావ్. చాల్లే నేర్చుకుపోయావు మహా. లాభం కొట్టుకుపోవడానికి వచ్చిన వాడికి ఇంత ముక్కున కోపం వుంటే యెలాగా?" అని గింజుకుంటూ వొక అంగాస్త్రమూ, వొకతువ్వాలూ పుణుక్కుని, బొడ్డుకొంగు విప్పి మూడుపావు

లాలూ నామీద విసిరికొట్టి "మరి దయచెయ్యి. అవతల బేరాలు మించిపో తున్నాయి కామోసు" అని తిప్పుకుంటూ యింటో కుడాయించింది"

"నాకు వల్లమాలినకోపమూ వచ్చింది, అంతకంటే యెక్కువగా నవ్వూ వచ్చింది; కాని రెండుమూర్తులు విడుదల కావడం, మూడుపావులాలు చేతిలో పడడం — అవి రెండూ అంతరించి ఆనందం అంకురించింది"

"ఇంతేకాదు, దీనివల్ల నాకింకో మేలున్నూ సిద్ధించింది. అది వర్తకం చేసేవాడు విసుగు కనపడనివ్వకూడదన్న జ్ఞానం. ఎంతో కొంత లాభం వేసుకోకుండా యేవర్తకుడూ సరుకివ్వడు. అయితే కొనుక్కునేవాడు, అమ్మేవాడి దగ్గిర తనే మహా తెలివైనవాడన్నట్టు దర్జా వెలిగిస్తాడు. తన ఆత్మగౌరవానికి భంగం రానంతసేపూ వర్తకుడు దాని కభ్యంతరం చెప్పకూడదు. పైగా, కొనుక్కునేవాడు మంచివస్తువు దొరికిందని తృప్తిపడాలి. "నేను కనక యింత తక్కువ ధరకు కొనగలిగా"నని పొంగిపోవాలి. వర్తకుడు దద్దమ్మ —అథవా— అమాయికుడు అని జాలిపడాలి. నిజానికిద్దరికీ కూడా యెవరి అవసరాలు వారి కుంటాయి; కాని, తామూ వస్తువుకొనడం వర్తకుణ్ణి ఉద్ధరించడమే అని కొనుక్కునే వాటలో కొందరి నమ్మకం. మరోపని చేతగాక, వర్తకులు, బజారున కూచుంటారని జాలిపడేవారి నెందరినో చూశాను నేను కొనుక్కునే వారిలో, నువ్వేం చూశావు?"

"మళ్ళీ నాలుగువీధులు తిరిగితేగాని 'యేవీ చూపించు" అన్నవారు లేకపోయారు. అప్పుడయినా మంచిబేరం తగిలితే బాగుండిపోను, వొక వింత మనిషి తగులుకున్నాడు. అప్పటికి యాభయ్యోపడి నడుస్తోందాయనకి. మనిషి చూస్తే దబ్బపండు వన్నెలో కళగానే వున్నాడు; కాని శుద్ధజంతువు. ఆయనతో అవస్థపడి అవతలికి వెళ్ళేదాకామాత్రం నా కా సంగతి తెలియలేదు"

"జరింగేదేమిటంటే? ప్రతీ అంగొస్త్రమూ మూరవేశాడాయన. ప్రతీ తువ్వాలూ మొలకిచుట్టుకుని చూసుకున్నాడు. ఒక తువ్వాలు విప్పి మధ్యకి మడచి బుజానవేసుకుని చేతులు విరిచికట్టుకుని బుజంయెగరవేసుకుంటూ అటూ యిటూ పచారు చేశాడు. తిరిగి తిరిగి, వొక కుర్చీ మీద అది పరచి దానిమీద కూచున్నాడు. హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినట్టు ఉవ్వేత్తుగా లేచి, గబగబా వెళ్ళి దాంతో టేబులమీది దుమ్ము దులిపాడు. చరచరా లోపలకి వెళ్ళి చేతులు కడుక్కుని దాంతోనే తుడుచుకుంటూ వచ్చాడు. చివరికి, "నీకు అమ్మాలని వుంటే బేరం లేకుండా వొకటే ధర చెప్పు, లేదూ పట్టుకుపో" అంటూ నామీద పడేశాడు"

"నా-కు కోపం వచ్చింది పంతులూ, వొళ్ళు మండుకుపోయిందంటే నమ్ము. "ఏమిటీవరస?" అనడిగాను. "అంత గతి లేకపోతే భార్యామణి పాతకోక చీరిక వాడుకోరాదూ?" అనేశాను. "ఎప్పుడయినా యేదయినా కొనియెరుగుదువా?" అని నిలవతీశాను. "నీదేసొమ్మా? అవసరాలన్నీ యిలా తీర్చుకుని యేమాత్రం గడించావయ్యా?" అంటూ దులిపేశాను"

"దీనిమీద చాలా కోపం వచ్చిందిఆయనికి; కాని గొణుక్కోవడమేగాని మాటపైకిరానివ్వడు, స్పష్టంగా. అది చూసి "యేదో నసుకుం దీ మేడిపండుకి" అనుకున్నాను. ఇంతలో లోపలినుంచి నలభై యేళ్ళ వొకావిడవచ్చింది. వెంటనే బిల్లి అయిపోయాడు మానవుడు. అందుకే నే నాశ్చర్యపడుతూ వుండగా "ఈజన్మకికి యింతే. ఇంటోకి దయచెయ్యండి" అని తగ్గుస్థాయిలో వురిమిందా విడ. పిల్లి అయి మాయంకూడా అయిపోయాడు క్షణంలో, ఆయన"

"అప్పుడు చూసిం దావిడ నాకేసి"

"ఆవిడ అడగ్గా నేను జరిగిందంతా చెప్పాను"

"ఈవీధికి కొత్తవాడవా? ఇంకెప్పుడూ ఆయనతో మాట్టాడకు పిలిచినా పలక్కు. ముందు నీకెంతివ్వాలో చెప్పు" అందావిడ. నేను చెప్పాను ఆవిడ యిచ్చేసింది"

"పంతులూ! ఐశ్వర్యవంతుల బిడ్డల్లో యెలాంటి మహానుభావు లున్నారో యెప్పుడయినా చూశావా? నిజంగా, బ్రహ్మదేవుడి సృష్టి చాతుర్యం చూడవలసింది వాళ్ళ దగ్గిర, బీదవాళ్ళ దగ్గిర కాదు"

## 21

"ఇలాంటి బేరాలతో యెంత చిరాకుపుట్టినా, అంతసేపూ వోపిగ్గా తిరిగి, యెలాగో సరుకువిడుదల చేసుకున్నాను. అప్పటికి పొద్దు గూకుతోంది. అంగడి తెరుచుక్కూచున్న వాళ్ళకదే భలే సమయిం; కాని నాకేమి లాభమూ?"

"అయితే, అమ్మినకాడికి డబ్బేమాత్రం చేరిందో చూసుకోవా లని నాకు మళ్ళీ వుబలాటం పుట్టింది. సంచిపైకి తీద్దామని జేబులో చెయ్యిపెట్టాను; కాని నా ప్రజ్ఞ ముందు మా అమ్మకి చూపించాలని ఆత్రం పుట్టింది. ఎన్నివిధాల ప్రయత్నించినా నామనస్సు లొంగలేదు. కాళ్ళలో వొణుకులాటిది కూడా పుట్టింది. గబగబా యింటికి బయలుదేరాను"

"మధ్యాహ్నం నేనింటికి చేరుకోక పోవడంవల్ల నా కోసం ఎదురు తెన్నులు చూస్తూ వుండిన మాఅమ్మ, నేను గుమ్మంలో అడుగుపెట్టాటప్పటికే "మధ్యాహ్నం బువ్వ తిన్నావా నాన్నా?' అంటూ నన్ను పొదువుకుంది. తిన్నా

నంటే సరిపోయేది; కాని ఆవుత్సాహంలో నా కామాట తోచ లేదు. పైగా "చెబుతా, రా" అంటూ విడిపించుకుని దీపం దగ్గిరికి వెళ్ళపోయాను. ఇది మాఅమ్మకి ఆదుర్దా పుట్టించింది. వెంటనే, ఆవిడ, మళ్ళీ ఆమాటే అడుగుతూ లోపలికి వచ్చి నాచెయ్యి పట్టుకుంది.

కళ్ళలోకి చూస్తూ కడుపునిమిరింది. దీంతో, నేను నిలువునా కరిగి పోయాను"

"తల్లిప్రేమ యెంత గొప్పదోయ్! దాని తత్వం నువ్వెప్పుడయినా అర్థం చేసుకున్నావా? ఏదో సాధించుకువస్తానని వీధికి వెళ్ళిన మొగవాణ్ణి, ఏపెళ్ళామో అయితే "వెళ్ళినపని ఏమయింది?" అనడుగుతుంది. అయితే, అక్కడ ప్రేమకి లోటుండదు; కాని దాని తత్వంవేరు. అదే తల్లి అయితే "కులాసాగావచ్చావా నాయనా?" అనడుగుతుంది. ఇందులో వున్న ఆత్మీయత అందులో వుండదు. ఏమంటే? అక్కడిది సుఖతృష్ణతో యేర్పడిన అనుబంధం. దాని ప్రవృత్తి అభేదసాధన మాత్రమే ఇక్కడిది కండలోకండ. ఆనంద నిరీక్షతో రూపొందిన అనుబంధం. దీని ప్రవృత్తి దూరమైపోతున్న దాన్ని గుండెలకు హత్తుకోడం"

"నేనింటికి రాకపోయినా, మా అమ్మ మధ్యాహ్నం భోజనం చేసే వుండవచ్చు; కాని మడిబట్టతో గుమ్మంలోకివచ్చి నాకోసం యెన్నిమాట్లు వీధి పొడుగునా చూసిందో? ఎంతసేపు కనిపెట్టుకుని వుందో? "మా అబ్బాయి కనపడ్డాడా?" అని యెంతమంది నడిగిందో? ఎన్నిమాట్లు ఎంతమందిని చూసి నేననుకుందో? నేను రాకుండా తాను భోజనం చెయ్యడమా మానడమా అని యెంత గుంజాటన పడిందో? చివరి, కెంత అర్థాకలిగాతిందో? తిన్నాక అయినా, కాలుకాలిన పిల్లిలాగ తిరుగుతూ యెంత అలమటించిపోయిందో? ఎంతసేపణ్ణుంచి అరుగుమీద కనిపెట్టుక్కూచుని వుందో మరి?"

"అప్పటికప్పుడే నేను సంచి గుమ్మరించేశాను. ఒక రూపాయి చిల్లర వేరే వుంచి తక్కింది లెక్కపెడుతున్నాను; కాని మా అమ్మమొగం చూశా టప్పటికి నాకు మతిపోయినట్టయింది. లెక్కమరుపువచ్చింది. వెంటనే అప్రయత్నంగా "భోజనం చేశా నమ్మా! వేళకావడంవల్ల యిక్కడి దాకా రావడం యెందు కని నాళంవారి సత్రంలో భోజనంచేశాను" అనిచెప్పాను. మబ్బు కమ్మిన చంద్రబింబంలావున్న మాఅమ్మ మొగం దీంతో విప్పారింది. "సరే నాయనా" అనికూడా అని, నన్ను వొళ్ళోకి తీసుకుంటున్నట్టు దగ్గిరగా తీసు కుని కూచుంది. అప్పుడు నేను లెక్కపూర్తిచేశాను. డబ్బంతా రెండు పోగులుగా వుండడం చూసి, వొకటి అసలనీ రెండోది లాభం అనీ గుర్తించి మాఅమ్మ పొంగిపోయింది. అది చూసి నేను పరవశుణ్ణయినాను"

"ఏం, తప్పా? రూపాయికి రూపాయి తొమ్మి దణాల లాభం చూసుకుని అనుభవిస్తున్న ఆనందం అది. నా జీవితంలో—కళ్ళు తెరవని బాల్యంలో—"హరిః ఓ" మ్మని సంసారబాధ్యత మీద పడ్డనాడు చేతికి వచ్చిం దది. దాని విశిష్టత నువ్వు గుర్తించలేవు, ఒక్క సంవత్సరంలో గవర్నరుకి వచ్చే జీతాని కయినా అంత విలవ ఉంటుందా? దాంతో నాకు కలిగిన ధైర్యోత్సాహాలకు పరిమితి కట్టగలవా నువ్వు? ఆసన్నివేశం తలుచుకుంటే నా కిప్పటికీ—హాయ్! హాయ్! ఏమి ఆనందమోయి పంతులూ! ఇలాంటి ఆనందం అనుభవించని బతుకేం బతుకోయ్?"

"ఏం, కష్టంగా వుందా నాయనా నీకు? అవును లే. పోనీ, తరవాతి సంగతి విను"

"అప్పుడు మా అమ్మ మొగాన మెరిసిన ఆనందం దివ్యజ్యోతిఅయి నాభవిష్యజ్జీవితం అంతా ప్రకాశమానమై వుండినట్టు కనపడింది. "నాయనా, చదువు సాగకపోతే సాగకపోయింది, యీశ్వరు డిలా గయినా నీకింత అన్నం పెడితే చాలు. నీకు నువ్వయినా వొక యింటివాడ వయితే నాకదే పదివేలు. కనడమే కాని మేము నీకేమీ చేర్చలేక పోయాం. నీరెక్కలు చల్లగా వుండి, నాలుగు రాళ్ళు సంపాదించుకుంటివా నలుగురిలోనూ తల యెత్తుకుబతకవచ్చు" అంటూ మా అమ్మ నన్ను మళ్ళీ పొదువుకుంది, మూర్ధాఘ్రాణం చేస్తూ."

"అదిగో? నువ్వు నవ్వుకుంటున్నావ్, నీ కిదంతా హాస్యాస్పదంగా కన బడుతోంది, కదూ? నేటిదాకా బ్రాహ్మణజాతిని ఆవరించుకుని వుండిన పరిసరా లలాంటివి. వాటికి బయటి ప్రపంచంయెలా వుందో గుర్తించుకోవా లంటే, గతానికి, గర్వించగలగడం కాదు, భవిష్యత్తు రూపించుకోగలగాలి. నాకు తెలుసు, నాయనా, బ్రాహ్మణవర్గం యెంత పాడయిపోయిందో నే నెరుగుదును. యజన యాజన అధ్యయన అధ్యాపన దాన ప్రతిగ్రహ షట్కర్మనిరతమైన బ్రాహ్మణ వర్ణానికి, తాలూకా కచేరీలో అట్టెండరుపనీ, పోలీసుస్టేషనులో కాని స్టేబులుపనీ, సివిల్ కోర్టుల్లో దలాయతుపనీ—ఇంకా యిలాంటివీ ఉద్యోగా లయి నోరూరిస్తున్నప్పుడు దానిమీద యితర్లు రాళ్ళురువ్వారంటే తప్పటోయ్?"

## 22

"అప్పు తెచ్చిన రూపాయీ వుంచుకోడమా, యిచ్చెయ్యడమా?" అని యిక తెల్లవారుతుం దనగా నాకు ఆలోచన పట్టుకుంది." "నెల్లాళ్ళ వాయిదా వుండింది కదా, యెందుకట్టే పెట్టుకోగూడదు?" అనడిగింది మా అమ్మ. అవును, నిజమ్మే. అలాచేస్తే మాట తప్పడం అంటూ లేనేలేదు సరిగ్గదా, అది

యింకా యిరవై తొమ్మిది రూపాయీల సరుకు పుట్టిస్తుంది. కనీసం, యిరవై తొమ్మిది రూపాయి లయినా లాభంకొట్టుకువస్తుంది, ఎందుకు పోనిచ్చుకోవాలీ?"

"అప్పిచ్చిన ఆవిడ యిమ్మనడం లేదుగా?"

"ఉంచేసుకున్నాను"

"చద్దన్నం తిని, నిన్నటి సంచినిలవ పుచ్చుకుని మళ్ళీ బయలుదేరాను. నిన్న కాతా కలిసిన వర్తకు డప్పటికింకా అంగడి తెరవలేదు. ఆపక్కనీ యీపక్కనీ మాత్రం కొందరు తెరచీ కొందరు తెరుస్తూనూ వున్నారు"

"అక్కడి బేరా లెలావుంటాయో అని రెండు మూడు చోట్లచూశాను. అబ్బో! జాతినిబట్టీ, వయస్సునిబట్టీ. తెలివి తేటలు చూసీ సరు కమ్మే మన వర్తకులు ఓపట్టాన మాట తేలుస్తారూ? మామూలు గడుసురాకడలన్నీ వచ్చారు వారు. "మీరు కనక యీధర" అంటూ, నిన్న నేను మూడణాల నరకి కొన్న తువ్వాలు పావలా అర్ధణా కంటగట్టా లని చూశాడొక వర్తకుడు. అక్కడ అన్నిధరలూ అలాగేవున్నాయి ఒక అంగడిలో రుమాళ్ళు మాత్రం చౌకగా వుండినట్టు కనపడ్డాయి. చౌకగా కంటే చాలా అందంగా వున్నాయి. అందాన్ని పట్టే నాకు చౌక అనిన్నీ తోచివుండ వచ్చు. షోకేశాలు చూస్తే అవి విడిచిపెట్టరు, తొలీనాటి సాయంకాలమే దిగింది సరుకు. అది మొదట నేనే చూశాను. జత రూపాయి చెప్పాడు వర్తకుడు. "దమ్మిడీ తగ్గ" నాన్నాడు విడిచిపెట్టలేకపోయాను. అమ్మేవాడికి నాకే అలా వుంటే కొనేవాళ్ళ కెలా వుండనూ? దేవుడిమీద భారంవేసి వెంటనే అయిదు రుమాళ్ళు పుచ్చుకున్నాను. మిగిలిన అణాకి మళ్ళీరెండు చిక్కాలున్నూ పుచ్చుకున్నాను."

"అనుకున్నట్టే–పేటలో ప్రవేశించడం తడువుగా అవి అయిపోయాయి. ఎగిరిపోయాయి. రెండు మూడు మాట్లు తిరిగాక గాని చిక్కాలు అమ్మకం కాలేదు. మళ్ళీమళ్ళీ రుమాళ్లే అమ్మాను. ఆవేళ అంతా రుమాళ్ళ బేరమే. మొట్ట మొదటిమాటు, మచ్చుకి, మూడు డజన్లే వచ్చాయి ఆ అంగడికి. అవి తన దగ్గిర మాత్రమే వుండడంవల్లా, మళ్ళీమళ్ళీ నేనవే అడగడం వల్లా. వర్తకుడు, క్రమాంతరామీద సాయంత్రానికి జతకి పావులా దాకా పెంచాడు. అయినా నేనవే కొన్నాను. నేనూ అంతకి అంత ధర పెంచే అమ్మానులే. మంచి లాభమే వచ్చింది ఆబేరంలో."

"ఈవిధంగా, ఆ వర్తకునితో కూడా కాతా కలిసింది."

"చేతికి పది రూపాయీలు చేరాయి. కావలసినంత ధైర్యోత్సాహాలున్నూ పుట్టాయి. ఇక తువాళ్ళనీ, రుమాళ్ళనీ, అంగాస్త్రాలనీ లేదు, ఏవి అమ్ముడు

పోతాయంటే అవీ, వేటిలో నాలుగు డబ్బులు మిగులుతాయని తోస్తే అవీ పుచ్చుకుని అమ్మసాగాను. ఏవి పట్టుకువెళ్ళినా, ఏదినాని కాదినమే సరుకు కొనవలసివచ్చేది."

"ఈస్థితి వచ్చాటప్పటికి అరువు దొరకడమూ, అమ్మకంకాని వస్తువులు వర్తకులు తిరిగి పుచ్చుకోడమూ ఏర్పడింది. అంతవరకూ చంకలో యిమిడే మూట బుజం యెక్కింది. వీధిన వెడుతూ వుంటే నలుగురూ "రా" "పో" అనడం పరిపాటి అయింది. ముఖ్యంగా యిన్నీస్‌పేటలోనూ, మెరక వీధినీ నావర్తకం బాగా పెరిగింది."

## 23

"మొదటి నెల యిలా గడిచింది లెక్క చూసుకోగా, ఆనెలలో సంసారపు ఖర్చులు లేవు కనక, అప్పుతెచ్చిన రూపాయి కేటాయించగా, నలభై రూపాయిల పైచిలుకు సరుకు — సొంతంగా కొన్నది చేతిలో వుంది. రెండురూపాయిల చిలుకు రొక్కమున్నూ వుంది సంచిలో"

"సోదెమ్మకయ్యగారి రూపాయీ యిచ్చేశాను. జరిగింది విని, చాలా సంతోషించి "రూపాయి మళ్ళీ పుచ్చుకుందా మనుకోలేదు" అన్నా రావిడ; కాని, చివరికి, నాప్రార్థన వినీ, నా శ్రేయస్సుకోరి పుచ్చుకున్నారు. "ఇదంతా మీచేతి చలవే" అని నేను నాకృతజ్ఞత తెలుపగా, ఆవిడ "నోటు రాయనక్కరలేదు. నీ కెప్పు డెంతకావలసివస్తే అంతా పట్టుకువెడుతూ వుండు. మొగమాటపడకు" అని కూడా చెప్పారు"

"ఏమో అనుకున్నాను పిన్నిగారూ! తమ్ముడు మంచిదారే పట్టాడు. డబ్బు చేరితే యే వృత్తీ ఘనమే. చేరేదాకా చిన్నచూపు. చూసేవాళ్ళందరూ చేరాక మాత్రం పెద్దచూపే చూస్తారు. మన పీలు మనం చూసుకోవాలి; గాని లోకం పోయిన తోవనే పోవడం యేమి ప్రయోజకత్వమూ? మీరు మంచిపని చేశారు" అని మాఅమ్మని కూడా మెచ్చుకున్నా రావిడ"

"దినాలు గడిచినకొద్దీ గిరాకీ పెరిగింది. గిరాకీ యెక్కువయినకొద్దీ నాకు జవసత్వా లెక్కువైనట్టు కనిపించింది. దీంతో క్షణం కూచుంటే రూపాయి లాభం పోతుందన్నంత ఆబగా తిరగడం మొదలుపెట్టాను. తిరిగిన కొద్దీ లాభమూ, అంతకంటే విలవ అయిన అనుభవాలూ కలుగుతూ వచ్చాయి"

"ఈస్థితి వచ్చాటప్పటికి నేను బ్రాహ్మణ్ణనీ, లోవరు సెంకడరీ చదివాననీ చాలామందికి తెలిసింది. అప్పటి లోవరు సెకండరీ యిప్పటికి బి. ఏ. కి సమానం తెలుసా! ఇప్పుడు బి. ఏ. లు ఎంత రికామిగా వుంటున్నారో అప్పుడు

ఉద్యోగాలంత ఖాళీగా వుండేవి. కనీసం లోవరు సెకండరీ అయినా అయిందంటే పిలిచి ఉద్యోగా లిచ్చే దినాలవి. నాకళ్ళముందు అనేకులు సర్కారు మనుష్య లయిపోయారు కూడా"

"అంచేత నీకీ గతేమీ టయ్యా?" అనడిగేవారు కొందరు. "యోగం; ఎవరు తప్పించ గలరూ?" అని కొందరు పరామర్శ చేసేవారు. నాకు నవ్వు వచ్చేది. మొదట్లో నేను ఏదేవాంగినో అనుకుని—

"ఏయ్!"

"ఓ అబ్బీ!"

"ఏయ్, బట్టలమూట?"

అని పిలిచేవారందరూ తరవాత్తరవాత "ఏమండీ" అనీ, "ఏమయ్యా" అనీ, ఇతర్లకు గౌరవంచేస్తే తమ గౌరవం పోతుందనీ తహతహ లాడిపోయే మహానుభావులు "ఏంశాస్త్రుల్లూ" అనీ పిలిచేవారు"

"ఒకనా డొక పండుమీసాల పంతులు "బట్టల బేరంలో కోమట్లనీ, దేవాంగులనూ మించావే" అని నన్నెగతాళి చేశాడు. "మీ రలా నిర్ధారణ చేశారంటే నా కింత అన్నం దొరికిం దన్న మాటే; కాని మీరు మాత్రం బ్రాహ్మణ్యం లేశమూ విడిచిపెట్ట కుండా మాట్టాడుతున్నారు, చాలా సంతోషం" అని బదులు చెప్పాను. నసాళం అంటింది పంతులకి"

"దాంతో, బేరంలో నన్ను బోల్తాకొట్టిద్దామని చూశాడాయన. ఆవిధంగా ఆయన వొక మూర్తిపుచ్చుకోడం నిరుకుగదా అని సంతోషించి, నేనే ధారాళంగా అర్ధరూపాయి కిచ్చే తువ్వాలు చూపించి, పావుగంటసేపు దాని కేమిటేమిటో ఘనత ఆపాదించి, కరుగ్గా రూపాయి ధరచెప్పి, తగ్గించియిమ్మని ఆయనచేత అడిగించుకుని, అలా ఆయన ప్రాధేయ పడుతున్నట్టూ నామనస్సు వెన్నెలా కరిగిపోయినట్టూ నటించి, దర్జాగా మూడు పావులాలు జేబులో వేసుకుని చక్కాపోయాను"

"అయితే, తరవాత, వొక్కవారందినాలు మాత్రమే నేను మనిషి దగ్గిర మనిషిబేరం చెబుతూవచ్చాను; కాని ఆపంతులుతో బేరంచేసింది మొదలు, బేరంపద్ధతి అమానుషం అనీ, అనాగరికం అనీ, ద్రోహం అనీ తెలుసుకుని, మధనపడి, ఏమయితే కానీ చాలా సాహసించి చివరికాపద్ధతి మానుకున్నాను"

"కొనే మనిషి తెలివి తేటలనుబట్టి ఒక వస్తువుకే వొకచోట యెక్కువ లాభమూ, వొకచోట తక్కువలాభమూ సంపాదించవచ్చునే కాని లాభం లేకుండా యెవరూ సరుకివ్వరు. కొనేవాడు కూడా ఆసరుకు కిట్టింపుధర కే తనకి

వచ్చిందని మురిసిపోడు. ఇలాంటప్పుడు ఇక బేరంపద్ధతి యెందుకూ? యీ నిశ్చయంతో, నేను "సరుకు మీకు నచ్చిందో లేదో చూసుకోండి. ధరయేమో నికరం. దమ్మిడీ అయినా అది పెరగదు, తరగదు. బేరం చెయడ్యం కాలహరణం మాత్రమే" అని చెప్పసాగాను. ధర వేసి సరుకుమీద చీటీకూడా అంటించసాగాను"

"మొదట మొదట, కొన్నిచోట్ల యిది విషమించింది; కాని తరవాత్తరవాత అంతటా చాలా ఉపకరించింది. కొద్దికాలానికే చాలామంది నా నిజాయితీ గుర్తించారు. వర్తకం రెట్టింపు పెరిగింది"

"రెండోనెల మొదలు సంసారపు ఖర్చులు నా సంపాదనలోనుంచే తీసుకోవలసి వచ్చింది. అంచేత, మూడోనెల గడిచాటప్పటికి నాస్వార్జితం నూటపాతిక రూపాయీలు సరుకు రూపానా, పదిరూపాయీల పైచిలుకు రొక్కంగానూ మిగిలింది. వందలమీద అరువు దొరకసాగింది"

అంతేకాదు, పదిమందీ పదిరకాలు కోరసాగారు అంచేత, మూట చాలింది కాదు. కాకపోయినా:- కొద్దికాలానికే చంకమూట బుజంమూటగా మార్చగలిగినప్పుడు, మరికొద్ది కాలానికే బుజంమూట కావడిగా మార్చకపోతే ప్రజ్ఞ యేం వుందీ? ఈ కారణాలవల్ల నాలుగో నెల జొరబడేటప్పటికి నెల జీతం మీద నేనొక కావటిమనిషిని కుదుర్చుకోవలసి వచ్చింది"

"విన్నావా? ఒక్కరూపాయితో వర్తకం ప్రారంభించిన మూడుమాసాలకే నేనొక జీతగాణ్ణి పెట్టుకోగలిగాను. ఇప్పుడు నీకుమల్లే, అప్పుడు నేనున్నూ నౌకరీకే ప్రయత్నించి వుంటే? బతికి వుండినంత కాలమూ నేనే వొకరికి పనిమనిషినయి వుండవలసిందేగదా? "బ్రాహ్మణజాతిలోపుట్టి దేవాంగిలాగ యింటింటికీ మూటలు మొయ్యడం సిగ్గుకాదూ?" అంటూ నే నీసడింపులు తిన్నాను, నిజమే. మరి నౌకరీచేస్తే? బతికి వుండినంతకాలమూ ఈసడింపులేగా?"

"ఇంతకీ మూటలు మోసే కాలంలో వొక్క పని మనిషినే పెట్టుకున్నాను, మరి తరవాత? మధ్యకాలం సంగతి అలా వుంచు. ఇప్పుడు, చిఠాఆవర్జాలు రాయడానికి నా దగ్గిర యిద్దరు గుమాస్తాలున్నారు. అంగడిలో, అమ్మకం సాగించడానికి నలుగురు సత్తరకాయలున్నారు. కాతా బాకీలు వసూలుచేసుకుని రావడానికి చిన్న గుమాస్తా వొక్కడున్నాడు. గోదాములో సద్దుబాటు చెయ్యడానికి ప్రత్యేకంగా వొకగుమాస్తా, వొకపనివాడూ వున్నారు. ఇంటి దగ్గిర, ఒకటి – రెండు – ముగ్గురు పనిమనుషులున్నారు. అయితే, యిదంతా నా ఐశ్వర్యగర్వం చూపించుకోడానికీ, వారిని న్యూనతపరచడానికీ కాదుసుమా? మరి నేనప్పుడు నౌకరీకే సిద్ధపడివుంటే?"

"పోతే — కావటివాణ్ణి పెట్టుకున్నందువల్ల కలిగిన మేలేమిటో యెరుగుదువా? మొదటి మేలు — రెట్టింపు సరుకు పట్టించుకు వెళ్ళడానికి వీలుకావడం. ఇక తరవాతి సంగతి — ఇంటింటికీ వెళ్ళి బట్టలు కావాలా అని నేనెవరినీ అడగడం లేదు. కావటివాడే రకరకాల గుడ్డలపేర్లు ఏకరువు పెట్టుకుంటూ ముందు నడుస్తూ వుండడం. గుబ్బగొడుగు వేసుకుని దర్జాగా నేను కూడా కూడా వెడుతూ వుండడం, ఎవరయినా పిలిస్తే లోపలికి వెళ్ళి కావటివాడు కంబళీ పరిస్తే ఠీవిగా అంగడిలో లాగ కూచుని, సరుకు చూపించడం కావలసినవి యిచ్చి డబ్బు పుచ్చుకుని మళ్ళీ బయలుదేరడం. కావటికూలి అమ్మకంలోనే చేర్చెయ్యడమున్నూ"

## 24

"స్వగ్రామం మహేంద్రవాడలో నాకొక చిన్న నివేశన స్థలమూ, తాటాకుల కొంపా వుండేవి. నే నక్కడికి వెళ్ళి కాపురం వుండనని యెలాగా నిశ్చయం అయి వుండినందున, వడ్డీ నష్టం తప్ప వాటివల్ల మరేంలాభమూ?"

"మా అమ్మా నేనూ యీవిషయమై బాగా ఆలోచించాము. నారెక్కల మీద స్వేచ్ఛగా బతగ్గలను అని రుజువు చెయ్యగలిగి వుండకపోతే నేనీవిషయం ఆవిడదగ్గిర ఎత్తివుండకపోదును. ఎన్ని తరాలనుంచి వుందో అది, నేను చేతగాని వాణ్ణయితే, ఆవిడకూడా నన్ను మందలించకుండా వుండకపోను. పరిస్థితులు పూర్తిగా మారడం వల్లనే యిద్దరికీ యేకాభిప్రాయం కలిగింది. వెంటనే పనిచెడి, వారందినాలక్కడ వుండి, అయిదువందల రూపాయిల కది అమ్మేసి చక్కావచ్చాను"

"ఆడబ్బుకూడా అంతానేను వర్తకంమీద పెట్టేశాను. దాంతో, రకరకాలే కాదు, విలువగల బట్టలు కూడా నేను రొక్కానికి కొనగలిగాను. అణా లాభం వచ్చేచోట అణాకాని మిగలడం ప్రారంభం అయింది. బజారు కాతాదార్లు, శంభుశాస్త్రి వ్యాపారం పురెక్కిందని గ్రహించారు"

"ఇలాగ, వొక్క సంవత్సరం కష్టపడగా, నా వ్యాపారం పదిపన్నెండు వందలపైదాకా పెరిగింది. మరో సంవత్సరంలో రెండు దాటి మూడో వెయ్యి సమీపించింది. అయితే, కావడి వర్తకాని కంత డబ్బెందుకూ? ఎంతసరిపోతే అంతతోనే కాలక్షేపం చేద్దామంటే, తక్కినసొమ్ము పెట్టెలో పెట్టుక్కూచోడం వివేకమా?"

"కావడి మానుకుంటే బజారులో అంగడి తెరవాలి. తెరవాలని

మొదణ్ణుంచీ కలలు కంటున్నదే; కాని రాజమహేంద్రవరం బజారులో ఆదినాలలోనే అయినా రెండువేల పైచిలుకేపాటి? అది యేమూలకి?"

"గోచికి పెద్దా, అంగస్త్రానికి చిన్నా" అన్నకాడికి వచ్చింది నాస్థితి"

"ఏమిటి చెయ్యడం? నేనీజిజ్ఞాసతో రెండు మూడుదినాలు కిందా మీదా పడిపోయాను. "ఇంకా కావడేనా, యీపాటికి అంగడి సద్దవయ్యా" అంటూ వచ్చారు. వొకరిద్దరు వర్తకులు సరుకుకోసం వెళ్ళినప్పుడల్లా. ఎప్పటికప్పుడే దాంతో నేను వూగిపోయేవాణ్ణి; కాని ధైర్యం చాలేది కాదు"

"ఈ స్థితిలో ఏదినం అమ్మకం ఆదినమే నాకిచ్చేసేటట్టయితే, నాలుగు వేలు తెస్తివా, పదివేల సరుకిస్తా"నని మారువాడీ వొకనాడు తరిమితరిమి చెప్పాడు. అది బాగానే కనపడింది; కాని చేతిలో వున్నది మూడువేలకులోపే ఆయె, ఏమిలాభం? తక్కిన సొమ్ము ఎలాగా తేవడం?"

"చల్లని తల్లి సోదెమ్మక్కయ్యగారు జ్ఞాపకం వచ్చారు. మూటదాటి నావర్తకం కావడి అంతస్థులోకి వచ్చినప్పణ్ణుంచీ — ముఖ్యంగా రెండు వేలు దాటాక, నామీద ఆమెకికొత్త ఆదరాభిమానా లేర్పడ్డట్టు మాఅమ్మ చెబుతూ వచ్చింది. "తమ్ముడు, మూట బుజాన పెట్టుకుని వెడుతూవుంటే నా ప్రాణం కొట్టుకొంటోంది పిన్నిగారూ" అని యెన్నోమాట్లు జాలిపడుతూ వచ్చారుట పాపం ఆవిడ."

"నావూహ చెప్పిన మీదట చెప్పుకుని వచ్చింది మా అమ్మ యిదంతా"

"కావడంవల్ల, మాఅమ్మ నావూహ బలపరిచింది. వెంటనే బయలుదేరి మేమిద్దరమూ ఆమె దర్శనానికి వెళ్ళాం. ఒక్కక్షణం వూరుకుని, మాఅమ్మ" యీ సంగతి చెప్పలేక చెప్పలేక, చెప్పింది. నేనుమాటే అడలేకపోయాను; కాని "ఎక్కడ నేర్చుకున్నారు పిన్నిగారూ?" అంటూ ఆవిడ చర్రున అందుకుంది.

"యీమాత్రం భాగ్యానికి ఇంత ఆలోచనా" యింత ప్రాధేయపడ డమూనా? నీకీతటపటాయింపెందుకు వచ్చింది తమ్ముడూ?" అంటూ ముందు మా అమ్మనీ, నన్నూ నెపపెట్టారావిడ. ఇలా అంటూనే యినపపెట్టె తెరిచి నోట్లకట్ట వొకటి తీసుకువచ్చి "నీయిష్టం వచ్చినంత పుచ్చుకో" అంటూ నామీద పడేశారు"

"నూరేసిరూపాయిలనోట్లు యాభై వున్నా యందులో"

"నేను మళ్ళీ ఆలోచనలో పడ్డాను. "ఆ అయిదువేలూ పుచ్చుకుంటే?" అనుకున్నాను. సోదెమ్మక్కయ్యగారు, ఇంకా కావాలన్నా యిచ్చేటట్టే కన పడ్డారు; కాని నేనే పస్తాయించాను. ఇక్కడ యెంత పుచ్చుకున్నా మారువాడీ

దగ్గిర అరువు తప్పదు. తప్పడమూ మంచిది కాదు. అయినప్పుడు అతనడిగిన దానికంటే యెందు కెక్కువ జమకట్టాలీ?" అని తోచింది"

ఇలా నిశ్చయించుకుని, సరుకు కాక నాదగ్గిర రొఖ్ఖం పదిహేను వందలే వుండడంవల్ల, నాలుగువేలపూర్తికి, ఇరవై అయిదునోట్లే పుచ్చుకుని తక్కినవి ఆవిడ కిచ్చేశాను. "మొగమోట పడుతున్నట్టున్నావు, చాలవేమో సుమా" అన్నారక్కయ్యగారు. "లేదు, ఇప్పటి కింతకంటే పనిలేదు. మళ్ళీ యెప్పుడు కావలిస్తే అప్పుడే అడుగుతాను" అని నేను బదులు చెప్పాను."

"మిగిలిన నోట్లు పెట్టెలో వుంచేసుకుని, ఆవిడ "ఇరవై అయిదు వందలు మా సాహుకారు తమ్ముడి పేర ఖర్చు రాయండి. నూటికి పదణాలవడ్డీ. నోటు అక్కర్లేదు. చిఠాలో సంతకం చేస్తాడు" అని బావగారితో చెప్పారు.

"మేము చకితులం అయిపోయాం. నోటు అక్కరలేదనడం వొకటీ, ఆదినాలలో మోతుబరీ వడ్డీ రూపాయి అయివుండగా పదణాలు మాత్రమే కట్టడం మరోటీ—దీంతో నాకుమాటరాలేదు; కాని మాఅమ్మ మాత్రం "నాచిట్టితల్లీ" అంటూ గభీమని ఆవిణ్ణి హొదువుకుని "నీచేతి చలవమూలానే తమ్ముడిప్పుడింత అన్నం తింటున్నాడు. దీంతో, యిక లక్షాధికారి అయి మిద్దెలూ మేడలూ కట్టేస్తాడు. ఏమి చేసిన్నీ మేము నిరుణం తీర్చుకోలేము" అని మరి మాట్టాడలేక పోయింది. అక్కయ్యగారున్నూ మాటరాక మాఅమ్మ కేసి చూస్తూవుండిపోయారు. నేను మూగదండాలు పెట్టాను."

## 25

"పంతులూ, నువ్వది అదృష్టం అను లేక మరేమయినా అను, ఒక్కొక్కప్పుడు అనుకోకుండానే మన కది సంక్రమిస్తూ వుంటుంది. అలాంటప్పుడు వరాసగా మేళ్ళే కలుగుతూ వుంటాయి కూడా"

"ఇందుకు తగ్గట్టు, ఆరూపాయిలు పట్టుకుని నేనిట్టే బజారులోకి వెళ్ళాటప్పటికి, మొదటినాడు నే నే అంగడిలో రూపాయి కయిదు మూర్తులు కొన్నానో దాని పక్క కొట్టు రెండు దినాలలో కాళీ అవుతుందని పరమ రహస్యంగా తెలిసింది. వెంటనే వెళ్ళి యజమానితో మాట్లాడగా, యెనిమిది రూపాయిల కున్నది పదింటికి నాపేర స్థిరపరిచాడు. అద్దెచీటీ మూడేళ్ళకి రిజిష్టరీ చేయించుకున్నాం, ఆమూడేళ్ళూ గడిచాటప్పటికి యిల్లంతా నేనే కొనేశాను; గానీ ఆ సంగతి యిప్పుడుకాదు"

"ఇది కాగానే నాలుగువేలూ పట్టుకువెళ్ళి నేను మారువాడి చేతిలో

పోశాను. అందుకు చాలా సంతోషించి "దేవుడు సాక్షిగా చెబుతున్నాను పంతులూ" అంటూ ప్రారంభించాడతను"

"నాకు యౌవనం అంకురిస్తోందనగా పొట్ట చేత్తో పుచ్చుకువచ్చా నిక్కడికి. చాలాకష్టపడ్డాను. మొదట్లో వొక మారువాడీ యింటో వంటలుచేసి, పదిరూపాయిలు సంపాదించుకుని వర్తకం ప్రారంభించానంటే నాకష్టా లెలాంటివో వాటిని నేనెలా దాటుకు వచ్చానో నువ్వర్థం చేసుకోగలవు ఇన్ని లక్షల సరుకు పెట్టుకూర్చున్నాను, నాకు కాతాదార్లు లేకా, బతిమాలి సరకు పట్టుకుపోయేవాళ్ళు దొరక్కాకాదు, అంగడి పెట్టమని నిన్ను ప్రోత్సహించింది. నీదీక్షా నీ యేకాగ్రతా లక్షలు పెట్టగలవాళ్ళ కూడా అనేకులకు లేవు. నీ వాలకం చూస్తే నువ్వు లక్షలు సంపాదించాలి, తప్పదు. అయితే, అయిదు లక్షలు - ఒకటి - రెండు - మూడు - నాలుగు - అయిదు లక్షలు సంపాదించే దాకా మాత్రం యీదీక్ష విడిచిపెట్టవద్దు"

"నాదగ్గిర కాతాపెట్టిన వాళ్ళెవళ్ళూ చెడలేదు. అదే యింత దీర్ఘానుభవంతో నేను గడించుకున్న ఆనందం, నీకున్నూ దేవుడు నాకిచ్చిన ఆనందం కలిగిస్తాడు. వెళ్ళు" అంటూ నన్ను నిండుమనస్సుతో దీవించి పంపాడతను. అంతులేని నవశక్తి వచ్చింది నాకతని శుభాకాంక్షతో"

"మేమిద్దరమూ ఇలాగ గురుశిష్య సన్నివేశంలో వుండగా, నాకొక సంగతి జ్ఞాపకం వచ్చింది. నేను, ముందు నా సంసారం గడుపుకోవాలి. అంగడి అద్దె చెల్లించాలి. ఎంత చిన్న వ్యాపారం అయినా సత్తరకాయ తప్పదు, అతనికి జీతం చెల్లించాలి. అనుకోని చిల్లరఖర్చులుంటాయి, భరించాలి. సోదెమ్మక్కయ్యగారి బాకీ అసల్లో నెలకొక వందా అసలుకయిన వడ్డీ చెల్లించాలి మొత్తం యెంత లేదన్నా నెలకి రెండువందల రూపాయిలుండాలే, యెప్పటి అమ్మకం అప్పుడే మారువాడీకి చెల్లగడుతూ వుంటే యిదెలాగా?"

"నే నీ విషయం కదుపుదామనుకుంటూ వుండగా నా కంటే ముందతనే ప్రస్తావన చేశాడు. "ఏమయినా తప్పుతాయి గాని అవి తప్పవు, కనక, అవి పోను తక్కినదే యిస్తూ వుండు. ఇంకొక్కటి బాగా జ్ఞాపకం పెట్టుకో. ఎవళ్ళకివ్వవలసిన వాయిదా సొమ్ము వాళ్ళకి ఒకటో తేదీన యిచ్చేస్తూవుండు. తెల్లవారి రెండో తేదీ ప్రవేశించిందంటే "ఏమిటిదీ?" అని వాళ్ళు ఆలోచనలో పడతారు. అలాంటిదాని కెన్నడూ అవకాశం యివ్వకు. అంగడి కట్టేశాక, ప్రతీదినమూ సాయంత్రం నాదగ్గిర కాస్సేపు కూచుని మరీ యింటికి వెడుతూ వుండు ఎప్పుడు రానక్కర్లేదో నేనే చెబుతాను. ఇదిగో, నా

హృదయం పుచ్చుకో, నీ హృదయం నా కిచ్చివెళ్ళు" అని కూడా చెప్పాడు మహానుభావుడు"

"సర్వాత్మనా అతను మారువాడీ బ్రాహ్మడు, సందేహం లేదు. డబ్బు కోసమే యిక్కడికి వచ్చాడు, గుడ్డిగవ్వలుకూడా పోనివ్వలేదు; కాని నిజంగా, దేవతలలో లెక్కపెట్టతగ్గమనిషి అతను. లోకంలో విశాలహృదయులనేకు లుంటారు; గాని అత నమృతహృదయుడు. చచ్చిస్వర్గాన వున్నాడు, అతన్ని తలుచుకుంటే పాపాలు పోతాయి"

"నిజంగా, ప్రతిసాయంత్రమూ నా కత నెంతో గొప్ప సలహాలు చెప్పే వాడు. ఆసమయాన అతని అంగడిలో కూచోడమే చాలు, లక్షలు విలవగల విషయాలు తెలిసేవి. కొన్ని దశాబ్దాల పరిశ్రమతో గాని రాని అనుభవజ్ఞానం అక్కడ దినాలలో కలిగేది. దాంతో, నావర్తకం హుటాహుటి నడకలతో వృద్ధి అయింది"

"నాస్థితి లక్షల్లోకి వచ్చాక అప్పుడప్పు డతనే నా అంగడికి వచ్చేవాడు. అదంతా యిప్పుడెందుగ్గానీ ఒక్కసంగతి చెప్పాడతను. కోట్లవిలవ గలదది"

"నాయనా, తెనుగు బ్రాహ్మల గతి ముం దేమవుతుందో నేను స్పష్టంగా గుర్తించలేకుండా వున్నాను. దారుణమైన అపాయం మాత్రం కనిపెట్టుకుని వుంది, సందేహంలేదు, తప్పదున్నూ. ముఖ్యంగా, భూవసతులు పోతాయి. నౌకరీలు దొరకవు. ఎప్పటికయినా వ్యాపారమూ పరిశ్రమలూ నమ్ముకుంటేనే గతి యేర్పడుతుంటి; గాని మీ వాళ్ళకిది తెలవడం లేదు" అని చెప్పి యెంతో పరితపించా డతను"

"మారువాడీతో కాతా కలిశాక రెండుదినాలే నేను కావడితో వూళ్ళో తిరి గాను. కొట్టు స్వాధీనం కాకపోవడంవల్లనే అలా తిరగవలసివచ్చింది. ఆ రెండు దినాలూ, తిరిగిన చోటల్లా, ఎరిగివుండిన వారందరితోనూ "ఇక కావడి పట్టించుకురా"ననీ "బజారున ఫలానా చోట అంగడి తెరుస్తున్నా" ననీ "యేర కంబట్టలు కావలసి మీరు బాజారుకి వచ్చినా మొదట నా అంగడికి వచ్చి సరుకూ ధరలూ చూసుకోకుండా మరో అంగడికి వెళ్ళవ"ద్దనీ చెప్పి వచ్చాను. "ఇప్పటిదాకా నాయెడలవుంచిన అనుగ్రహం యికముందున్నూ వుంచాలి" అని కోరిన్నీ వచ్చేశాను"

## 26

"అన్ననాడు కొట్టు కాళీ అయింది. వెంటనే — మంచి ముహూర్తాన, తెల్లవారా టప్పటికి తోరణంకట్టి విఘ్నేశ్వరపూజ చేసి దగ్గిరవుండిన కావడి

సరుకూ సర్దేశాను. నా జాపితాప్రకారం మారువాడీ పంపిన సరుకుతో యెనిమిది గంటలకే అంగడి పూటుగా తయారయింది. దగ్గిరవుండి, యిదంతా జరిగించి, నా శిరస్సున తన వరదహస్తం వుంచి దీవించి, తాంబూలం పుచ్చుకుని వెళ్ళి పోయాడు మారువాడీ"

"అక్కడి వర్తకులకు చాలామంది కీసంగతి తెలియదు. తెలిసిన వొక రిద్దరయినా, నే నంత త్వరగా గానీ, అంత పెద్ద యెత్తున గానీ అంగడి తెరుస్తా ననుకోలేదు."

"అందరూ చకితులైనారు. ముఖ్యంగా నా మొదటి కాతాదారు — అంటే పక్క అంగడి యజమాని, యెనిమిది కొడుతూవుండగా బజారుకీ, నేను పిలవగా నా అంగడికీ వచ్చి చందన తాంబూలాలు స్వీకరించి, "ఓయి పిడుగూ! ఒక్కరూపాయితో నా అంగడిలో కాతాపెట్టి వర్తకం సాగించి చివరికి నాకే యెసరుపెట్టావూ?" అన్నాడు, నా వీపు తట్టుతూ. దానిమీద "నేను రా ననుకో, మరి యీ కొట్టు కాళీగా వుండిపోతుందా? ఇన్ని బట్టల అంగళ్ళ మధ్య మరోరకంసరుకు సర్దుకుని యెవరైనా కూచుంటారా?" అని సరాగంగా ముందు ఎదు రడిగి తరవాత "ఇదంతా నీచేతి చలవ! నీహృదయ వైశాల్యానికి గురుతు. ఐశ్వర్య మత్తతలేకుండా ఒక భిక్షుకుని కొడుక్కి చేయూత యిచ్చావు నువ్వు, నీరుణం నేను తీర్చుకోలేను. ఇక ముందుకూడా నువ్వు, నన్ను ప్రీతిగా చూడాలి. నీశుభాకాంక్ష తప్పకుండా నన్ను వొడ్డెక్కిస్తుంది" అని కోరాను."

"పంతులూ, నేను వేళాకోళంచేశానంతే, కోప్పడకు. అది మరిచిపో. నా చేతి చలవలోకంటే నీదీక్ష సత్తాలలోవుంది నీ విజయానికి కీలకం, మూటలు బుజాన వేసుకుని తిరుగుతున్న వారిని చాలామందిని చూశాను, వారిలో యెవ రికీ నీయేకాగ్రత లేదు. అయితే చాలామంది బ్రాహ్మలిప్పుడు వర్తకాల్లో దిగు తున్నారు; కాని నన్నడిగితే తేలే వాళ్ళే కాదు. ఉన్నది నిలుపుకోగల వాళ్ళు కూడా చాలా తక్కువ అవుతారు. వృత్తితో పాటు దృక్పథం మార్చుకోక పోవ డంవల్ల వచ్చే ఆపత్తు అది. ఈనాములమీదా ఉద్యోగాలమీదా వచ్చింది మార్చుకు తినడానికీ, ఒక్క రూపాయి ఖర్చుపెట్టి, ఆఖర్చులోనుంచి రూపాయి పాపులా పుట్టించి, అందులో రెండణాలుమాత్రం తినడానికి చాలా భేదం వుంది తగిన శిక్షణా అభ్యాసమూ లేకుండా దేట్లో దిగినా మీ వాళ్ళే కాదు, ఎవళ్ళయినా దెబ్బతింటారు. అంచేత, నీది కూడా బాపనవ్యవసాయం అయిపోతుం దనే మొదట నేను భావించాను. అలా కానందుకు చాలా సంతోషం, ఇంతేకాదు ఎంతో కిందనుంచి నువ్వింత పైకి వచ్చావు. నిజంగా, నీదగ్గిర, ఇతర్లు

నేర్చుకోవలసిన పాఠాలున్నాయి. నువ్వు నా పక్కకి రావడం నా అదృష్టం" అంటూ నన్ను చాలా మెచ్చుకున్నా డతను"

"వయస్సు చిన్న దే కాని చాలా ప్రతిభ కలవాడతను. ఇంగ్లీషు నాకంటే యెక్కువే చదివాడు. అయితే, సంగీతంలో వున్న అభిరుచి అతనికి సాహిత్యంలో లేదు. లోకజ్ఞానం కోసం వార్తాపత్రిక మాత్రం చదివేవా డతను. అన్నిటికంటే పర శ్రేయసహనం అతనికి చాలా హెచ్చు. ఎవరికి లాభం వచ్చినా తనకి లాభం వచ్చినంత సంతోషం అతనికి"

"పంతులూ! ఎవడి బోరకింది కెవడు తోడుకోడం మాంతాడూ! స్వార్థమే ఐహికజీవితానికి మూలం. స్పర్థే జీవితవిజయానికి కీలకం. హద్దు మీరనంతవరకూ తనకి కావాలనుకోడం అసహజం కాదు. తప్పంతకంటే కాదు. ఈహద్దు నిలుపుకోలేక ఐహికమే వద్దనుకోడం, అవివేకం. ఈహద్దు నిలుపుకోలేనివాడు వైరాగ్యంలో కూడా నెగ్గలేడు. వైరాగ్యానికి కూడా హద్దుంది. ఎండుతూ మాడుతూ తొరగా చచ్చిపోవాలనుకోడంకాదు వైరాగ్యం"

"ఈజీవితానికి పరమార్థం ఆనందం. చూపెప్పుడూ దాని మీద వుండాలి. అక్రమాలకు దిగుతామా ఆ పరమార్థం భ్రష్టం అయిపోతుంది. సభ్యత అలవరుచుకుంటే యీ అపాయం తటస్థించదు. దరిద్రుల మధ్య నివసించే ఐశ్వర్యవంతునకు సౌఖ్యానందాలు సిద్ధించవు. వాడిబతుకు గర్వంతో పొగచూరిపోతూ వుంటుంది. సంశయాలతో రవిలిపోతూ వుంటుంది. అపభ్రంశాలోచనలతో మండిపోతూ వుంటుంది. స్వయంకృతాపరాధాలతో చివరికి నుసి అయిపోతుంది"

"ద్వంద్వభూయిష్టం అయిన యీప్రపంచంలో నిమిత్త మాత్రంగా నైనా వొకరి ఆసరా లేకుండా యెవడూ పైకి రాలేడు. ఎవరి వల్లనో నువ్వూ అలాంటి ఆసరా పొందావు. సంతోషం. శక్తివంచన లేకుండా నువ్వూ వొకరికి ఆసరా అవుతూవుండు. మన ఐశ్వర్యం చూసుకుని మనం అనుభవించే ఆనందంకంటే, మన సాయంతో బాగుపడ్డవాళ్ళు అనుభవించే ఆనందం మన జీవితానికి ఎక్కువ సాఫల్యం కలిగిస్తుంది."

"ధైర్యంగా ముందుకి వెళ్ళు. వెనకబడ్డవాళ్ళని వెంటబెట్టుకుని ముందుకి వెళ్ళు. సంపాదించు. కష్టపడి సంపాదించు. ఒకళ్ళని చెరపకుండా సంపాదించు. అనుభవించు. ఆనందించు. అది ఐహికానికి పరమావధి" అని నాకెన్నోమాట్లు మహోపదేశం చేస్తూవచ్చా డతను"

"నా హృదయంలో కొంచెం అయినా స్థానం ఆక్రమించుకుందామని అంధకారం యెన్నోమాట్లు ప్రయత్నించింది; కాని నా సహచరుని బోధ సూర్యోదయం అయి దాన్ని పారదోలుతూ వచ్చింది"

"అతను నావాడు" అన్న ధీమాతో నేను అంగడిలో కూచుని వర్తకం ప్రారంభించాను"

"రెండు సంవత్సరాలపాటు అదేపనిగా తిరిగివుండడంవల్ల కాళ్ళు ముడుచుక్కూచోడం, మొదట్లో, నాకెంతో యెబ్బెట్టుగా కనపడింది. పైగా బేరాలు కూడా నెలదినాల పాటు సరిగా తగలలేదు. అంత సరుకు పెట్టుక్కూచున్నా, కొద్దిపాటి సరుకుతో వూళ్ళో తిరిగినప్పటి అమ్మకం మాత్రమే రావడం ఆశ్చర్యకరంగా కనపడింది. నా నిరుత్సాహం చూసి "నీ సంగతి యెవరికి తెలుసూ? ముందు పరిచయం కావాలి. ఇళ్ళకి వెడితే కొనే మనుష్యులు వేరూ బజాతుకి వచ్చి కొనే మనుష్యులు వేరూను. ఓపికపట్టు" అని ధైర్యం చెప్పాడు, పక్క అంగడి మిత్రుడు.

"అంగడికి వస్తారు. సరుకు చూస్తారు. ధరలు తెలుసుకుంటారు. ఎందునా పొందని కారణాలు చెపుతూ వెళ్ళిపోతారు. ఇదొక అంతరువు. ఇది జరిగిందా, వ్యాపారం జరిగిందన్నమాటే" అని కూడా చెప్పాడతను"

"రెండు మాసాలు ఇదే తంతు. పదిమంది వచ్చి విసిగించడమూ, యేవొక్కడో కొనడమూను. మూడు మాసాల దాకా, ఎన్నడూ, దినానికి పది హేనురూపాయిలకు ఎక్కువ చెల్లకట్టలేకపోయాను మారువాడికి"

"ఎరుక లేదుగా? అదీ యీ మాంద్యానిక్కారణం" అన్నాడతను గూడా"

"అంగడి తెరుచుక్కూచునే దాకా నాకీ అనుభవం కలగలేదు కాని ఆరు మాసాలు గడిచాటప్పటికి వడి అందుకుంది. అది చూసి "అంగడిలో యేమూలా కాళీ కనపడగూడదు. నీకిక పరిమితి అక్కర్లేదు, ఏమి యెంత కావలిస్తే అంతా నాదగ్గిరనుంచి నిశ్చింతగా పట్టుకువెళ్ళు" అంటూ చాలా ఔదార్యం కనబరిచాడు మారువాడీ, ఒక్కొక్కప్పుడు కొత్తరకాలు వస్తే అతని కతనే వంపేసేవాడు, చీటీ రాసి"

"సంవత్సరం తిరిగాటప్పటికి నా అంగడికో తెరిపి వుండేదికాదు. రెండేళ్ళ కనుకున్న అక్కగారి బాకీ, మారువాడీ సలహాతో సంవత్సరానికే తీర్చేశాను. రెండేళ్ళు దాటాక అతనే నాకు బొంబాయి కాతాలు కలిపాడు. చెన్నపట్టణం నాకు పెరటిదొడ్డి అయిపోయింది. మధురా, కోయంబత్తూరూ, సేలమూ, బెంగుళూరూ మొదలైనవి రాజమహేంద్రవరంలోనే పేటలన్నట్టయిపోయాయి. పూర్తిగా స్వతంత్రుణ్ణయినాను"

"బెంగ తీరింది నాయనా! బతికివుండినందుకు ఫలం కనపడింది. నువ్వీ

స్థితికి రావడం నాకళ్ళతో చూసుకున్నాను. నా తండ్రీ, ఇక నాకు విచారమూ లేదు, లోటూలేదు" అంటూ మా అమ్మ బ్రహ్మానంద పరవశురాలయిపోయింది"

"అక్కగారు చాలా సంతోషించారు"

"అప్పటికి తెలిసింది బావగారికి శంభుశాస్త్రి ప్రయోజకత్వం, మెల్లి మెల్లిగా. చిట్టచివరి వాయిదా చెల్లగట్టినప్పుడు, మొట్టమొదటిమాటు "బావా" అని సంబోధించి వీపు తట్టారాయన. "అత్తగారు నిన్నేవుద్దేశంతో, యీవూరు తీసుకువచ్చారో అది నెరవేర్చావునువ్వు. ఆవిడ ఆశలుపూరించావు. దారిద్ర్యం వొక మృత్యువు. అది జయించినవాడి జన్మ సామాన్యమైనదికాదు. నీ సత్తా మాకిప్పటికీ చాలా స్వల్పంగానే తెలిసింది. మీ అక్కగారికే కాదు, నాకూ నువ్వు ఆత్మీయుడవే. నువ్వుకూడా నన్ను నీవాడికింద చూసుకో. కష్టసుఖాల్లో మేమున్నాము మీరు బలగంలేనివాళ్ళుకారు. నా పలుకుబడి అంతా నువ్వు స్వేచ్ఛగా వాడుకో" అని యెంతో ఆదరంగా, ఎంతో ప్రేమగా, ఎంతో వాత్సల్యం కనబరిచారు"

"ఇంకొకటి చెబుతాను. పరపతికి నిదర్శనం అప్పుపుట్టడంకాదు, అణా పైసలతో అది తీర్చెయ్యగలగడం. మనస్సులో వుంచుకో" అని మహోపదేశం కూడా చేశారాయన"

## 27

"ఇక నాకు పెళ్ళాం తక్కువ, కదూ? అబ్బో నీ కెప్పుడో తట్టివుంటుందీ సంగతి, అదిగో, ముసిముసినవ్వులు నవ్వుకుంటున్నావు, నాకు తెలుసు. ఈకాలంవాళ్ళకి చదువుకంటే ముందు పెళ్ళికావాలి. ప్రజ్ఞకంటే ముందు పెళ్ళాం కాపరానికి రావాలి"

"వరుని మాటా, తల్లిదండ్రుల మాటా అలా వుంచు, తరవాత నాటకాల్లో తిరిగినా, కుర్రాడు ఏఫస్టుఫారమో చదువుతున్నాడంటే చాలు కన్యాదాతలిక నిలవనిస్తారుటయ్యా యిప్పుడూ?"

"మా చిన్నతనం నాటికీ యిప్పటికీ అంతా భేదమే. ఇప్పుడు పెళ్ళి కొడుకుల తండ్రుల కెంతబింకం వుంటోందో, పెళ్ళికూతుళ్ళ తండ్రుల కంత బింకం వుండేదప్పుడు. ఇప్పుడు మగపిల్లలకు ధర పలుకుతున్నట్టు అప్పుడు ఆడపిల్లలకు పలికేది. సంప్రదాయం చూసుకునే వాళ్ళు మాత్రం, కాళ్ళు కడిగి కన్యాదానం చేసి "దశపూర్వేషాం దశాపరేషాం" అనుకుని తృప్తిపడేవారు"

"డబ్బో, యోగ్యతో వుంటేనే మొగాడికప్పుడు పెళ్ళి అయేది. నా యెరికిన, నా యీడువాళ్ళెందరో బ్రహ్మచారులుగా వుండిపోయారు"

"ఏదో వొక యోగ్యత వుండినా పురుషునకప్పుడు ఇరవైయేళ్ళు నిండాకే పెళ్ళి. దీనికిసాయం పెళ్ళికూతుళ్ళు పదేళ్ళలోపువాళ్ళయి వుండేవారు. ఇరవైయేళ్ళు దాటాక అయినా పురుషులకు పెళ్ళిమాత్రమే అయేది. భార్యకాపరానికి రావడం పాతికేళ్ళు దాటాకే. అనేకులకు ముప్పయేళ్ళు వచ్చేదాకా పెళ్ళే అయేది కాదు. అంచేతనే అప్పుడు శిశుమరణాలు తక్కువ"

"అంచేతనే, అప్పుడు, స్త్రీలూ, పురుషులూ దీర్ఘాయుష్మంతులయి వుండేవారు"

"ఎవళ్ళమాటో యెందుకూ? నాసంగతి వచ్చేసరికి నాకు ఇరవైనాలుగేళ్ళు నిండాకే పెళ్ళిచేసుకోవాలని సంకల్పం కలిగింది. మాఅమ్మ కూడా అప్పటిదాకా ఆ విషయం ఆలోచించలేదు"

"నా కయినా, మారువాడీ ప్రోత్సాహంతోనే ఆ సంకల్పం కలిగింది"

"కొత్తరకాలు వచ్చాయని కబురు రాగా నేనొకనాడతని అంగడికి వెళ్ళాను. అప్పటికొక సంపన్నుడు పెళ్ళికి బట్టలు కొంటున్నా డక్కడ. ఆ అంగడికల్లా నిగ్గయినవి రెండు పట్టుచీర లుండగా అందులో వొకటి పుచ్చుకున్నా డాయన. ఏమితోచిందో, వెంటనే నా చేతిలో పెట్టాడు రెండోది మారువాడీ."

"ఇది నీదగ్గిర వుంచు, అమ్మకం కోసం కాదుసుమీ" అని మాత్రమే అన్నా డప్పుడు"

"సాయంత్రం నా అంగడికి వచ్చాడు. చిఠా తియ్యమన్నాడు. చూశాడు. "లక్ష దాటింది నీ వ్యాపారం. ఇక పెళ్ళి ప్రయత్నం సాగించు హఠాత్తుగా స్ఫురించి అందుకోసం యిచ్చాను నీకాచీర, అంత మంచిచీర యింతవరకూ నా అంగడికి రాలేదు. జమీందార్లు మాత్రమే వాడుకో తగ్గది అది. నువ్వు వాళ్ళకి అప్పులు పెట్టే స్థితికి వస్తావు. కనక, నీభార్య అది కట్టుకోవాలి" అన్నాడు, ఆనందబాష్పాలతో అతను"

"నాకు పారవశ్యమే కలిగింది"

"ఇక చిత్రం యేమి టంటేః నా పెళ్ళి విషయమై మా యింట్లో ఆలోచన ప్రారంభం అయినప్పుడే అక్కడ సోదెమ్మ అక్కయ్యగారికిన్నీ వాళ్ళ సావిత్రి పెళ్ళి విషయమై ఆలోచన పుట్టింది"

"అప్పటికి సావిత్రి వయస్సు పన్నెండు వెళ్ళి పదమూడో సంవత్సరం నడుస్తోంది, "అయ్యో, పిల్ల కట్టుతప్పిపోతోంది, ఇంకా పెళ్ళి చేశారు కారేమిటమ్మా?" అంటూ అర్యాపురాని కార్యాపురం అంతా ముక్కుమీద వేలు పెట్టుకుంటోంది"

"మర్నాడు, మామూలుగా, మా అమ్మా సోదెమ్మక్కయ్యగారూ సావకాశంగా కూచుని కష్టసుఖాలు చెప్పుకోవడంలో, మా అమ్మ మారువాడీ అన్న మాటలు జారవిడిచిందిట. సావిత్రి పెళ్ళిమాట అక్కయ్యగా రెత్తుకున్నారుట. ఆవేళ, ఆ సమావేశం ముగిశాటప్పటికి వారిద్దరూ వియ్యం అందాలనుకున్నారుట"

"ఆ మర్నాడు తెల్లవారాటప్పటికి అక్కయ్యగారి దగ్గర నుంచి కబురు, నన్ను అంగడికి వెళ్ళవద్దని"

"ఎనిమిదింటికి భార్యాభర్తలిద్దరూ వచ్చారు. తొమ్మిదింటికి సంగతి సందర్భాలన్నీ తేలిపోయాయి. పదింటికి ముహూర్తం నిర్ణయం జరిగింది పదకొండింటికి ఆవేళ వారి యింటో మాకూ, మర్నాడు మాయింటో వారికీ విందులు జరిగాయి. మరో పదిహేను దినాలకు నాపెళ్ళి అయింది"

"సావిత్రి కాపరానికి వచ్చాటప్పటికే బజారులో నేను మేడకట్టాను. మా పెద్దమ్మాయి పుట్టుకలకు పేటలో యీమేడ కట్టాను. క్రమంగా, మహేంద్ర వాడలో పదిపుట్ల భూమికొన్నాను. సరాసరీ సీమనుంచే సరుకు తెప్పించసాగాను"

"అయిదారు లక్షల విలువగల మాఅంగడి యిప్పుడు మా పెద్దబ్బాయి సవరించుకుపోతున్నాడు. నా పెద్దకోడలు అగ్రహారీకుల ఆడబడుచు నారెండో కొడుకు గొదామూ సంసారమూ నిర్వహించుకుపోతున్నాడు. అతని భార్యే మన సబ్జడ్జీగారి కూతురు. మూడోవాడి కింకా పెళ్ళికావాలి, సంబంధాలమీద సంబంధాలు వచ్చి పడిపోతున్నాయి. అతనిప్పుడు సీమలో డాక్టరు పరీక్షకు చదువుతున్నాడు. అక్కడికే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి, ఒక్కతిప్పకోడాని కవకాశం లేకుండా"

"నా పెద్దల్లుడు బెజవాడలో యింత బట్టల వర్తకమూ చేస్తున్నాడు. నా రెండో అల్లుడు మద్రాసులో పెద్ద వకీలు"

"అదిగో, అదే మానాయన తంబురా. చిన్నప్పుడు సంగీతం నేర్చుకోడానికి వెళ్ళి తంజావూరిలో సంపాదించాడది. తగినంత విద్య అంటలేదు; గాని దాని అసరాతోనే, దురన్న దుర్దాశాలకు పోకుండా మా నాయన కుటుంబ గౌరవం నిలబెట్టుకోగలిగాడు"

"అదే యిప్పటికీ నాకు పిత్ర్యం. మా నాయనపోయిన తరవాత వొక గాయకుడు పచ్చకాగితంవొకటి నాచేతిలో పెట్టి అది పుచ్చుకోపోయాడు; కాని నేను లొంగలేదు. అది విడిచిపెట్టడం మంచిది కాదనీ; దాని గంభీర నాదానికి ముగ్ధుణ్ణయీ, శక్తి వచ్చాక నేను తరంగాలూ అధ్యాత్మరామాయణ కీర్తనలూ సక్రమంగా నేర్చుకున్నాను"

"మా నాయన ఫోటో లేదు. ఆయన పోయేదాకా నాకు అది లేదన్న వూహ తట్టలేదు. తరవాత యే మనుకుంటే యేమిలాభమూ?"

"అదిగో మాఅమ్మ నవ్వుతూ నాకేసి యెలాచూస్తోందో చూడూ. ఆవిడ బతికే వుండగా, వెయ్యినూ్నటపదహార్లిచ్చి శిల్పిని గౌరవించి రాయించా నాపటం"

## 28

"ఇదంతా యెందుకు చెప్పానంటే? ఆలోచించుకో. ప్రస్తుతం, అదేకాదు, నీకు మరో నౌకరీ అయినా దొరకడం కష్టం. దొరికినా వోపట్టాన స్థిరంకాదు. అయినా జీతం పాతికరూపాయీలకు మించదు. నెలకి నూరురూపాయీల జీతం నువ్వు నీజీవితంలో చూడవు"

"నౌకరీతప్ప, జటిలమైన యీ భౌతిక ప్రపంచంలో మరోదారి లేదూ బతకడానికీ?"

"వినాశకాలం దాపరించడంవల్ల, జగద్గురుత్వం వెలిగించిన బ్రాహ్మణ జాతి నౌకర్ల జాతిగా తయారయిపోయిందిప్పడు. దీనివల్ల మనవాళ్ళేకాదు చెడడం, బ్రాహ్మలే అవలంబించడంవల్ల, అదేదో గొప్ప అనుకుని, మెరకల్లాంటి బ్రాహ్మణేతరయువకులు కూడా, పరమోత్కృష్టాలైన ఉత్పాదకశక్తి ఉత్సాహ శక్తి ప్రభుశక్తి బుద్ధిపూర్వకంగా చంపుకుని ఉద్యోగాల కెగబాకి ఆత్మవినాశం తెచ్చిపెట్టుకుంటున్నారు"

"అసలు, మానవజాతికి, బ్రాహ్మణధర్మాలే అస్వాభావికాలూ ప్రతి కూలాలూ అని స్థిరపడ్డ యీదినాల్లో ఇలాంటి ఆదర్శకత్వం బ్రాహ్మణజాతిని మరీ కుంగదీసేస్తోంది"

"కనక, నేనమ్మా బ్రహ్మ మొగంనుంచి వూడిపడ్డానని యెత్తెత్తి కాళ్ళు వెయ్యక, రైతాంగంతో సహకరించడం నేర్చుకుని వ్యవసాయం చేసుకో. లేకపోతే యేదో వర్తకం సాగించు. పెద్దయెత్తు యెత్తలేకపోతే, యే కాఫీ హోటలు దగ్గిరో కిల్లీదుకాణం పెట్టుకుంటే రాజాంగంగా బతకవచ్చు, పాతిక రూపాయీల పెట్టుబడితో. అది కూడా చేతకాదంటావా, వందచుట్టలూ డజ నగ్గిపెట్టెలూ పుచ్చుకుని, పొద్దుటిపూట స్టీమర్లదగ్గిరా, మధ్యాహ్నం పడవల రేవుల్లోనూ కోర్టులదగ్గిరా, సాయంత్రం సినిమాల దగ్గిరా తిరుగు అదీ యిష్టం లేదంటావా, కుట్టుమిషను పెట్టుకుని మా అంగడిదగ్గిర కూచో, మిషను నేను కొనిపెడతాను. అదీ కాదంటావా, కావెడుగుడ్డ లేవి కావాలంటే అవి యిస్తాను, వూళ్ళో తిరుగు, దమ్మిడీ పెట్టుబడి అక్కర్లేదు. పైగా యెప్పటిలాభం అప్పుడే

పట్టుకుపోవచ్చు. చెరువంత మేడమీది, జనం తక్కువగా వున్నాం, వొక చిన్నగదీ, వంటవసారా యిస్తాను, అద్దె యివ్వనక్కరలేదు తలదాచుకో"

"కష్టపడు, బాగుపడు. అంతే కాని నౌకరీ యిప్పించమని నన్ను వేధించకు, నీ మొగం కలకల్లాడుతోంది, నీకు నౌకరీ కర్మం యేమీ? ఆ వర్చస్సు ధూళి ధూసరితం చేసుకోకు. కాలం గడచిపోతోంది, లే, త్వరపడు"

"ఇంత చెప్పినా నీకింకా నౌకరీ వ్యామోహం పోదూ, ఫో-నా యెదట నుంచోకు, వెళ్ళిపో"

1928 జనవరి భారతి నుంచి
(సవరణలతో)
5-10-47 మొదలు ఆనందవాణిలో
వరాసగా ప్రకటితమున్నూ అయింది